VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : బుధవారం 15.07.2026

సంపుటి : 09 సంచిక : 36 , పేజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com




మల్లు రవికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నేతలు

# తెలంగాణ ప్రగతికి సరికొత్త రెక్కలు

- 2028 జూన్ 2 నాటికి వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుల నిర్మాణం పూర్తి
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో సీఎం రేవంత్ రెడ్డి కీలక భేటీ
- ఢిల్లీ పర్యటనలో కేంద్ర మంత్రులతో సీఎం రేవంత్ రెడ్డి వరుస భేటీలు
- తెలంగాణ విమానాశ్రయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ తో చర్చలు సఫలం
- రెండు ఎయిర్‌పోర్టుల పనులకు కేంద్రం పూర్తి సహకారం
- 2028 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నాటికి ప్రారంభోత్సవ లక్ష్యం
- గడువులోగా పనులు పూర్తి చేస్తామని ఇరుపక్షాల వెల్లడి
- వరంగల్ విమానాశ్రయానికి అంతర్జాతీయ హంగులు
- రక్షణ రంగానికి అత్యంత కీలకమైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్
- దేశ ఆర్థిక ప్రగతిలో భాగస్వామ్యం కానున్న తెలంగాణ
- రాష్ట్ర జీడీపీ వాటాను 10 శాతానికి పెంచడమే లక్ష్యమన్న సీఎం

ఢిల్లీ వెలుతురు జూలై 14:




తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక, ఆర్థిక ప్రగతికి విమానాశ్రయాల విస్తరణ ఎంతో అవసరమని గుర్తించిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆ దిశగా వేగంగా అడుగులు వేస్తున్నారు. తన దేశ రాజధాని ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన కేంద్ర మంత్రులతో వరుస సమావేశాలు నిర్వహిస్తూ అత్యంత బిజీగా గడుపుతున్నారు. రాష్ట్రానికి సంబంధించిన కీలక పెండింగ్ ప్రాజెక్టుల సాధనే లక్ష్యంగా కేంద్ర రహదారి రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై వారితో విస్తృతంగా చర్చించారు.కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, ఉన్నతాధికారులతో జరిపిన చర్చలు అత్యంత సానుకూల వాతావరణంలో ముగిశాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల పునరుద్ధరణ, నిర్మాణ పనులపై ఈ సమావేశంలో ఒక స్పష్టమైన అవగాహన కుదిరిందని చెప్పారు. తాను ఎప్పుడు విమానాశ్రయాల ఏర్పాటు గురించి ప్రస్తావించినా, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తక్షణమే స్పందించి అధికారులను ఆదేశిస్తున్నారని కొనియాడారు. తెలంగాణ ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి కేంద్రం నుంచి సంపూర్ణ సహకారం అందుతోందని రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల నిర్మాణ పనులను ఒక నిర్దిష్ట కాలపరిమితిలోగా పూర్తి చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్ణయించాయి. వచ్చే 2028 జూన్ 2 నాటికి, అంటే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నాటికి ఈ రెండు విమానాశ్రయాల పనులను వంద శాతం పూర్తి చేసి, అదే రోజు భక్తులు, ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని ఒక స్పష్టమైన లక్ష్యాన్ని పెట్టుకున్నట్లు రేవంత్ రెడ్డి ప్రకటించారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సైతం దీనిపై స్పందిస్తూ.

▶ మిగతా 2లో

# సింగరేణి బొగ్గు గనులపై రాజకీయ రచ్చ

- బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలపై కిషన్‌రెడ్డి నిప్పులు
- సింగరేణి భరోసా యాత్రలో కిషన్‌రెడ్డి ఆగ్రహం
- భూపాలపల్లి వేదికగా గత, ప్రస్తుత పాలకులపై విమర్శలు
- కేసీఆర్ చేతుల్లో జేబు సంస్థగా మారిన సింగరేణి
- పదిహేనేళ్లు వెనక్కి నెట్టేసారంటూ కేంద్రమంత్రి ఆరోపణ
- కార్మికుల కష్టార్జితాన్ని లూటీ చేశారంటూ కిషన్‌రెడ్డి మండిపాటు




- సొంత నియోజకవర్గాలకే సింగరేణి నిధుల మళ్ళింపు
- బొగ్గు గనుల ప్రాంతాల నిర్లక్ష్యంపై తీవ్ర ధ్వజం

# గద్వాలలో రూ. 376.25 కోట్ల విద్యుత్ పనులు..

- రాష్ట్ర అభివృద్ధికి విద్యుత్ రంగమే వెన్నెముక: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

గద్వాల జిల్లా వెలుతురు జూలై 14:



జోగులాంబ గద్వాల జిల్లాలో రూ.376.25 కోట్ల విలువైన విద్యుత్ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం రాష్ట్ర విద్యుత్ రంగాన్ని మరింత బలోపేతం చేసే కీలక అడుగని డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు.రైతులు, గృహ వినియోగదారులు, పరిశ్రమలకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యుత్ మౌలిక వసతుల విస్తరణకు ప్రభుత్వం పెద్దఎత్తున పెట్టుబడులు పెడుతోందన్నారు.ఎర్రవల్లిలో రూ.155 కోట్లతో 220/132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రం, గట్టు మండలం రాయపురంలో రూ.48 కోట్లతో 132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణానికి శంకుస్థాపన చేయడం గద్వాల జిల్లా విద్యుత్ అవసరాలను దీర్ఘకాలికంగా తీర్చేందుకు దోహదపడుతుందని చెప్పారు.

▶ మిగతా 2లో

## కాళేశ్వరం వైఫల్యం బీఆర్ఎస్ పాపమే

- నిపుణులు చెబితేనే నీళ్లు నింపుతాం
- మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజం
- బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు
- కాంగ్రెస్ రాకముందే కుంగిన కాళేశ్వరం
- గత పాలకుల నిర్లక్ష్యమే కారణమన్న మంత్రి




## పెరిగిన ధరలపై కాంగ్రెస్ ఆగ్రహం



- జూన్‌లో 4.38 శాతానికి చేరిన ద్రవ్యోల్బణం
- సామాన్యుడి బడ్జెట్ అతలాకుతలమైంది
- కేంద్ర ప్రభుత్వంపై జైరాం రమేశ్ విమర్శలు
- బీజేపీ పాలనలో ధరల భారమేననని మండిపాటు
- గణాంకాలతో సహా మోదీ ప్రభుత్వాన్ని నిలదీసిన జైరాం

6

## ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం పనులు ప్రారంభించాలి...


- ఫ్యూచర్ సిటీ-బందరు పోర్ట్ గ్రీన్‌ఫీల్డ్ రహదారికి అనుమతులు మంజూరు చేయండి
- రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయ రహదారి నిర్మించాలి.
- జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి



12

## సోషల్ మీడియాలో ఇందిరమ్మ ఇండ్ల హోం టూర్ వీడియోల హల్ చల్

- ఇందిరమ్మ ఇండ్ల శీనన్నకు ధన్యవాదాలు చెప్తున్న లబ్దిదారులు*
- ఇందిరమ్మ ఇండ్ల మంజూరు నుండి, నిర్మాణం, గృహ ప్రవేశం వరకు వీడియో రూపంలో సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్న అనేక మంది లబ్దిదారులు




## ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల సాగు చెయ్యాలి: వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, వెలుతురు జూలై 14



మంగళవారం రోజున నిర్వహించిన 'రైతు నేస్తం' కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. రైతులతో నేరుగా మాట్లాడి వాస్తవ పరిస్థితులను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు.మంత్రిగారు మాట్లాడుతూ ఈ ఏడాది తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా వర్షపాతం తక్కువగా నమోదవుతోందన్నారు. దీంతో కృష్ణా, గోదావరి ఆయకట్టు ప్రాంతాల్లో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా రైతులు పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. భూగర్భ జలాల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించి రైతులకు సరైన సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ, నీటిపారుదల శాఖ, భూగర్భ జలాల శాఖ, భారత వాతావరణ శాఖ (IMD) అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు ఇవ్వాలని చెప్పారు.

▶ మిగతా 2లో

## పదవుల కంటే ప్రజల పక్షాన నిలబడటమే గొప్పదని చాటిన నేత ముద్రగడ పద్మనాభం

- కాపు జాతి ఆత్మగౌరవానికి ప్రతీక
- కాపుల హక్కుల కోసం తన జీవితాన్నే పోరాటంగా మార్చుకున్న యోధుడు
- కాపు జాతి ఆత్మగౌరవం కోసం ఆకలిని ఆయుధంగా మార్చుకుని నిరాహార దీక్షలు చేసిన నాయకుడు
- తన ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా కాపుల హక్కుల కోసం పోరాడిన త్యాగశీలి
- లాఠీలు ఎదురైనా... అరెస్టులు ఎదురైనా... ఒత్తిళ్లు వచ్చినా వెనక్కి తగ్గని ధీరుడు ముద్రగడ




## ఇరాన్ సైనిక సామర్థ్యం పూర్తిగా ధ్వంసం

- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన
- హర్మూజ్ నౌకలపై రక్షణకు 20 శాతం టోల్ బాదుడు
- యూఎస్ కాంగ్రెస్‌కు అధికారిక సమాచారం
- జూలై 7 నుంచే మళ్లీ యుద్ధ రంగంలోకి దిగినట్లు లేఖ
- శాంతి ఒప్పందాన్ని ఉల్లంఘించిన ఇరాన్
- దౌత్య ప్రయత్నాలను పక్కనబెట్టి నౌకలపై దాడులు



2

# మల్లు రవికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నేతలు

- నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ అగ్రనేతలు
- ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన మీనాక్షి నటరాజన్, మహేష్ కుమార్ గౌడ్
- ఎంపీ వేమ్ నరేందర్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ హాజరు
- ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించిన నేతలు

**హైదరాబాద్ వెలుతురు జూలై 14:**

హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ నాయకులు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎంపీ వేమ్ నరేందర్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ కలిసి మల్లు రవిని శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రజాసేవలో మల్లు రవి మరిన్ని విజయాలు సాధించాలని, ప్రజలకు మరింత చేరువై సేవలు అందించాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నాయకులు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ మల్లు రవి రాజకీయ, ప్రజాసేవా ప్రస్థానాన్ని అభినందించారు.

# తెలంగాణ ప్రగతికి సరికొత్త...

**(మొదటి పేజీ తరువాయి)**

నిర్దేశిత గడువు లోపే విమానాశ్రయాల నిర్మాణాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.వరంగల్ (మామునూరు) విమానాశ్రయాన్ని కేవలం ఒక సాధారణ ఎయిర్‌పోర్ట్‌లా కాకుండా అంతర్జాతీయ ప్రమాణాలతో అద్భుతంగా నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఓరుగల్లు వైభవాన్ని ప్రతిబింబించేలా, కాకతీయ సంస్కృతి, కళాఖండాల ఆకృతులతో ఈ విమానాశ్రయం యొక్క ప్రధాన కట్టడాలను డిజైన్ చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. దీనివల్ల వరంగల్ ప్రాంత పర్యాటక రంగానికి, పరిశ్రమల స్థాపనకు సరికొత్త ఊపు వస్తుందని, స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.భారత రక్షణ రంగానికి (డిఫెన్స్) వ్యూహాత్మకంగా ఆదిలాబాద్ విమానాశ్రయం ఎంతో అవసరమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాయి. ఈ ఎయిర్‌పోర్ట్ విస్తరణ మరియు పూర్తి స్థాయి నిర్మాణానికి గానూ రాష్ట్ర ప్రభుత్వం తరపున మరో 1500 ఎకరాల భూమిని సేకరించి కేంద్రానికి అప్పగించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సరిహద్దు జిల్లాలో ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే అటు సైనిక అవసరాలకు, ఇటు వెనుకబడిన ఆదిలాబాద్ ప్రాంత ఆర్థిక ప్రగతికి ఎంతో మేలు జరుగుతుందని ఇరుపక్షాలు అభిప్రాయపడ్డాయి.ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 'వికసిత్ భారత్' నినాదంతో 2045 నాటికి దేశాన్ని 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని పెద్ద లక్ష్యాన్ని పెట్టుకుందని, ఇందులో తెలంగాణ భాగస్వామ్యం వహిస్తుందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దేశ జనాభాలో కేవలం 2.50 శాతం మాత్రమే ఉన్న తెలంగాణ, దేశ మొత్తం జీడీపీలో 5 శాతం వాటాను కలిగి ఉండటం గర్వకారణమన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు, పరిశ్రమలు రావాలంటే విమానాశ్రయాల అనుసంధానత చాలా ముఖ్యమని, అందుకే తెలంగాణ జీడీపీ వాటాను 5 శాతం నుండి 10 శాతానికి పెంచేలా ప్రణాళికలు రూపొందించామని సీఎం వివరించారు.కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక 'ఉడాన్' పథకం కింద దేశవ్యాప్తంగా ప్రాంతీయ విమానయాన రంగాన్ని బలోపేతం చేసేందుకు రూ.30 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు కేంద్ర పౌరవిమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు ఈ సందర్భంగా వెల్లడించారు. ఇందులో భాగంగానే తెలంగాణలోని వరంగల్, ఆదిలాబాద్ ప్రాజెక్టులకు అవసరమైన నిధులు, సాంకేతిక అనుమతులు వేగంగా మంజూరు చేస్తామన్నారు. అభివృద్ధి పనుల విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సంపూర్ణంగా సహకరిస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా కేంద్రమంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.రాజకీయాలు ఎలా ఉన్నా, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధే ఏకైక లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సహకార స్ఫూర్తి (ఫెడరల్ స్ఫూర్తి) నిరంతరం కొనసాగుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కేంద్రాన్ని డిమాండ్ చేసి, ఒప్పించి రాష్ట్రానికి రావలసిన నిధులను, ప్రాజెక్టులను సాధించుకుంటామన్నారు. రాబోయే పార్లమెంట్ సమావేశాల సమయంలో తాను మళ్లీ ఢిల్లీకి వస్తానని, ఆ సమయంలో మిగిలిన కేంద్ర మంత్రులను కూడా వ్యక్తిగతంగా కలిసి రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన మరిన్ని అంశాలపై చర్చిస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీడియా ముఖంగా స్పష్టం చేశారు.

# గుడిసెలు లేని గ్రామాలే లక్ష్యం: మెదక్ కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్, వెలుతురు జూలై 14:**



ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రతి అర్హ పేద కుటుంబానికి పక్కా ఇల్లు అందించడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. కొల్చారం మండల కేంద్రంలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని హౌసింగ్ పీడీ మాణిక్యం, తహసీల్దార్ శ్రీనివాసాచారి, ఎంపీడీవో రహీం మున్నీసా బేగం, సర్పంచ్‌తో కలిసి ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొదటి విడతలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వెంటనే ప్రారంభించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. రెండో విడతలో గుడిసెల్లో నివసించే నిజమైన అర్హులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పథకం అమలులో పారదర్శకత, జవాబుదారీతనం, వేగం ఉండేలా సమన్వయంతో పనిచేయాలన్నారు.జిల్లాలో తొలి విడతలో 9 వేల ఇళ్లు మంజూరుకాగా, నిర్మాణ పురోగతి 83 శాతం పూర్తైందన్నారు. ఇప్పటివరకు 1,700 ఇళ్లు పూర్తై గృహప్రవేశాలు జరిగాయని, 2,400 ఇళ్లు స్లాబ్ పూర్తై ఫినిషింగ్ దశలో, 650 ఇళ్లు రూఫ్ లెవెల్‌లో, 1,400 ఇళ్లు బేస్‌మెంట్ దశలో ఉండగా, మిగిలినవి పునాది దశలో ఉన్నాయని వివరించారు. ఇంకా 1,600 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించలేదని, వారిలో అవగాహన కల్పించి వెంటనే పనులు మొదలు పెట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు మహిళా సంఘాల ద్వారా రుణాలు అందించి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రెండో విడతలో గుడిసెల సర్వే పూర్తయిందని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి పక్కా ఇల్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు.

# సింగరేణి బొగ్గు గనులపై రాజకీయ రచ్చ

**హైదరాబాద్ వెలుతురు జూలై 14:**

తెలంగాణ గుండెకాయ లాంటి సింగరేణి బొగ్గు గనుల రక్షణే ధ్యేయంగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) చేపట్టిన 'సింగరేణి భరోసా యాత్ర' రెండో రోజుకు చేరుకుంది. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జరిగిన ఈ భారీ బహిరంగ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రగతికి ఊపిరిగా నిలిచిన సింగరేణి సంస్థను గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తమ స్వార్థ రాజకీయాల కోసం ఎలా వాడుకుంటున్నాయో ఆధారాలతో సహా వివరించారు. ఈ రెండు పార్టీల నిర్లక్ష్యం వల్ల సింగరేణి కార్మికులు ఈరోజు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అప్పటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) సింగరేణి సంస్థను తన సొంత జేబు సంస్థగా మార్చుకున్నారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఒకనాడు లాభాల బాటలో నడిచిన ఈ ప్రభుత్వ రంగ సంస్థ.. కేసీఆర్ తీసుకున్న తప్పుడు నిర్ణయాలు, అవినీతి విధానాల వల్ల ఏకంగా 15 సంవత్సరాలు వెనక్కి పడిపోయిందని ఆరోపించారు. కేసీఆర్ కుటుంబ సభ్యులు, వారి అనుచరులు సింగరేణి కాంట్రాక్టులను దక్కించుకుని వేల కోట్ల రూపాయలను నిస్సిగ్గుగా దోచుకున్నారని, దీనివల్ల సంస్థ ఆర్థికంగా కోలుకోలేని దెబ్బతిన్నదని కిషన్ రెడ్డి దుయ్యబట్టారు.తెలంగాణ బొగ్గు గనుల్లో రాత్రింబగళ్లు కష్టపడి పని చేస్తున్న కార్మికుల చెమట చుక్కలతో సింగరేణి లాభాలను గడిస్తోందని, కానీ పాలకులు మాత్రం ఆ సంస్థను తమ సొంత ఆస్తిలా భావిస్తున్నారని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు గానీ, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పాలకులు గానీ సింగరేణిని తమ 'తాత జాగీరు' లాగా వాడుకుంటున్నారని ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. కార్మికుల సంక్షేమాన్ని గాలికొదిలేసి, సంస్థ నిధులను ఇతర అవసరాలకు తరలిస్తూ కార్మికుల నమ్మకాన్ని వమ్ము చేస్తున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం సంస్థకు ఆశించిన స్థాయిలో లాభాలు లేకపోవడంతో కార్మికులు తమ భవిష్యత్తుపై తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు.సింగరేణి సంస్థ ద్వారా వచ్చే లాభాలను, కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులను చట్టప్రకారం బొగ్గు గనులు ఉన్న ప్రాంతాల అభివృద్ధి కోసమే ఖర్చు చేయాల్సి ఉంటుంది. భూపాలపల్లి, కొత్తగూడెం, మంచిర్యాల వంటి ప్రాంతాల ప్రజల తాగునీరు, రోడ్లు, విద్య, వైద్య అవసరాల కోసం ఈ నిధులు వాడాలి. కానీ, గత కేసీఆర్ ప్రభుత్వం ఈ నిధులను సింగరేణి ప్రాంతంలో ఖర్చు చేయకుండా.. కేసీఆర్ కుటుంబ సభ్యులైన కేటీఆర్, హరీష్ రావు ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల, సిద్ధపేట, గజ్వేల్ వంటి సొంత నియోజక వర్గాలకు చట్టవిరుద్ధంగా మళ్లించారని కిషన్ రెడ్డి ఆరోపించారు. ఇది సింగరేణి ప్రాంత ప్రజలకు చేసిన ద్రోహమని ఆయన అన్నారు.సింగరేణి సంస్థను మరింత విస్తరించి, లాభాల బాటలోకి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో కేంద్రంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం సింగరేణి సంస్థ అభివృద్ధి కోసం అదనంగా కొత్త కోల్ బ్లాకులను (బొగ్గు గనులు) కేటాయించినప్పటికీ, కేసీఆర్ ప్రభుత్వం వాటిని ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. కేవలం రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే కేంద్రం ఇచ్చిన అవకాశాలను బీఆర్ఎస్ సర్కార్ కాలరాసిందన్నారు. పైగా, సింగరేణి సమస్యలు లేదా అభివృద్ధి ప్రాజెక్టుల గురించి కేసీఆర్ తన పాలనా కాలంలో ఒక్కసారి కూడా కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపలేదని కిషన్ రెడ్డి వెల్లడించారు.కేవలం బీఆర్ఎస్ ప్రభుత్వమే కాకుండా, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో పయనిస్తోందని కిషన్ రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్ పాలన ముగిసే సమయానికి తెలంగాణ జెన్‌కోకు కేవలం రూ.8,958 కోట్ల అప్పులు ఉంటే, ప్రస్తుతం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన కొన్ని నెలల్లోనే ఆ అప్పులు ఏకంగా రూ.26,875 కోట్లకు చేరుకున్నాయని అధికారిక గణాంకాలను బయటపెట్టారు. ఈ అప్పులను పూడ్చుకోవడానికి, కొత్తగా అప్పులు తెచ్చుకోవడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏకంగా అధికారులను, కేంద్ర సంస్థలను బెదిరించే స్థాయికి దిగజారిందని కిషన్ రెడ్డి విమర్శించారు.సింగరేణి సంస్థను నిర్వీర్యం చేసేందుకు కొందరు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని కిషన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. సింగరేణి గనుల్లో నాణ్యమైన బొగ్గు లభించడం లేదని, ఇక్కడి బొగ్గు వాడకం లాభదాయకం కాదంటూ పనిగట్టుకుని చేస్తున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. ఇలాంటి ప్రచారం చేయడం వల్ల సంస్థ ప్రతిష్ట అంతర్జాతీయంగా దెబ్బతింటుందని, ఇది చాలా ప్రమాదకరమైన విషయమని హెచ్చరించారు. సింగరేణి బొగ్గుకు ఎంతో డిమాండ్ ఉందని, కేవలం ప్రభుత్వాల అసమర్థత వల్లే ఈ విధమైన వదంతులు వ్యాప్తి చెందుతున్నాయని, దీనివల్ల కార్మికుల్లో అభద్రతాభావం పెరుగుతోందని అన్నారు.సింగరేణి సంస్థ మళ్లీ పూర్వ వైభవాన్ని సాధించాలంటే కొత్త బొగ్గు గనుల తవ్వకాలు వేగవంతం కావాలని కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ అందుబాటులోకి వస్తే సింగరేణి సంస్థకు భారీగా లాభాలు చేకూరుతాయని, కార్మికుల ఉద్యోగ భద్రతకు ఢోకా ఉండదని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు విజయవంతం కావడానికి కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. సింగరేణి కార్మికుల ప్రయోజనాల కోసం బీజేపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, భరోసా యాత్ర ద్వారా కార్మికుల గొంతుకగా నిలుస్తామని కిషన్ రెడ్డి భరోసా ఇచ్చారు.

# ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల సాగు చెయ్యాలి: వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**(మొదటి పేజీ తరువాయి)**



వర్షపాతం తక్కువగా ఉన్నందున జొన్న, సజ్జ, కొర్ర, పెసర, మినుము, కంది వంటి తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలని మంత్రి సూచించారు. అలాగే శాస్త్రవేత్తలు సూచించిన విధంగా తక్కువ కాలంలో పండే, తక్కువ నీరు అవసరమయ్యే అధిక దిగుబడి పంట రకాలను ఎంచుకోవాలని రైతులకు సూచించారు.ఈ సందర్భంగా ఐఐఎంఆర్ డైరెక్టర్ మాట్లాడుతూ కొర్ర, సజ్జ, జొన్న వంటి చిరుధాన్యాల సాగును పెంచాలని రైతులకు సూచించారు.భారత వాతావరణ శాఖ (IMD), హైదరాబాద్ సంచాలకురాలు శ్రీమతి స్టెల్లా మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఇప్పటివరకు సాధారణం కంటే 30 నుంచి 35 శాతం వరకు తక్కువ వర్షపాతం నమోదైందన్నారు. వచ్చే మూడు నెలల్లో కూడా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున తక్కువ నీరు అవసరమయ్యే పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు.ఇరిగేషన్ శాఖ అధికారులు మాట్లాడుతూ ఎగువ రాష్ట్రాల్లో కూడా వర్షపాతం తక్కువగా ఉండటంతో కృష్ణా, గోదావరి నదుల్లో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉందన్నారు. అందువల్ల నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటలు సాగు చేయాలని సూచించారు.భూగర్భ జలాల శాఖ డైరెక్టర్ జిల్లాల వారీగా భూగర్భ జలాల పరిస్థితిని వివరించారు. రైతు నేస్తం కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి శ్రీ కె. సురేంద్ర మోహన్, ఐఏఎస్, వ్యవసాయ శాఖ సంచాలకులు శ్రీ బి. గోపి, ఐఏఎస్, సహకార శాఖ ప్రత్యేక సంచాలకులు శ్రీ రాహుల్ రాజ్, ఐఏఎస్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, నీటిపారుదల శాఖ ఇంజినీర్-ఇన్-చీఫ్ (ఈఎన్‌సీ) శ్రీ మధుసూదన్ రావు, భూగర్భ జలాల శాఖ సంచాలకులు శ్రీ లక్ష్మణ్, భారత చిరుధాన్యాల పరిశోధన సంస్థ (IIMR) డైరెక్టర్ డాక్టర్ సత్యవతి, భారత వాతావరణ శాఖ (IMD) హైదరాబాద్ సంచాలకులు శ్రీమతి స్టెల్లా, ఐఎండీ శాస్త్రవేత్త డాక్టర్ శ్రావణి, భారత నూనెగింజల పరిశోధన సంస్థ (IIOR) డైరెక్టర్ డాక్టర్ సురేష్, మెట్ట పరిశోధన సంస్థ (CRIDA) శాస్త్రవేత్త డాక్టర్ కె.వి. రావు, అలాగే ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ మహాదేవప్ప పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయా రంగాలకు సంబంధించిన నిపుణులు రైతులకు ఎల్‌నినో పరిస్థితులు, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనే పంటల నిర్వహణ, నీటి వినియోగం, ప్రత్యామ్నాయ పంటల సాగు, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై పలు సూచనలు చేశారు.

# గద్వాలలో రూ. 376.25 కోట్ల విద్యుత్ పనులు..

**(మొదటి పేజీ తరువాయి)**

వడ్డేపల్లి, రాజోలి, ఐజ, మల్దకల్ మండలాల పరిధిలోని తొమ్మిది గ్రామాల్లో నూతనంగా నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాలను ప్రారంభించడం వల్ల వేలాది మంది రైతులు, గ్రామీణ ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందుతాయని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులకు ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణీ కూడా జరిగిందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ రంగంలో చేపడుతున్న సంస్కరణలు, మౌలిక వసతుల విస్తరణతో వ్యవసాయం, పరిశ్రమలు, గ్రామీణాభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని తెలిపారు. తెలంగాణను విద్యుత్ పరంగా మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎంపీ మల్లు రవి, ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఇరాన్ సైనిక సామర్థ్యం పూర్తిగా ధ్వంసం

- వాణిజ్య నౌకలపై 20 శాతం టోల్ రక్షణ పన్ను
- ఓవల్ ఆఫీస్ నుంచి ట్రంప్ హెచ్చరికలు

**అమెరికా వెలుతురు జూలై 14:**

పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మరింత ముదిరాయి. ఇరాన్‌కు సంబంధించిన సైనిక సామర్థ్యాన్ని తాము పూర్తిగా ధ్వంసం చేశామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. హర్మూజ్ జలసంధి ప్రాంతంలో ఇరాన్ ఉనికి లేకుండా చేసేందుకు, వారి సైనిక శక్తిని పూర్తిగా నిర్వీర్యం చేసే దిశగా అమెరికా బలగాలు భీకర దాడులు కొనసాగిస్తున్నాయని ఆయన వెల్లడించారు. శత్రుదేశం కోలుకోలేని విధంగా అమెరికా సైన్యం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోందని, ఇరాన్ దాడుల ఆటకట్టించేందుకు తాము వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ట్రంప్ స్పష్టం చేశారు.ఇరాన్ దేశంపై తాము తిరిగి సైనిక చర్యలను ప్రారంభించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారికంగా యూఎస్ కాంగ్రెస్‌కు తెలియజేశారు. ఈ మేరకు కాంగ్రెస్‌కు ఒక లేఖ పంపిన ఆయన, జూలై 7 నుంచే ఇరాన్‌పై దాడులను పునరుద్ధరించినట్లు స్పష్టం చేశారు. హర్మూజ్ జలసంధి గుండా వెళ్తున్న అంతర్జాతీయ నౌకలపై ఇరాన్ వరుస దాడులకు తెగబడటంతో, అంతర్జాతీయ నిబంధనల ప్రకారం నౌకల రక్షణ కోసం తాము ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ట్రంప్ ఆ లేఖలో విడమరిచి చెప్పారు.ఇటీవల కాలంలో అమెరికా, ఇరాన్ దేశాల మధ్య దౌత్యపరమైన చర్చలు జరిగి ఒక శాంతి ఒప్పందం కుదిరినప్పటికీ.. ఇరాన్ దాన్ని ఏమాత్రం గౌరవించలేదని ట్రంప్ ఆరోపించారు. ఒప్పందం కుదిరిన కొద్ది రోజులకే ఇరాన్ దాన్ని ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించిందన్నారు. తాము ఎంతో చిత్తశుద్ధితో శాంతి కోసం ప్రయత్నించినప్పటికీ, గతవారమే ఇరాన్ ఏకంగా మూడు అంతర్జాతీయ నౌకలపై దాడులు చేసిందని మండిపడ్డారు. ఒప్పందంలో తమకు నచ్చని అంశాలు ఉన్నాయనే నెపంతో వారు దాన్ని రద్దు చేసుకున్నారని, ఇటువంటి పిచ్చి చేష్టలను తాము ఎంతమాత్రం సహించబోమని ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు.హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే ఇతర దేశాల వాణిజ్య నౌకల నుంచి భారీగా 20 శాతం టోల్ పన్ను వసూల్ చేయనున్నట్లు ట్రంప్ కుండబద్దలు కొట్టారు. ఇరాన్ ముతాల దాడుల నుంచి అంతర్జాతీయ వాణిజ్య నౌకలకు అమెరికా సైన్యం పూర్తి రక్షణ కల్పిస్తోందని, ఇందుకు గాను తమకు భారీగా ఆర్థిక ఖర్చులు అవుతున్నాయని వివరించారు. ప్రపంచంలోనే అత్యంత సంపన్నమైన ఈ ప్రాంతానికి తాము ఉచితంగా రక్షణ కల్పించలేమని, రక్షణ కోసం అమెరికా పెడుతున్న ఖర్చులను ఆయా దేశాల నుంచే తిరిగి వసూల్ చేసుకుంటామని ఆయన తేల్చిచెప్పారు.వైట్‌హౌస్‌లోని ఓవల్ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడిన ట్రంప్, ఇరాన్‌పై ఈ రాత్రి మరింత భీకరమైన దాడులు చేయబోతున్నట్లు హెచ్చరించారు. ఇప్పటికే ఆ దేశాన్ని అన్ని రంగాల్లోనూ దెబ్బ తీశామని, వారి ఆర్థిక వనరులను కట్టడి చేశామని చెప్పారు. ఇందులో భాగంగా ఇరాన్ ఓడరేవులపై తాము మళ్లీ పూర్తి స్థాయిలో దిగ్బంధనం విధిస్తున్నట్లు ప్రకటించారు. అయితే ఈ దిగ్బంధనం కేవలం ఇరాన్ నౌకలకే పరిమితమని, హర్మూజ్ జలసంధిలో ఇతర దేశాల వాణిజ్య నౌకల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు, ఆటంకాలు ఉండబోవని ఆయన హామీ ఇచ్చారు.చమురు అవసరాల కోసం అమెరికా ఎవరిపైనా ఆధారపడటం లేదని, ముఖ్యంగా గల్ఫ్ దేశాల చమురు తమకు అస్సలు అవసరం లేదని ట్రంప్ స్పష్టం చేశారు. ప్రపంచంలోనే అత్యధిక చమురు నిల్వలు ప్రస్తుతం అమెరికా వల్లే ఉన్నాయని ఆయన గర్వంగా ప్రకటించారు. ఒకవేళ వెనెజువెలా నిల్వలను కూడా కలిపితే.. ప్రపంచ చమురు సరఫరాలో 50 శాతానికి పైగా వాటా తమ పరిధిలోనే ఉంటుందన్నారు. తమ స్వంత అవసరాల కోసం కాకుండా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ స్థిరత్వం కోసం మరియు మిత్రదేశాల ప్రయోజనాల కోసమే తాము ఈ ప్రాంతంలో జోక్యం చేసుకుంటున్నామని వివరించారు.పశ్చిమాసియాలో తమకు అత్యంత నమ్మకమైన మిత్ర దేశాలైన ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ (యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్)ల భద్రతను కాపాడేందుకే అమెరికా ఈ సైనిక చర్యలకు పూనుకుందని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ దూకుడు కారణంగా ఈ దేశాల ఉనికికి, ఆర్థిక ప్రయోజనాలకు ముప్పు వాటిల్లకుండా అమెరికా సైన్యం ఒక కవచంలా నిలబడుతుందని చెప్పారు. మిత్రపక్షాల రక్షణ బాధ్యతను తాము ఎంతో సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని, ఈ ప్రాంతంలో శాంతిభద్రతలను కాపాడటంలో అమెరికా పాత్ర ఎల్లప్పుడూ అగ్రగామిగానే ఉంటుందని ఆయన పేర్కొన్నారు.అమెరికా జరిపిన మెరుపు దాడుల్లో ఇరాన్ సైన్యానికి చెందిన టాప్ కమాండర్లలో అత్యధిక మంది అంతమొందించబడ్డారని ట్రంప్ సంచలన విషయాలు వెల్లడించారు. ఇరాన్ అగ్రనేత అలీ ఖమేనీ ఇప్పటికే చనిపోయాడని, సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ కూడా 90 శాతం చనిపోయినట్లేనని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఇరాన్ వద్ద ఎలాంటి నౌకాదళం గానీ, వైమానిక దళం గానీ మిగలలేదని.. అంతా సర్వనాశనమైందని చెప్పారు. వారి గగనతల రక్షణ వ్యవస్థలను సైతం అమెరికా క్షిపణులు పూర్తిగా ధ్వంసం చేశాయని, అత్యున్నత నాయకత్వం మొత్తం హతమవడంతో ఇరాన్ సైన్యం ఇప్పుడు నాయకుడు లేని నౌకలా మారిందని ట్రంప్ విశ్లేషించారు.

# ఈ నెల 20న క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఎల్ఐజీ ఇండ్లకు శ్రీకారం

- దశలవారీగా లక్ష ఇండ్ల నిర్మాణం
- పైలట్ ప్రాజెక్టుగా నియోజకవర్గానికి వెయ్యి ఇండ్ల వరకు నిర్మాణం
- గ్రామీణ ప్రాంతాల్లో మొదలైన ఇందిరమ్మ ఇళ్ల విప్లవం...
- ఇప్పుడు పట్టణ పేదల జీవితాల్లోకి
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**హైదరాబాద్ వెలుతురు జూలై 14:**



గ్రామీణ ప్రాంతాలల్లో ఇందిరమ్మ ఇండ్లతో పెద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేస్తున్న ప్రజా ప్రభుత్వం ఇప్పుడు అదే సంకల్పంతో క్యూర్ ప్రాధిలోని పేదల సొంతింటి స్వప్నాన్ని నిజం చేసేందుకు మరో చారిత్రాత్మక అడుగు వేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌరసంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనలకు అనుగుణంగా క్యూర్ పరిధిలో దశల వారీగా లక్ష ఎల్.ఐ.జి. ఇందిరమ్మ ఇండ్లను నిర్మించబోతున్నామని, ఇందుకు సంబంధించి ఇప్పటికే పరిపాలన అనుమతులు కూడా ఇవ్వడం జరిగిందన్నారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయం క్యూర్ పరిధిలో ఎల్ఐజీ ఇందిరమ్మ ఇండ్ల పై హౌసింగ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీన క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఎల్ఐజీ ఇండ్ల పథకానికి శ్రీకారం చూడుతున్నామని ప్రకటించారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు శ్రీ పొన్నం ప్రభాకర్, శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు, హైదరాబాద్ జిల్లా మంత్రి శ్రీ మహ్మద్ అజారుద్దీన్‌తో కలిసి పథకానికి సంబంధించిన విదివిధానాలను, దరఖాస్తుల ఆహ్వానం, అర్హతలు, టెండర్ల ప్రక్రియ, అమలు విధానం తదితర పూర్తి మార్గదర్శకాలను ప్రకటిస్తామని వివరించారు.2026-27 ఆర్థిక సంవత్సరంలో క్యూర్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఎల్ఐజీ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, తొలి దశలో పైలట్ ప్రాజెక్టుగా ప్రతి నియోజకవర్గానికి కనీసం 500 చొప్పున ఆయా స్థానిక పరిస్థితులనుబట్టి అవసరమైన చోట వెయ్యి వరకు నిర్మిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం ఎలాంటి ముందుచూపు లేకుండా, హైదరాబాద్ నగరానికి 30 నుంచి 40 కిలోమీటర్ల దూరంలో అరకొరగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించ డంవల్ల తమ జీవనోపాధి దెబ్బతింటుందని, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కోల్పోతామనే ఆందోళనతో చాలామంది అక్కడ నివసించలేకపోయారని అన్నారు.తమ ప్రభుత్వం మాత్రం పేదల జీవన వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని వారు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే, వారి ఉపాధి, పిల్లల విద్య, వైద్య సౌకర్యాలు, రవాణా వంటి అంశాలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకొని అత్యంత ముఖ్యమైన ప్రాంతాలల్లో కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాల్లో ఇండ్లను నిర్మిస్తున్నామని, ఆ స్థలములో వారికి వాటా ఇస్తూ యాజమాన్య హక్కు కల్పిస్తూ వారి కుటుంబాలకు శాశ్వత ఆర్థిక భద్రతను కల్పిస్తున్నామన్నారు.క్యూర్ పరిధిలో హైదరాబాద్, సైబరాబాద్, మేడ్చల్ మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నియోజకవర్గాలల్లో స్థలాలను గుర్తించడం జరిగిందని, ఈ స్థలాలను ఇప్పటికే హౌసింగ్ విభాగం పొజిషన్ లోకి తీసుకుందని, ఎక్కడ ఎన్ని ఇండ్లు, ఎన్ని అంతస్తులు నిర్మించాలి, ఒక్కో ప్లాట్ విస్తీర్ణం, బిల్డింగ్ డిజైన్‌లను గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో చర్చించి రెండు, మూడు రోజులల్లో తుది రూపును ఇస్తామని వెల్లడించారు.

# ఎస్ఐఆర్ గడువు పెంచాలని ఈసీకి కాంగ్రెస్ వినతి

- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డిని కలిసిన మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ నేతలు
- హైదరాబాద్‌లో ఓటరు సవరణ ప్రక్రియ కేవలం 21 శాతమే పూర్తైందని వెల్లడి
- మరో 10 రోజుల గడువు సరిపోదని.. అదనపు సమయం ఇవ్వాలని విజ్ఞప్తి
- బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లడం లేదని, ఫారాలు అందించడం లేదని ఫిర్యాదులు
- విద్యార్థులు, టీచర్లు, జీహెచ్ఎంసీ సహకారంతో ప్రక్రియ వేగవంతం చేయాలని సూచన
- అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపోకూడదని స్పష్టం
- ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని పిలుపు

**హైదరాబాద్ వెలుతురు జూలై 14:**



తెలంగాణలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ఓటరు సవరణ ప్రక్రియ గడువును పొడిగించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డిని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నేతలు కలిసి కోరారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా హైదరాబాద్‌లోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటరు సవరణ ప్రక్రియ నత్తనడకన సాగుతోందన్నారు. ప్రస్తుతం హైదరాబాద్ జిల్లాలో సగటున కేవలం 21 శాతం మాత్రమే ప్రక్రియ పూర్తైందని తెలిపారు. మిగిలిన 10 రోజుల గడువు సరిపోదని, మరింత సమయం ఇవ్వాల్సిన అవసరం ఉందని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు.హైదరాబాద్‌లో సుమారు 4,500 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, పట్టణ ప్రాంతాల్లో ఓటరు సవరణ ప్రక్రియ ఆశించిన స్థాయిలో జరగడం లేదన్నారు. బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లడం లేదని, ఫారాలు సక్రమంగా అందించడం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు.ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, జీహెచ్ఎంసీ సిబ్బంది సహకారాన్ని వినియోగించాలని ఎన్నికల కమిషన్‌ను కోరినట్లు మంత్రి తెలిపారు. బీఎల్‌వోలకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఇబ్బందులు లేకుండా చెల్లింపులు కూడా చేసినట్లు చెప్పారు.అర్హత కలిగిన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తప్పిపోకూడదని, అందుకే ఎస్ఐఆర్ గడువును పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నామని పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే బాధ్యత అందరిదని, హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు వచ్చే రోజుల్లో క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బలమూరి వెంకట్, ఎమ్మెల్యేలు శ్రీ గణేష్, నవీన్ యాదవ్, డీసీసీ అధ్యక్షులు దీపక్ జాన్, మోత రోహిత్, టీపీసీసీ ఎలక్షన్ కమిషన్ కోఆర్డినేటర్ కమిటీ చైర్మన్ రాజేష్‌తో పాటు ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# వచ్చే ఏడాది ప్రారంభం కానున్న రామగుండం ఈఎస్ఐ ఆస్పత్రి, నాచారం నర్సింగ్ కాలేజీ

**హైదరాబాద్, వెలుతురు జూలై 14:**





రామగుండంలో 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రి, నాచారంలో ఈఎస్ఐ నర్సింగ్ కాలేజీని వచ్చే ఏడాది కల్లా ప్రారంభిస్తామని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ ప్రకటించారు. రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ & కర్మాగారాల మరియు శాఖ మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ చేసిన విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి, ఈ రెండు ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసి సేవల్లోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు.హైదరాబాద్‌లోని సనత్‌నగర్ ఈఎస్ఐసీ ఆస్పత్రిలో నూతన ఓపీడీ బ్లాక్‌ను కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ, డా. గడ్డం వివేక్ వెంకటస్వామి కలిసి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, మన్సుఖ్ మాండవీయ నాయకత్వంలో ఈఎస్ఐసీ దేశవ్యాప్తంగా కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా కీలక అడుగులు వేస్తోందని అన్నారు. తన తండ్రి, మాజీ కేంద్ర కార్మిక శాఖ మంత్రి కాకా వెంకటస్వామి హయాంలో కూడా సనత్‌నగర్ ఈఎస్ఐ ఆస్పత్రిని సందర్శించానని, ఇప్పుడు రాష్ట్ర కార్మిక మంత్రిగా వచ్చి చూసినప్పుడు ఆస్పత్రిలో వచ్చిన విప్లవాత్మక మార్పులు తనను ఎంతో ఆకట్టుకున్నాయని చెప్పారు. పూర్తి స్థాయి కార్డియాక్ కేర్ సెంటర్, బైపాస్ సర్జరీలు, అత్యాధునిక డయాలసిస్ యూనిట్, క్యాన్సర్ రోగులకు ఆధునిక చికిత్సలు అందించడం ఈఎస్ఐసీ సేవల విస్తరణకు నిదర్శనమని పేర్కొన్నారు. ఇందుకు కేంద్ర మంత్రి, ఈఎస్ఐసీ అధికారులు, వైద్య సిబ్బందిని అభినందించారు.తెలంగాణలో సుమారు 20 లక్షల మంది ఐపీలు(Insured Persons), 80 లక్షల మంది లబ్ధిదారులకు ఈఎస్ఐ సేవలు అందుతున్నాయని మంత్రి తెలిపారు. సనత్‌నగర్ ఆస్పత్రిపై ఒత్తిడి తగ్గించేందుకు రామచంద్రాపురం, నాచారం ఆస్పత్రులను అత్యాధునిక వైద్య కేంద్రాలుగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రామచంద్రాపురంలో కార్డియాక్ కేర్ సెంటర్‌తో పాటు 20 పడకల డయాలసిస్ యూనిట్ ఏర్పాటు చేయాలని, నాచారంలో ఇప్పటికే కార్డియాక్ సెంటర్‌కు ఆమోదం లభించిన నేపథ్యంలో అక్కడ కూడా 20 పడకల డయాలసిస్ యూనిట్ ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు.హైదరాబాద్ తర్వాత తెలంగాణలో రామగుండం అతిపెద్ద పారిశ్రామిక ప్రాంతమని, అక్కడ పనిచేస్తున్న వేలాది మంది కార్మికులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రి అత్యవసరమని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. గతంలో ఆమోదం లభించినప్పటికీ టెండర్ల ప్రక్రియ నిలిచిపోయిందని, వెంటనే పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ, ఆస్పత్రి నిర్మాణాన్ని వేగవంతం చేసి వచ్చే ఏడాది నుంచే సేవలు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.విదేశీ ఉపాధి అవకాశాలను కల్పించడంలో తెలంగాణ ప్రభుత్వం టామ్‌కామ్(TOM-COM) ద్వారా దేశంలోనే ముందంజలో ఉందని మంత్రి వివేక్ తెలిపారు. జర్మనీ వంటి దేశాల్లో నర్సింగ్ సిబ్బందికి భారీ డిమాండ్ ఉందని, రాష్ట్రంలో కూడా నర్సుల కొరత ఉన్న నేపథ్యంలో నాచారం ఈఎస్ఐలో నర్సింగ్ కాలేజీ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కళాశాల ద్వారా శిక్షణ పొందిన నర్సులు ఈఎస్ఐ ఆస్పత్రులతో పాటు విదేశాల్లో కూడా ఉపాధి పొందే అవకాశం ఉంటుందని వివరించారు. దీనిపై స్పందించిన కేంద్ర మంత్రి, నాచారం నర్సింగ్ కాలేజీని కూడా వచ్చే ఏడాది నుంచే ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.శంషాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే భూమి కేటాయించిన ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణాన్ని త్వరితగతిన ప్రారంభించాలని, మహబూబ్‌నగర్‌లో కొత్త ఈఎస్ఐ ఆస్పత్రికి అనుమతులు ఇవ్వాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో వరంగల్ ప్రాంతంలో కూడా ఈఎస్ఐ ఆస్పత్రి అవసరం ఉంటుందని తెలిపారు.భూ సమస్యల కారణంగా నిలిచిపోయిన 15 ఈఎస్ఐ డిస్పెన్సరీలకు మళ్లీ అనుమతులు మంజూరు చేయాలని కోరారు. కేంద్రం ఆమోదం తెలిపిన వెంటనే 12 నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం వాటిని ఏర్పాటు చేస్తుందని మంత్రి వివేక్ హామీ ఇచ్చారు.దేశంలో కిడ్నీ సంబంధిత వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఈఎస్ఐ ఆస్పత్రిలో డయాలసిస్ యూనిట్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని వివేక్ వెంకటస్వామి అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి రోగులు డయాలసిస్ కోసం పట్టణాలకు రావాల్సిన పరిస్థితి ఉందని, అన్ని ఈఎస్ఐ ఆస్పత్రుల్లో ఈ సేవలు అందుబాటులోకి వస్తే కార్మికులకు, వారి కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు.కార్మికుల ఆరోగ్య భద్రతను మరింత బలోపేతం చేయడానికి కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని, తెలంగాణలో ఈఎస్ఐ వైద్య సేవలను మరింత విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు.

# సింగరేణి కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో పోరాడతాం: ఏలేటి మహేశ్వర్ రెడ్డి

- సింగరేణి భరోసా యాత్రలో ఉద్యోగులు, కార్మికులతో సమావేశమైన బీజేపీ శాసనసభాపక్ష నేత
- కార్మికుల సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తి ప్రభుత్వం నుంచి సమాధానం కోరుతామని హామీ
- గనుల భద్రత విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శ
- తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ కేటాయింపుకు ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి కృతజ్ఞతలు
- సింగరేణి అభివృద్ధి, కార్మికుల సంక్షేమానికి బీజేపీ కట్టుబడి ఉందని స్పష్టం

**హైదరాబాద్ వెలుతురు జూలై 14:**





సింగరేణి భరోసా యాత్రలో భాగంగా బీజేపీ శాసన సభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సింగరేణి ఉద్యోగులు, కార్మికులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి, వాటి పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామని హామీ ఇచ్చారు.గనుల్లో పనిచేస్తున్న కార్మికుల భద్రత విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. వరుస ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ భద్రతా ప్రమాణాల అమలు, రక్షణ పరికరాల కల్పన, వైద్య సదుపాయాలు, ప్రమాదాల విచారణ నివేదికలపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.సింగరేణి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్‌ను బహిరంగ వేలం లేకుండా సింగరేణికి కేటాయించిన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కేటాయింపుతో సింగరేణికి దీర్ఘకాలిక బొగ్గు నిల్వలు, ఉత్పత్తి అవకాశాలు పెరగడంతో పాటు కార్మికుల ఉపాధికి భరోసా లభిస్తుందని పేర్కొన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి అభివృద్ధిని విస్మరించి కాంట్రాక్టులు, కమీషన్లు, అవకతవకలకు కేంద్రంగా మార్చాయని ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. కార్మికుల సంక్షేమం, భద్రతను పక్కనపెట్టి సింగరేణి సంపదను దోచుకున్నారని విమర్శించారు.సింగరేణి ఉద్యోగులు, కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం బీజేపీ అండగా నిలుస్తుందని, వారి హక్కులు నెరవేరే వరకు అసెంబ్లీ లోపల, బయట పోరాటం కొనసాగిస్తామని ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఆరోగ్య తెలంగాణే లక్ష్యం

- సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.
- వైద్య రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత కల్పిస్తుంది.
- వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య సేవలు అందాలి.
- వైద్యాధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలి.
- రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ హైదరాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్.

**హైదరాబాద్ వెలుతురు జూలై 14:**






ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా ప్రభుత్వం వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యతిస్తుందని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ హైదరాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.మంగళవారం స్థానిక శాసనసభ్యులు నవీన్ యాదవ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్ ఇతర ఉన్నత అధికారులతో కలిసి మంత్రి బస్తీ దవాఖానను సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నందని, వైద్యరంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తెచ్చామని అలాగే వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందాలని వైద్యులను ఆదేశించారు. బస్తీ దవాఖాన లో ప్రతి రోజు 100-150 ఓపీ వస్తుందని డాక్టర్లు వివరించారు. దవాఖాన లో ఓపీ సంఖ్య పెంచాలని రోగుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు.ఆస్పత్రిలో మంత్రి స్వయంగా షుగర్ టెస్ట్ , బ్లడ్ టెస్ట్ ,బీపీ టెస్ట్ చేసుకున్నారు. జిల్లాలో బస్తీ దవాఖానలలో రోగులకు అవసరమైన అన్ని రకాల పరీక్షలు తప్పక చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు.బస్తీ దవాఖాన లో చికిత్స సౌకర్యాలు మెరుగుపరిచి ప్రజల్లో నమ్మకం కలిగించే హైదరాబాద్ లో ఉన్న 169 బస్తీ దవాఖాన లకు ప్రత్యేక అధికారులను నియమించామని వారు బస్తీ దవాఖాన లో విజిట్ చేసి రోగుల కు అందుతున్న చికిత్స ,ఆసుపత్రులలో మౌలిక సదుపాయాలు, ఓపీ సంఖ్య పెంచడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఒక నివేదిక అందించాలని ఆదేశించడం జరిగిందని మంత్రి స్పష్టం చేశారు.హైదరాబాద్ బస్తీ దవాఖానలు రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉండేలా ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వద్ద అవసరమైన చర్యలు తీసుకునేలా ఈ కార్యక్రమం చేపట్టామని మంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్ లో ఉన్న 169 బస్తీ దవాఖాన లో హైదరాబాద్ జిల్లాలో పని చేస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు ,జిల్లా కలెక్టరేట్ అధికారులు ప్రజా ప్రతినిధులు ఇంచార్జి గా వేసుకొని ఒక్కో బస్తీ దవాఖానను పరిశీలించి చికిత్స వివరాలు,మౌలిక సదుపాయాలు ప్రభుత్వం తరుపున అన్ని రకాల అవసరమైన చర్యలు తీసుకొని పేద ప్రజలకు బస్తీ దవాఖానలు మరింత ఉపయోగపడేలా చర్యలు తీసుకోవడం జరిగిందని మంత్రి పేర్కొన్నారు. బోరబండ వినాయక నగర్ బస్తీ దవాఖాన అబ్జర్వ ర్ గా విజిట్ చేశా ఇక్కడ ఒక స్టాఫ్ నర్స్ ఖాళీగా ఉందనీ నా దృష్టికి తేవడం జరిగిందని అన్నారు.బస్తీ దవాఖాన లో అభివృద్ధి కి ఒక ఫార్మాట్ ఇవ్వడం జరిగిందని, అవసరమైన మౌలిక సదుపాయాలు,మందుల కొరత లేకుండా తీసుకోవాల్సిన చర్యలు బస్తీ దవాఖాన లు బాగా పని చేసేలా రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేయటం జరుగుతుందని తెలిపారు.బస్తీ దవాఖాన లో ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన సమస్యల పరిష్కారానికి కల్పించడానికి ముఖ్యమంత్రి గారి వద్దకి సమస్య పరిష్కారం చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు.బస్తీ దవాఖాన ల అభివృద్ధి కి జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి,మున్సిపల్ కమిషనర్ కి అలాగే నాకు ఎలాంటి కాగితం ఇచ్చిన సత్వరమే స్పందించడం జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు.హైదరాబాద్ ఇందిరమ్మ క్యాంటీన్ లో ఇస్కాన్ వాళ్ళతో కలిపి బ్రేక్ ఫాస్ట్ , లంచ్ అందిస్తున్నామని, ఆహార పదార్థాలపై మంచి స్పందన వస్తుందని మంత్రి పేర్కొన్నారు.జిల్లా అధికారులతో ఇంచార్జి మంత్రి గా బస్తి దవాఖాన లు , ఇందిరమ్మ క్యాంటీన్ లపై ఈ కార్యక్రమం తీసుకోవడం జరిగిందని అన్నారు. వర్షాకాలం సీజన్ లో ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై అన్ని బస్తి దవాఖానలు సిద్ధంగా ఉన్నాయని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. పి. శ్రీనివాస్, బస్తీ దవాఖాన వైద్యులు డా . ప్రియాంక, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయాల కంటే మనసులే పవిత్ర క్షేత్రాలు

మనిషి భగవంతుని దర్శించుకోవాలంటే ఎత్తైన గోపురాలు, బంగారు కలశాలు, మిరుమిట్లు గొలిపే కాంతులు, గంటానాదాలు, విస్తృతమైన పూజా విధులు తప్పనిసరి అని చాలామంది నమ్ముతారు. దేవాలయాలను మాత్రమే దైవానికి ఏకైక నిలయాలుగా భావించి, వాటిని దర్శించడం కోసం వేల మైళ్ళు ప్రయాణించే భక్తులు ఈ నాటికీ కోకొల్లలు. కానీ నిజంగా దైవం కేవలం రాతి విగ్రహాలలోనే బంధీ అయి ఉంటాడా? లేక ప్రతి మనిషి హృదయంలోనే నివసిస్తాడా? ఈ ప్రాథమిక ప్రశ్నకు సమాధానం వెతికితే, తెలుగు నేల మీద వెలసిన వేమన, అన్నమయ్య, పోతన వంటి మహాకవుల వాక్కులు, భక్తి తత్వాలు ఒక్కటే స్పష్టంగా చెబుతాయి బాహ్య దేవాలయాల కంటే మనిషి మనసులే నిజమైన పవిత్ర క్షేత్రాలు.వేమన మహాకవి ఎప్పుడో శతాబ్దాల క్రితమే నిష్కర్షగా చెప్పారు, రాతి కొట్టి దేవుని రాతిలో చేసి, పూజ చేయు వాడు మూఢుడోయి అని. ఈ మాటలు ఈనాటి ఆధునిక సమాజానికి కూడా ఎంతో కనువిప్పు కలిగిస్తాయి. దేవుడు కేవలం నిస్తేజమైన రాయిలో లేడు, చైతన్యవంతమైన మనిషిలోనే ఉన్నాడు అనేది వేమన తాత్పర్యం. దేవాలయం అనేది భక్తిని అలవర్చుకోవడానికి ఒక ప్రాథమిక సాధనం మాత్రమే అది అంతిమ గమ్యం కానే కాదు. ఆలయ గోడలు, ఆకాశాన్నంటే శిఖరాలు, అద్భుత శిల్పాలు మనిషిని భగవంతుని వైపు నడిపించే మైలురాళ్ళు కావచ్చు, కానీ ప్రయాణపు చివరి మజిలీ మాత్రం మనిషి అంతరంగంలోనే ఉంటుంది. ఎంతటి కళాత్మకమైన, కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన పురాతనమైన ఆలయమైనా, అందులో అడుగుపెట్టి పూజలు చేసే మనిషి మనసు కుళ్ళుతో, కల్మషంతో నిండి ఉంటే ఆ పూజలన్నీ ముమ్మాటికీ వ్యర్థమే అవుతాయి.తాళ్లపాక అన్నమాచార్యుల కీర్తనలలో కూడా ఇదే ఉదాత్తమైన భావన పలుమార్లు ప్రతిధ్వనిస్తుంది. శ్రీవేంకటేశ్వరుని నిత్యం కొలిచే పరమ భక్తుడైన ఆయన, బాహ్య పూజల కంటే అంతర్ముఖమైన భక్తినే అత్యంత గొప్పగా చాటారు. మనసు నిర్మలంగా లేకుండా చేసే షోడశోపచార పూజలు, సమర్పించే నైవేద్యాలు, వెలిగించే హారతులు దేవుడిని ఎంతమాత్రం మెప్పించలేవని ఆయన కీర్తనలు ఘోషిస్తాయి. భక్తి అనేది ప్రదర్శించుకునే ఆడంబరం కాదు, అది అంతరంగ శుద్ధికి సంబంధించిన నిగూఢ ప్రక్రియ.మనసు అనేది మనిషి ఆలోచనలు, భావోద్వేగాలు, జీవన నిర్ణయాలు రూపుదిద్దుకునే ఒక అద్భుత స్థానం. ఒక మనిషి నిత్యం ఎన్నో పూజలు, వ్రతాలు చేసినా, అతని మనసులో ఇతరుల పట్ల అసూయ, ద్వేషం, స్వార్థం నిండి ఉంటే ఆ బాహ్య ప్రయాసలన్నీ నిష్ఫలమే. దీనికి పూర్తి భిన్నంగా, ఏనాడూ పెద్ద పెద్ద గుడులకు వెళ్ళకపోయినా, ప్రతిరోజూ నిస్వార్థంగా ఇతరులకు సహాయం చేసే వ్యక్తి, తోటి జీవుల పట్ల దయతో, కరుణతో జీవించే వ్యక్తి నిజమైన భక్తుడు అవుతాడు. ఎందుకంటే అతని స్వచ్ఛమైన మనసే ఒక దివ్య ఆలయం అయిపోయింది. అందులో దైవత్వం సహజంగా, అప్రయత్నంగా నివసిస్తుంది.మహాత్మా గాంధీ చెప్పినట్టు, దేవుడు లేని చోటు లేదు, కానీ మనం ఆయనను వెతికే విధానమే తప్పు. మనం ఆలయాల గోపురాల్లో, బంగారు ప్రాకారాల్లో దేవుడిని వెతుకుతూ, మన పక్కనే నిస్సహాయ స్థితిలో ఉన్న పేదవాడిలో, బాధితుడిలో, ఆకలితో అలమటించే అనాథలో ఉన్న సజీవ దైవత్వాన్ని పూర్తిగా విస్మరిస్తున్నాం. నిజమైన పూజ అంటే కేవలం హారతులు ఇవ్వడం కాదు, ఆకలిగొన్నవారికి అన్నం పెట్టడం, దుఃఖితులకు ఓదార్పు ఇవ్వడం, అవసరంలో ఉన్నవారికి చేయూతనివ్వడం. ఇది చేయని వ్యక్తి ఎన్ని వందల దేవాలయాలు తిరిగినా అతని ఆధ్యాత్మిక ప్రయాణం అసంపూర్ణంగానే మిగిలిపోతుంది.ఇక్కడ ఒక ముఖ్యాంశాన్ని స్పష్టం చేసుకోవాలి దేవాలయాల ఉనికిని తిరస్కరించడం లేదా వాటిని తక్కువ చేసి మాట్లాడటం ఈ వ్యాసం ఉద్దేశం కాదు. దేవాలయాలు మన సంస్కృతికి, సనాతన సంప్రదాయానికి, సమాజ ఐక్యతకు నిలువెత్తు వేదికలు. అవి భక్తులందరినీ ఒక చోట చేర్చి, ఉమ్మడి విశ్వాసంతో ముడిపెట్టే అత్యంత పవిత్ర సామాజిక స్థలాలు. కానీ కాలక్రమేణా కొందరు వ్యక్తులు దేవాలయాన్నే అంతిమ లక్ష్యంగా భావించి, దానిలోని బాహ్య ఆడంబరాలకే, ఆచారాలకే మితిమీరిన ప్రాధాన్యత ఇస్తున్నారు.



హుండీలో వేసే కానుకల మొత్తాన్ని బట్టి భక్తి తీవ్రతను, అంతస్థును కొలిచే ధోరణి నేడు పెరిగిపోతోంది. ఒకరితో ఒకరు పోటీపడి డాంబికంగా విఐపి పూజలు చేసే సంస్కృతి పెరిగిపోతోంది. ఇది వాస్తవ ఆధ్యాత్మికత యొక్క మౌలిక సారాన్ని, ప్రాథమిక ఉద్దేశాన్ని పూర్తిగా కోల్పోయేలా చేస్తోంది. నిజానికి, దేవాలయం అనేది మనసును పవిత్రం చేసుకోడానికి, ప్రశాంతతను పొందడానికి ఏర్పడిన ఒక సాధనం. అక్కడికి వెళ్ళి, కాసేపు ప్రశాంతంగా కూర్చుని, తనలోని అహంకారాన్ని, కల్మషాలను వదిలించుకుని, స్వచ్ఛమైన మనసుతో సమాజంలోకి తిరిగి రావాలి. అలా జరగకుండా, కేవలం యాంత్రికమైన ఆచార వ్యవహారాలకే పరిమితమైతే ఆ ప్రయాణం వ్యర్థం.మనసును పవిత్రం చేసుకోవడం అంటే ప్రతిక్షణం సంసారాన్ని వదిలేసి ధ్యానం చేయడం కాదు. అది మన రోజువారీ జీవితంలో మంచి ఆలోచనలు కలిగి ఉండటం, ఎదుటివారి మనసు నొప్పించని మంచి మాటలు మాట్లాడటం, నిస్వార్థమైన పనులు చేయడం ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. ఇతరుల పట్ల కరుణ చూపడం, కష్టకాలంలో నిజాయితీగా వ్యవహరించడం, క్షమాగుణం అలవర్చుకోవడం, స్వార్థం లేకుండా జీవించడం ఇవన్నీ మనసును ఒక దివ్య ఆలయంగా మలచే సన్మార్గాలు.

అని శతాబ్దాల క్రితమే బసవేశ్వరుడు చెప్పిన మాటలు ఇక్కడ ప్రతి ఒక్కరూ గుర్తుచేసుకోవాలి. అంటే ప్రతి మనిషి పుట్టుకతోనే తనలోనే ఒక గొప్ప దేవాలయాన్ని కలిగి ఉన్నాడు, దానిని సత్కర్మల ద్వారా గుర్తించి పరిరక్షించుకోవడమే నిజమైన ఆధ్యాత్మిక సాధన.బాహ్య దేవాలయాలు మనకు దైవత్వాన్ని గుర్తుచేసే మార్గదర్శకాలు మాత్రమే, కానీ మన నిర్మలమైన మనసే మన అసలైన అంతిమ గమ్యస్థానం. శతాబ్దాల క్రితమే మన పూర్వీకులు, మహాకవులు చెప్పిన ఈ సత్యాన్ని ఈనాటి ఆధునిక సమాజం మళ్ళీ గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మనసును పవిత్రం చేసుకుంటే, ప్రతి హృదయమూ ఒక సుందర దేవాలయమే అవుతుంది అక్కడ దైవం శాశ్వతంగా కొలువై ఉంటాడు. మనసు లేని పూజ వ్యర్థం, మనసున్న సేవతో కూడిన జీవితమే నిజమైన దైవపూజ.



డా. సూర్యదేవర రామకృష్ణ ,
Moral Philosopher, 9490754169

# బీసీలను 78 సం:గా మోసం చేస్తున్న "దిక్కుమాలిన పార్టీలు బీసీలకు అవసరమా?"

భారతదేశం స్వాతంత్ర్యం పొందిన దాదాపు ఎనిమిది దశాబ్దాల తరువాత కూడా సామాజిక న్యాయం పూర్తి స్థాయిలో సాధించబడలేదనే వాస్తవాన్ని ఎవరూ కాదనలేరు. రాజ్యాంగం సమానత్వాన్ని హామీ ఇచ్చింది. ప్రజాస్వామ్యం ప్రతి పౌరుడికి సమాన అవకాశాలు కల్పిస్తుందని చెప్పింది. కానీ సామాజిక వాస్తవాలను పరిశీలిస్తే, దేశ జనాభాలో అత్యధిక శాతం ఉన్న వెనుకబడిన వర్గాలు ఇప్పటికీ రాజకీయ అధికారం, పరిపాలన, విధాన నిర్ణయాల్లో తమ జనాభాకు తగిన ప్రాతినిధ్యాన్ని పొందలేకపోతున్నాయి. ముఖ్యంగా బీసీలు ఎన్నికల సమయంలో ప్రతి రాజకీయ పార్టీకి అత్యంత కీలకమైన ఓటు బ్యాంక్‌గా కనిపిస్తారు. వారి శ్రమను కొనియాడుతారు. వారి సంఖ్యను ప్రస్తావిస్తారు. సామాజిక న్యాయం పేరుతో అనేక హామీలు ఇస్తారు. కానీ అధికారంలోకి వచ్చిన తరువాత అదే బీసీలను మరచిపోవడం భారత రాజకీయాల్లో కొనసాగుతున్న విషాదకరమైన సంప్రదాయంగా మారింది.దేశ రాజకీయ చరిత్రను పరిశీలిస్తే కాంగ్రెస్, బీజేపీ, ప్రాంతీయ పార్టీలు, కమ్యూనిస్టు పార్టీలు అన్నీ వివిధ కాలాల్లో అధికారంలోకి వచ్చాయి. సిద్ధాంతాలు మారాయి. నినాదాలు మారాయి. నాయకులు మారారు. కానీ బీసీల రాజకీయ సాధికారత విషయంలో మాత్రం పెద్దగా మార్పు కనిపించలేదు. ముఖ్యమంత్రి పదవులు, పార్టీ అధ్యక్ష పదవులు, కీలక మంత్రిత్వ శాఖలు, విధాన నిర్ణయాల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం అవకాశాలు కల్పించిన సందర్భాలు చాలా అరుదుగా కనిపిస్తాయి. బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు కూడా అధికార భాగస్వామ్యంలో బీసీలను సమాన భాగస్వాములుగా చూడకపోవడం తీవ్రమైన రాజకీయ వైరుధ్యం.ఈ నేపథ్యంలో కులగణన ప్రశ్న మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఏ సమాజానికైనా ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి కోసం సరైన గణాంకాలు అవసరం. జనాభా ఎంత? వారి సామాజిక, విద్యా, ఆర్థిక స్థితి ఏమిటి? ప్రభుత్వ పథకాల వల్ల ఎంత ప్రయోజనం పొందుతున్నారు? వంటి ప్రశ్నలకు సమాధానం లేకుండా సామాజిక న్యాయం అమలు కావడం అసాధ్యం. అందుకే కులగణన అనేది కేవలం లెక్కల ప్రక్రియ కాదు. అది సామాజిక న్యాయానికి పునాది. కానీ ఈ అంశాన్ని దశాబ్దాలుగా రాజకీయ పార్టీలు ఎన్నికల హామీగా ఉపయోగించుకున్నప్పటికీ, అధికారంలోకి వచ్చిన తర్వాత అమలులో వెనుకడుగు వేస్తూ వచ్చాయి. కులగణన ఫలితాలు వెలుగులోకి వస్తే అధికార నిర్మాణంలో ఉన్న అసమానతలు బయటపడతాయనే భయమే దీనికి ప్రధాన కారణమని అనేక సామాజిక ఉద్యమకారులు అభిప్రాయపడుతున్నారు.బీసీలు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. వ్యవసాయం, చేతివృత్తులు, సేవారంగం, చిన్నతరహా వ్యాపారాలు, ఉత్పత్తి రంగాలు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అన్నింటికీ బీసీలే ప్రధాన ఆధారం. దేశ సంపద సృష్టిలో వారి పాత్ర అపారమైనది. కానీ అధికార నిర్మాణంలో మాత్రం వారి వాటా చాలా స్వల్పం. ఓటు వేయాల్సినప్పుడు బీసీలు గుర్తుకు వస్తారు. గెలిచిన తరువాత నిర్ణయాధికారం మాత్రం కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమవుతుంది. ఈ పరిస్థితి ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం.బీసీల రాజకీయ వెనుకబాటుతనానికి కేవలం ఒకే పార్టీని బాధ్యురాలిగా చూడలేం. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, టీడీపీ, సీపీఐ, సీపీఎం, ఎంఐఎం వంటి వివిధ రాజకీయ శక్తులు వేర్వేరు సందర్భాల్లో బీసీల మద్దతును పొందాయి. కానీ బీసీల రాజకీయ సాధికారతను వ్యవస్థాగతంగా అమలు చేసిన దాఖలాలు చాలా పరిమితంగా ఉన్నాయి. రాజకీయ ప్రాతినిధ్యం అనేది కేవలం కొంతమంది వ్యక్తులకు పదవులు ఇవ్వడం కాదు. అది నిర్ణయాధికారంలో సమాన భాగస్వామ్యాన్ని కల్పించడం. పార్టీ నిర్మాణం నుంచి ప్రభుత్వ నిర్మాణం వరకు ప్రతి స్థాయిలో జనాభా నిష్పత్తికి అనుగుణంగా అవకాశాలు కల్పించడమే నిజమైన సామాజిక న్యాయం.భారతదేశ సామాజిక నిర్మాణాన్ని అర్థం చేసుకోకుండా కేవలం ఆర్థిక వైరుధ్యాలనే విశ్లేషించడం సరిపోదు. వర్గపోరాట సిద్ధాంతం భారత సమాజంలోని కొన్ని వాస్తవాలను వివరిస్తుంది. కానీ భారతీయ సమాజం కుల నిర్మాణంపై ఆధారపడి ఉందనే వాస్తవాన్ని విస్మరించలేం. భూస్వామి–కార్మికుడు, పెట్టుబడిదారు–కూలీ మధ్య ఉన్న వైరుధ్యాలు ఎంత ముఖ్యమో, కుల ఆధిపత్యం–సామాజిక అణచివేత మధ్య ఉన్న వైరుధ్యాలు కూడా అంతే ముఖ్యమైనవి. ఈ రెండింటినీ సమగ్రంగా అర్థం చేసుకున్నప్పుడే భారత సమాజంలోని అసమానతల అసలు రూపం కనిపిస్తుంది.కమ్యూనిస్టు ఉద్యమాలు దశాబ్దాలుగా ఆర్థిక అసమానతలను ప్రధానంగా ప్రస్తావించాయి. కానీ భారతీయ సమాజంలో కులవ్యవస్థ సృష్టించిన చారిత్రక అసమానతలకు తగిన ప్రాధాన్యం ఇవ్వలేదనే విమర్శ చాలాకాలంగా వినిపిస్తోంది. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు ఎదుర్కొంటున్న సామాజిక వివక్షను వర్గ విశ్లేషణతో మాత్రమే పూర్తిగా అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. సామాజిక వైరుధ్యాలను విస్మరించినప్పుడు సామాజిక న్యాయ ఉద్యమాలను కూడా సరైన కోణంలో చూడలేకపోయే పరిస్థితి ఏర్పడుతుంది. అందుకే కొన్నిసార్లు బీసీల హక్కుల ఉద్యమాలను "కుల ఉద్యమాలు"గా కొట్టిపారేసే ధోరణి కనిపిస్తుంది. కానీ సామాజికంగా అణచివేయబడిన వర్గాలు తమ హక్కుల కోసం చేసే పోరాటం ప్రజాస్వామ్య హక్కుల సాధనలో భాగమే.బీసీలలో అనేక కులాలు ఉన్నాయి. ప్రతి కులానికి తనదైన చరిత్ర, జీవన విధానం, సమస్యలు ఉన్నాయి. ఈ భిన్నత్వాన్ని విభేదాలుగా కాకుండా వైవిధ్యంగా చూడాలి. బీసీల మధ్య ఉండే వైరుధ్యాలు శాశ్వత శత్రుత్వాలు కావు. అవి చర్చల ద్వారా, అవగాహన ద్వారా పరిష్కరించగలిగే మిత్ర వైరుధ్యాలు. ఇదే విషయం ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు కూడా వర్తిస్తుంది. మైనారిటీలలో కూడా అంతర్గత సామాజిక అంతరాలు ఉన్నాయి. ఆదివాసీ సమాజంలో కూడా వివిధ వర్గాలు ఉన్నాయి. ఈ అంతర్గత భేదాలను పరస్పర విభజనకు కాకుండా ఐక్యతకు దారితీసే విధంగా పరిష్కరించుకోవాలి.దేశ జనాభాలో బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలు కలిసి అత్యధిక శాతం ఉన్న సామాజిక శక్తి. ఈ వర్గాల మధ్య పరస్పర విశ్వాసం, పరస్పర గౌరవం, ఉమ్మడి రాజకీయ అవగాహన పెరిగితే భారత ప్రజాస్వామ్య స్వరూపంలో గణనీయమైన మార్పు రావచ్చు. ఈ ఐక్యత ఎవరికీ వ్యతిరేకంగా కాదు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, ప్రజాస్వామ్య భాగస్వామ్యం కోసం జరిగే రాజ్యాంగబద్ధమైన ప్రయాణం.అగ్రవర్ణాల్లో కూడా అంతర్గత వైరుధ్యాలు ఉంటాయి. ఆర్థిక పోటీలు ఉంటాయి. రాజకీయ విభేదాలు ఉంటాయి. అయినప్పటికీ అధికార నిర్మాణం విషయంలో వారు ఉమ్మడి ప్రయోజనాలను కాపాడుకోవడానికి ప్రయత్నిస్తారు. అదే సమయంలో బీసీల మధ్య చిన్నచిన్న భేదాలను పెద్దవిగా చూపించి ఐక్యతను బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతుంటాయి. అందువల్ల బీసీ ఉద్యమం ప్రధాన వైరుధ్యం ఏమిటి, ఉప వైరుధ్యాలు ఏమిటి అనే విషయాన్ని స్పష్టంగా గుర్తించాల్సిన అవసరం ఉంది. ప్రధాన లక్ష్యం సామాజిక న్యాయం, రాజకీయ సాధికారత అయితే చిన్నచిన్న విభేదాలను సంభాషణ ద్వారా పరిష్కరించుకోవాలి.ఈ సందర్భంలో మహాత్మా జ్యోతిరావు పూలే ఆలోచనలు అత్యంత ప్రాసంగికంగా కనిపిస్తాయి. దాదాపు రెండు శతాబ్దాల క్రితమే భారత సమాజంలోని కుల ఆధిపత్యాన్ని ఆయన విశ్లేషించారు. శూద్రులు, అతిశూద్రుల విద్య, స్వాభిమానం, సామాజిక విముక్తి కోసం జీవితాన్ని అంకితం చేశారు. స్త్రీ విద్య, సామాజిక సమానత్వం, కుల వివక్ష నిర్మూలన కోసం ఆయన చేసిన కృషి భారత సామాజిక చరిత్రలో చిరస్మరణీయం. అందుకే డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పూలే, గాడ్గే బాబాను తన గురువుగా గౌరవించారు. అంబేద్కర్ రాజ్యాంగ రూపకర్తగా సామాజిక న్యాయానికి చట్టబద్ధమైన పునాది వేశారు. పూలే చూపిన దారిని అంబేద్కర్ రాజ్యాంగ వ్యవస్థతో మరింత బలపరిచారు.అయితే పూలే ఆలోచనలు సమాజంలో విస్తృతంగా వ్యాపించాల్సినంతగా వ్యాపించలేదనే విమర్శ ఉంది. బీసీలలో కూడా ఆయన భావజాలంపై లోతైన అధ్యయనం అవసరం. పూలే, అంబేద్కర్, పెరియార్ వంటి సామాజిక సంస్కర్తల ఆలోచనలను అధ్యయనం చేయడం ద్వారా సామాజిక అసమానతల మూలాలను మరింత స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు. వ్యక్తి పూజ కంటే భావజాల బలమే ఉద్యమాలకు దీర్ఘకాలిక దిశను ఇస్తుంది.బీసీ ఉద్యమం కేవలం ఎన్నికల రాజకీయాలకే పరిమితం కాకూడదు. విద్య, ఉపాధి, ఆర్థిక స్వావలంబన, సామాజిక గౌరవం, సాంస్కృతిక పునరుజ్జీవనం వంటి అన్ని రంగాల్లో సమగ్ర చైతన్యం పెరగాలి. బీసీ విద్యావంతులు పరిశోధన చేయాలి. చరిత్రను వెలికితీయాలి. బీసీ మహనీయుల సేవలను కొత్త తరానికి పరిచయం చేయాలి. సామాజిక అధ్యయన కేంద్రాలు, చర్చా వేదికలు, సాహిత్య ఉద్యమాలు, మేధో చర్చలు విస్తరించాలి. భావజాలం బలపడినప్పుడే ఉద్యమం కూడా బలపడుతుంది.అంటరానితనం, సామాజిక అవమానాలు, కుల వివక్షను ప్రత్యక్షంగా అనుభవించని వారికి వాటి తీవ్రత పూర్తిగా అర్థం కావడం కష్టం. అందువల్ల సామాజిక న్యాయం గురించి చర్చించేటప్పుడు బాధిత వర్గాల అనుభవాలను గౌరవించాలి. వారి స్వరాన్ని వినాలి. వారి రాజకీయ ఆకాంక్షలను ప్రజాస్వామ్య చర్చలో భాగం చేయాలి. బీసీల హక్కుల కోసం జరిగే ఉద్యమాలను కేవలం సంకుచిత కుల రాజకీయాలుగా చిత్రీకరించడం సమస్య పరిష్కారానికి దోహదం చేయదు. సమాన అవకాశాల కోసం జరిగే పోరాటాన్ని రాజ్యాంగ విలువల కోణంలో చూడాల్సిన అవసరం ఉంది.బీసీల చైతన్యం కేవలం బీసీల కోసమే కాకుండా మొత్తం సమాజ అభివృద్ధి కోసం ఉండాలి. సమానత్వం ఉన్న సమాజంలోనే ప్రజాస్వామ్యం బలపడుతుంది. ప్రతి వర్గానికి న్యాయం జరిగినప్పుడే దేశం నిజమైన అర్థంలో అభివృద్ధి చెందుతుంది. బీసీలు రాజకీయంగా, సామాజికంగా, విద్యాపరంగా బలపడితే అది ఒక్క వర్గానికే కాదు, దేశ ప్రజాస్వామ్యానికే బలం చేకూరుస్తుంది.అందువల్ల బీసీ ఉద్యమం ప్రధానంగా స్వాభిమానం, ఐక్యత, సామాజిక న్యాయం, రాజ్యాంగబద్ధ హక్కుల సాధన, భావజాల వికాసం అనే ఐదు పునాదులపై నిర్మించబడాలి. ఓటు వేసే శక్తిగా మాత్రమే కాకుండా విధానాలను నిర్ణయించే శక్తిగా ఎదగాలి. అధికారాన్ని నిర్ణయించే స్థితి నుంచి అధికారంలో సమాన భాగస్వామ్యం సాధించే స్థాయికి చేరుకోవాలి. కులగణన వంటి అంశాలను ప్రజాస్వామ్య చర్చలో ముందుకు తీసుకురావాలి. రాజకీయ పార్టీలను ప్రశ్నించాలి. హామీల అమలును డిమాండ్ చేయాలి. నాయకత్వాన్ని కోరుకోవడమే కాదు, నాయకత్వాన్ని నిర్మించుకోవాలి.భారత ప్రజాస్వామ్యం మరింత సమగ్రంగా, సమానత్వంతో ముందుకు సాగాలంటే బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలు, అలాగే సామాజిక న్యాయాన్ని విశ్వసించే ప్రతి ప్రగతిశీల శక్తి పరస్పర గౌరవంతో కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది. ప్రజాస్వామ్యంలో శాశ్వత శత్రువులు ఉండరు; శాశ్వత విలువలు మాత్రమే ఉంటాయి. ఆ విలువల్లో సామాజిక న్యాయం, సమానత్వం, స్వాభిమానం, రాజ్యాంగబద్ధ హక్కులు అత్యంత ముఖ్యమైనవి.ఈ లక్ష్యాలను సాధించడానికి బీసీ సమాజం తనలోని చిన్నచిన్న భేదాలను అధిగమించి, భావజాలపరంగా బలపడుతూ, విద్య, సంఘటిత శక్తి, రాజకీయ చైతన్యాన్ని పెంపొందించుకుంటూ ముందుకు సాగాలి. అప్పుడు మాత్రమే ఓటు బ్యాంక్‌గా కాకుండా దేశ భవిష్యత్తును నిర్ణయించే ప్రజాస్వామ్య శక్తిగా బీసీలు నిలుస్తారు. అదే సామాజిక న్యాయానికి, అదే రాజ్యాంగ స్ఫూర్తికి, అదే భారత ప్రజాస్వామ్యానికి నిజమైన విజయంగా నిలుస్తుంది.



మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు

## ఆరుట్లలో సార్ ఓటర్ సవరణ ధృవపత్రాలను అధికారులకు అందజేసిన ప్రజాసంఘాల అధ్యక్షులు కంబాలపల్లి భాస్కర్, ప్రజాగళం దామెర బాలకుమారి భూపాల్



**మంచాల వెలుతురు జులై 14:**

మంచాల మండలం ఆరుట్ల గ్రామంలోసార్ కార్యక్రమంలో పాల్గొని ఓటర్ ఐడి ధ్రువపత్రాలు అ ధి కారులకు అందజేసిన ప్రజాసంఘాల నాయకుడు కంబాలపల్లి భాస్కర్ ప్రజాగలం దామెరబాలకు మారి భూపాల్ ఈసందర్భంగా ప్రజాసంఘాల నాయకుడు కంబాలపల్లి భాస్కర్ మాట్లాడుతూకేం ద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటర్ సవరణ అభ్యంతరాలు స్వీకరించడం మరియు ఓటరు వివరాలు నమోదుచేయడం శుభపరిణామం దేశంలో రాష్ట్రంలో ఉన్న రెండు ఓట్ల విధానం స్వస్తి పలికి ఒకే ఓటు విధానాన్ని ప్రవేశపెట్టడంచాలా మంచిది గ్రామప్రజలు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలి మరియు చివరి తేదీని కూడా 24జులై 2026 వరకుఉన్నది కాబట్టి ప్రభుత్వానికి ఒక విన్నపం ఈగ డువు తేదీని మరొక పదిరోజులు పొడిగించాల్సిందిగా అధికారులను కోరారు ప్రజలందరూఈ యొక్కఓటరు సవరణపైనఅవగాహన లేక ఇబ్బందులు గురవుతున్నారు ఈ సర్ పామ్స్ సమ ర్పించక పోతే ఓట్లు అనేవి ఓటర్ లిస్టులో తొలగించబడతాయని రాష్ట్రఎన్నికల సంఘం ప్రకటిం చింది కాబట్టి ప్రజలంతా ఈయొక్క అవకాశాన్ని వినియోగించుకుని అందరూ గ్రామపంచాయతీ వద్ద తమ యొక్క ఫోటోతో కూడిన ఆధార్ కార్డుతో వచ్చితమ సంబంధిత అధికారు లను కలిసి తమ యొక్క ఫారంను సమర్పించ గలరు కార్యక్రమంలోగ్రామ సర్పంచ్ మానిపాటి శోభా కుమార్ మంచాల సొసైటీ డైరెక్టర్ కొంగర జనార్దన్ రెడ్డి వార్డు సభ్య డు పున్నం రాము మని పాటి భాను ప్రసాద్ గ్రామపంచాయతీ కార్యదర్శి చిలుకల వెంకటేష్ ఆరుట్ల గ్రామ రెవెన్యూ అధికారిసుహాసిని బిఎల్ ఓ అధికారులు గ్రామస్తులు చీమర్ల క్రాంతి కుమార్ మాడపాకుల శ్రీనివాస్ సత్యం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## శంకర్‌పల్లిలో రేషన్ బియ్యం అక్రమ దందాపై పోలీసుల కొరడా

- **1,500 కిలోల పీడీఎస్ బియ్యం స్వాధీనం, ఇద్దరు అరెస్ట్**
- **బుల్కాపూర్ సమీపంలోని కోళ్ల ఫారం వద్ద దాడి**
- **కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభం**

**శంకర్‌పల్లి, వెలుతురు జూలై 14 :**

శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రభుత్వ ప్రజా పంపిణీ వ్యవస్థ రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి సుమారు 1,500 కిలోల పీడీఎస్ రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం, మంగళవారం హెడ్ కానిస్టేబుల్ పీ. నరేందర్ హోంగార్డు శ్రీనివాస్ పెట్రోలింగ్ విధుల్లో భాగంగా బుల్కాపూర్ గ్రామ సమీపంలోని డైసీ డేల్ పార్క్ వద్ద ఉండగా అక్రమంగా రేషన్ బియ్యం కొనుగోలు, విక్రయాలు జరుగుతున్నట్లు నమ్మదగిన సమాచారం అందింది. వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించి, ఇద్దరు పంచసాక్షుల సమక్షంలో బుల్కాపూర్ గ్రామంలోని కోళ్ల ఫారం పక్కన ఉన్న గదిపై దాడి నిర్వహించారు. దాడిలో మొహమ్మద్ జహంగీర్ (41), ఎల క్ట్రిషియన్, మొహమ్మద్ మహబూబ్ (45), వ్యాపారి, ఇద్దరూ రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం చిన్న మంగళారం గ్రామానికి చెందిన వారిని అదుపులోకి తీసుకున్నారు. గదిలో ఉన్న 30 కిలోల చొప్పున 50 సంచుల్లో మొత్తం 1,500 కిలోల ప్రభుత్వ పీడీఎస్ రేషన్ బియ్యం నిల్వ ఉంచినట్లు గుర్తించారు. నిందితులను విచారించగా బియ్యానికి సంబంధించిన ఎలాంటి బిల్లులు, అనుమతి పత్రాలు లేదా చట్టబద్ధమైన ఆధారాలు చూపించలేక పోయారు.

దీంతో పోలీసులు పంచసాక్షుల సమక్షంలో శోధన, స్వాధీన పంచనామా నిర్వహించి, మొత్తం 50 బియ్యం సంచులను సీజ్ చేశారు. హెడ్ కానిస్టేబుల్ పీ. నరేందర్ సమర్పించిన ఫిర్యాదు మేరకు శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని, పంచనామా పత్రాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తును ఎస్ఐ ఆర్. మంజులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

## శంకర్ పల్లి మున్సిపాలిటీలో ఘనంగా "క్యాచ్ ది రెయిన్" కార్యక్రమం

- **వర్షపు నీటిని పొదుపు చేయాలి**
- **మున్సిపల్ చైర్‌పర్సన్ సాత ప్రవీణ్ కుమార్**

**శంకర్ పల్లి, వెలుతురు జులై 14 :**

భవిష్యత్తు తరాల కోసం ప్రతి ఒక్కరూ వర్షపు నీటిని పొదుపు చేయాలని శంకర్ పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీ సాత ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం శంకర్ పల్లి పురపాలక సంఘం పరిధిలో అమృత్ 3.0 కార్యక్రమంలో భాగంగా "క్యాచ్ ది రెయిన్" అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా



పట్టణ ప్రజలకు వర్షపు నీటి సంరక్షణపై అవగాహన కల్పించేందుకు పురపాలక సంఘం ఆధ్వర్యంలో పలు చోట్ల హోర్డింగ్స్‌ను ఏర్పాటు చేశారు. వర్షపు నీటిని వృధా చేయకుండా భూగర్భంలోకి ఎలా మళ్లించాలనే విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా స్థానిక తెలంగాణ మోడల్ స్కూల్ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్ (ఇంకుడు గుంత)ను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీ సాత ప్రవీణ్ కుమార్ గారితో పాటు మున్సిపల్ కమీషనర్ శ్రీ ఏ.యోగేష్ గారు, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ బి.ఆనంద్ గారు, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు మరియు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పెండింగ్ సీసీ రోడ్లను పూర్తి చేయాలి

- **సీఎంసీ కమిషనర్‌కు వినతి**

**శంకర్పల్లి, వెలుతురు జూలై 14 :**



మండల పరిధిలోని జన్వాడ, మీర్జాగూడ గ్రామాల్లో నెలకొన్న డ్రైనేజీ, సీసీ రోడ్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మంగళవారం సీఎంసీ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. జన్వాడ, మీర్జాగూడ – ఇంద్రారెడ్డి నగర్ వార్డుల్లోని కింది బస్తీ హరిజనవాడ సైడ్ డ్రెయిన్ నుండి సీసీ మరియు ఎస్టీడీ వరకు ప్రతి వర్షాకాలంలో డ్రైనేజీ, వర్షపు నీరు రోడ్లపైకి పొంగిపొర్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ నీరంతా స్థానిక ఇళ్లలోకి చేరడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. నీరు నిల్వ ఉండటంతో విపరీతంగా దోమలు పెరిగిపోయి, ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు, గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్ల పనులను వెంటనే పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు.నాయకుల విజ్ఞప్తిపై సీఎంసీ కమిషనర్ సానుకూలంగా స్పందించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి త్వరలోనే తగిన చర్యలు తీసు కుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జన్వాడ మాజీ ఎంపీటీసీ, ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రెటరీ శ్రీ తలారి మైసయ్య, జన్వాడ మాజీ సర్పంచ్ శ్రీ రాచూరి ఐలయ్య, మీర్జాగూడ సర్పంచ్ శ్రీ రవి గౌడ్, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కోట రాజు గౌడ్ మరియు ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

- **నేడు రాష్ట్రవ్యాప్త కళాశాలల బంద్: ఏబీవీపీ పిలుపు.. ఇంటర్, డిగ్రీ విద్యాసంస్థలు బంద్**
- **విద్యార్థి నాయకుల ముందస్తు అరెస్టులపై ఆగ్రహం**

**శంకర్ పల్లి, వెలుతురు జులై 14 :**

రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి విద్యార్థులకు అందాల్సిన ఉపకార వేతనాలు (స్కాలర్‌షిప్‌లు), ఇతర విద్యా సంక్షేమ పథకాల బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ బుధవారం రాష్ట్రవ్యాప్త ఇంటర్, డిగ్రీ కళాశాలల బంద్‌కు పిలుపునిచ్చింది. ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాల వల్ల వేలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏబీవీపీ ఆవేదన వ్యక్తం చేసింది. బకాయిలు చెల్లించకుండా కాలయాపన చేయడం వల్ల విద్యా సంవత్సరంపై తీవ్ర ప్రభావం పడుతోందని పేర్కొంది.మరోవైపు, ఈ శాంతియుత ప్రజాస్వామ్య బంద్ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు రాష్ట్రవ్యాప్తంగా ఏబీవీపీ విద్యార్థి నాయకులను, కార్యకర్తలను ముందస్తు (ప్రివెంటివ్) అరెస్టులు చేయడాన్ని ఏబీవీపీ తీవ్రంగా ఖండించింది. ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలియజేయడం రాజ్యాంగబద్ధమైన హక్కని, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం.. నిర్బంధాలతో ఉద్యమాలను అణచివేయాలని చూడటం దుర్మార్గమని నాయకులు మండిపడ్డారు. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, విద్యార్థుల సమస్యలు తీరేవరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.



## పటేల్ చెరువు తండాలో గుండె పోటుతో గిరజన నాయకుడు జర్పుల మోతిలాల్ నాయక్ మృతి

- **మోతిలాల్ నాయక్ మృత దేహంపై పూలమాలవేసి నివాళులర్పించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు రావులభాష వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్**





**మంచాల వెలుతురు జులై 14:**

మంచాల మండలం పటేల్ చెరువుతండాలో మంగళవారం రోజు మధ్యానం12: 00గంటలకు వి షాద సంఘటన చోటు చేసుకుంది జర్పుల మోతిలాల్ నాయక్(48) తనపొలంలో పనిచేసు కుం టూ ఆకస్మాత్తుగా కుప్పకూలిపోయి గుండెపోటుతో మరణించాడుఈవిషయం తెలుసుకున్న కాం గ్రెస్ పార్టీ జిల్లానాయకుడు రావులభాష వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ పటేల్ చెరువుతం డా జర్పుల మోతిలాల్ నాయక్ నివాసాని కివెళ్లి మోతిలాల్ నాయక్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పిచారు అనంతరం అతని కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చిప్రాగాఢ సా నుభూతి తెలిపారు ఈకార్యక్రమం లో పటేల్ చెరువుతండా సర్పంచ్ మేఘవత్ రాజ్యలక్ష్మీలక్ష్మ నాయక్ ధర్మనాయక్ మేఘవత్ జానీనాయక్ రామునాయక్ సీతారాంనాయక్ బాలాజీ నాయక్ బాబురావు నాయక్ తదితరులు పాల్గొన్నారు .

## కనీస వేతనాలు, కార్మిక హక్కుల సాధన కోసం జూలై 18 భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలి:సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె. చంద్రశేఖర్

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 14:**

సిఐటియు బాచుపల్లి మండల కమిటీ సమావేశం ప్రగతి నగర్ సుందరయ్య భవన్లో నిర్వహించారు. బాచుపల్లి మండలంలో సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 18న నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.మంగళవారం బాచుపల్లి మండల కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పారిశ్రామిక ప్రాంతాల్లో పనిచేస్తున్న ప్రతి కార్మికుడికి ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం. 06 ప్రకారం కనీస వేతనాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి కార్మికుడికి ఈఎస్ఐ, పీఎఫ్ వంటి చట్టబద్ధమైన సౌకర్యాలను కల్పించాలని, కార్మికులపై యాజమాన్యాలు కొనసాగిస్తున్న వేధింపులను వెంటనే నిలిపి వేయాలని కోరారు.అన్ని ట్రేడ్ యూనియన్లు కనీస వేతనాన్ని



₹26,000గా నిర్ణయించాలని డిమాండ్ చేసినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం శాస్త్రీయ విధానాన్ని అనుసరించకుండా అతి తక్కువ వేతనాలతో కనీస వేతనాల జీవోను విడుదల చేసిందని ఆయన విమర్శించారు. వి.డి.ఏ. (VDA) మార్చి–2001 సిరీస్‌ను ఆధారంగా తీసుకొని పాయింట్ రేటును అతి తక్కువగా నిర్ణయించడం వల్ల కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని పేర్కొన్నారు.కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే కనీస వేతనాలను శాస్త్రీయ పద్ధతిలో సవరించి, చట్టబద్ధమైన కార్మిక హక్కులను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈసందర్భంగా జూలై 18న జరిగే భారీ బహిరంగ సభకు పారిశ్రామిక కార్మికులు, ట్రేడ్ యూనియన్ నాయకులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు బి.వెంకట రామయ్య, సిఐటియు బాచుపల్లి మండల కమిటీ సభ్యులు నాగభూషణ్, పెంటయ్య, ఎల్లమ్మ, స్వామి, భాస్కర్, వెంకట్ స్వామి, నాగరాజు, ఏడుకొండలు, డేవిడ్, పవన్, సతీష్, శ్రీను, మదిలేటి, చెన్నయ్య, మనీ, బుజ్జమ్మ, నాగశేషు, తిరుపతయ్య, శీను, అంజి, లక్ష్మి, కార్మికులు పాల్గొన్నారు.

## మార్తన్ననగర్‌లో ఓటరు సర్వే ఫారాలు ప్రజల నుంచి స్వీకరణ

**కొండాపూర్, వెలుతురు జూలై 14:**



కొండాపూర్ డివిజన్ పరిధిలోని మార్తన్ననగర్‌లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు సర్వే కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ప్రభుత్వ సూచనల మేరకు ఇంటింటికి పంపిణీ చేసిన సర్వే ఫారాలను స్థానిక ప్రజలు పూర్తిగా నింపి సంబంధిత అధికారులకు తిరిగి అందజేస్తున్నారు.ఓటరు వివరాలను సక్రమంగా నమోదు చేయడం, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు మరియు తప్పులను సరిదిద్దడం లక్ష్యంగా ఈ సర్వే కొనసాగుతోంది. ప్రజలు తమ వివరాలను జాగ్రత్తగా పరిశీలించి, అవసరమైన సమాచారంతో ఫారాలను సమర్పించాలని అధికారులు సూచించారు.ఈ సందర్భంగా స్థానికులు కూడా సర్వే ప్రక్రియకు పూర్తి సహకారం అందిస్తూ, ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

## ప్రజల మధ్యే కాంగ్రెస్.... కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సొంటిరెడ్డి పున్నారెడ్డి

**కుత్బుల్లాపూర్ వెలుతురు ప్రతినిధి జూలై 14:**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) కార్యక్రమంలో భాగంగా రోడా మేస్త్రీ నగర్, గాజులరామారం డివిజన్‌లో మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు సొంటిరెడ్డి పున్నారెడ్డి విస్తృతంగా పర్యటించారు. బి ఎల్ ఓ ల సహాయంతో ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాలో పేర్లు, వివరాలను పరిశీలిస్తూ ప్రజలకు అవసరమైన సూచనలు చేశారు.ఈ సందర్భంగా స్థానికులు తమ ప్రాంతంలో ఉన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలతో నేరుగా మమేకమవుతూ ప్రతి కుటుంబాన్ని పలకరిస్తూ కాంగ్రెస్ పార్టీ ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పున్నారెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో శ్యామ్, మరలింగ, పవన్, ఆనంద్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు ఓటర్ మహాసేయులు పాల్గొన్నారు.



## సెంట్రింగ్ కార్మికుల సంక్షేమానికి జై దుర్గా భవాని అసోసియేషన్ అభయం

**కుత్బుల్లాపూర్ వెలుతురు ప్రతినిధి జూలై 14:**



సెంట్రింగ్ కార్మికుడి కుటుంబం ప్రమాదం జరిగిన క్షణంలో రోడ్డున పడకుండా ఆర్థిక భరోసా కల్పించే దిశగా కీలక అడుగు పడింది. ఒక్క ఐడెంటిటీ కార్డుతోనే ప్రమాద మరణం లేదా శాశ్వత అంగవైకల్యం సంభవిస్తే రూ.20 లక్షల బీమా, కుటుంబంలో ఆడబిడ్డ జన్మిస్తే రూ.30 వేల ఆర్థిక సహాయం అందించే వినూత్న సంక్షేమ పథకాన్ని కుత్బుల్లాపూర్ లో ప్రారంభించారు. ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆదేశాల మేరకు ఆశ్రయ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జై దుర్గా భవాని సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ కార్యాలయంలో కార్మికులకు ఐడెంటిటీ కార్డులు అందజేయడం విశేషంగా నిలిచింది. కార్మిక సంక్షేమానికి భరోసా కల్పించే ఈ కార్య క్రమానికి భారీ సంఖ్యలో కార్మికులు, బీఆర్ఎస్ నాయకులు హాజరై విజయవంతం చేశారు.132వ డివిజన్ కుత్బుల్లాపూర్ లోని జై దుర్గా భవాని సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ కార్యాలయంలో అధ్యక్షులు కుంట వేణు ఆధ్వర్యంలో సెంట్రింగ్ కార్మికులకు ప్రత్యేక ఐడెంటిటీ కార్డులు అందజేశారు. హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆదేశాల మేరకు ఆశ్రయ్ స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్మికులకు సామాజిక భద్రత కల్పించే పథకాలపై అవగాహన కల్పించారు.ఈ ఐడెంటిటీ కార్డు కలిగిన కార్మికుడు ప్రమాదవశాత్తు మరణించినా లేదా శాశ్వత అంగవైకల్యానికి గురైనా కుటుంబ సభ్యులకు రూ.20 లక్షల బీమా సౌకర్యం అందుతుందని నిర్వాహకులు తెలిపారు. అలాగే కార్డు కలిగిన కుటుంబంలో ఆడబిడ్డ జన్మిస్తే రూ.30 వేల ఆర్థిక సహాయం అందించే ప్రత్యేక ప్రయోజనం కూడా ఉంటుందని వివరించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కుంట సిద్ధిరాములు, బచ్చ జ్ఞానేశ్వర్, పోగు సమ్మాన నేత పాల్గొని కార్మికులకు ఐడెంటిటీ కార్డులను పంపిణీ చేశారు. భారీ సంఖ్యలో సెంట్రింగ్ కార్మికులు పాల్గొని ఈ పథకాన్ని స్వాగతించారు.

# పిఆర్సి ప్రకటించి డిఏలు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి

- తపస్ యాదాద్రి జిల్లా జిల్లా ధర్నాలో డిమాండ్ చేస్తున్న అధ్యక్ష, కార్యదర్శులు రేపాక ఉమా, ఇరుగు యాదగిరి....

**భువనగిరి వెలుతురు జూలై 14:**





యాదాద్రి జిల్లా కేంద్రంలో నిర్వహించిన తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా ధర్నాలో పాల్గొని మాట్లాడారు. విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం,PRC, 6 DA లు,పెండింగ్ బిల్స్ పూర్తిగా చెల్లించాలని డిమాండ్ చేశారు.గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు సమస్యల న్యాయ పరమైన సమస్యలు పరిష్కారం కోసం ఉద్యమం చేయక తప్పని పరిస్థితి ఉంది.PRC రిపోర్టు వెంటనే తెప్పించుకుని,51/% ఫిట్మెంట్ ప్రకటన చేయాలి.ఉద్యోగ, ఉపాధ్యాయ,పెన్షనర్ల కు సంబందించి ఈ కుబెర్లో పేరుకు పోయిన పెన్షనర్స్ తో సహా అందరికి పెండింగ్ బిల్లులను పూర్తిగా చెల్లించాలి. భవిష్యత్ లో ఏ బిల్లు పెండింగ్ లో లేకుండా చూడాలి.6 డిఏల ప్రకటన విషయంలో గాని కదలిక లేదు.ఒక్కొక్క ఉద్యోగి ఉపాధ్యాయులు ఆర్థికంగా విషయంలో తీవ్రంగా నష్టపోతున్నారు. డిఎలు వెంటనే ప్రకటించాలి.పెన్షనర్స్ బెనిఫిట్స్ కోసం ఎదురు చూస్తున్నారు. జాప్యం చేయకుండా వారివి క్లియర్ చేయించాలి. కేజీబీవీ, SSA మహిళా ఉపాధ్యాయుల, సిబ్బంది సమ్మె కాలపు జీతం చెల్లిస్తూ, MTS ను అమలు చేయాలి.మోడల్ స్కూల్ 010 పద్దు విషయంలో సత్వరం నిర్ణయం తీసుకోవాలి. ప్రభుత్వం తీసుకొచ్చిన 190 జీవో అమలు మిగతా డిపార్ట్మెంట్ పూర్తి చేసిన విద్యాశాఖ ఇంకా కూడా పెండింగ్లో పెట్టింది. అప్పీల్ చేసుకున్న అందరికి ఉత్తర్వులు ఇవ్వాలి ముఖ్యమంత్రి గారు ఇచ్చిన హామీ మేరకు 2003 డీఎస్సీ వారికి OPS అమలు చేయాలి.సుప్రీంకోర్టులో ప్రభుత్వం SLP వెనక్కి తీసుకోవాలి.మ్యానిఫెస్టో ఉన్నా CPS రద్దు అంశంను పరిష్కారం కోసం ప్రత్యేకంగా చొరవ చూపి, అందరికి పాత పెన్షన్ అమలు చేయాలి.అన్ని రకాల గురుకుల ఆశ్రమ,ఎయిడెడ్ పాఠశాలల సమస్యలతో పాటు అక్కడ పనిచేసే ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక కమిటీని నియమించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలి.ఇన్సర్వీస్ ఉపాధ్యాయులకు 40% మార్కులు అర్హత గా నిర్ణయం చేయాలి.2008 DSC కాంట్రాక్టు ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలి.ఆర్థిక,ఆర్థికేతరవిషయాలపై కూడా ప్రభుత్వం ఉపాధ్యాయులను తీవ్రంగా విస్మరిస్తుంది.జూన్ రెండు నుంచి హెల్త్ కార్డులు అమలు చేస్తామని చెప్పి మే నెల శాలరీ లో వాటా కోత విధించడం జరిగింది.ట్రస్ట్ ఏర్పాటు అసంబద్ధంగా ఉంది. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ లో ఉన్న అన్ని సంఘాలు ట్రస్ట్ లో ఉండాలి మార్గదర్శకాలు పూర్తి అయిన తర్వాతే వాటా కట్ చేయాలి.ప్రభుత్వ పాఠశాలల మౌలికవసతులు కల్పన జూలై మొదటి వారంలోనే గ్రాంట్స్ రిలీజ్ చేయాలి. ఉపాధ్యాయుల వార్షిక ప్రమోషన్ ట్రాన్స్ఫర్ క్యాలెండర్ను విడుదల చేయాలి.ఈ విషయాలపై సంబంధిత అధికారులకు ఎన్ని ప్రాతినిధ్యాలు చేసిన ప్రయోజనం లేదు.తమరి ద్వారా సమస్యల పరిష్కారం కు చొరవ చూపాలి. సమస్యల పరిష్కారం కోసం జిల్లా స్థాయిలో ధర్నా కార్యక్రమం చేపట్టి ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ గారి ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి మెమోరాండం ద్వారా ఈ సమస్యలు తెలియజేస్తున్నాము. సమస్యల పరిష్కారం లో చొరవ చూపకపోతే ఆగస్టు 1 రోజు రాష్ట్ర మహా ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ ధర్నా కార్యక్రమంలో తపస్ రాష్ట్ర బాధ్యులు సీవీ శ్రీనివాస్, కొత్తకొండ శ్రీధర్, పెద్దిరెడ్డి శంకర్ రెడ్డి, జిల్లా కోశాధికారి పి సంతోష్ జిల్లా బాధ్యులు పురుషోత్తం రెడ్డి , బాలమణి,శ్రీధర్, బేతి శ్రీనివాస్, జెనీ వెంకటేశ్వర్లు పలుగుల రాజు ఉట్కూర్తి లక్ష్మణ, శ్రీనివాస్ వివిధ మండలల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ప్రాథమిక సభ్యులు ధర్నా కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు ధర్నా కార్యక్రమానికి మద్దతుగా పెన్షనరులు లక్ష్మి నారాయణ, సుకుమార్ విచ్చేసి మద్దతు ప్రకటించారు.

# ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని ఎత్తివేసేందుకు ప్రభుత్వ కుట్ర

- (ఎబీవీపీ)మహాత్మా గాంధీ యూనివర్సిటీ బంద్ విజయవంతం
- ఏబీవీపీ యూనివర్సిటీ కార్యదర్శి మోహన్

**నార్కట్ పల్లి వెలుతురు జూలై 14:**



అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఎబీవీపీ) రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఎబీవీపీ మహాత్మా గాంధీ యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం యూనివర్సిటీ బంద్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎబీవీపీ యూనివర్సిటీ కార్యదర్శి మోహన్ మాట్లాడుతూ, రాష్ట్రంలో సుమారు 20 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వం అందించే ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్లపై ఆధారపడి ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం సకాలంలో ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో రూ.11 వేల కోట్లకు పైగా బకాయిలు పేరుకుపోయాయని ఆరోపించారు.ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ప్రతి ఏడాది సుమారు 2 లక్షల మంది విద్యార్థులు చదువులు మధ్యలోనే మానేస్తున్నారని, లక్షలాది మంది విద్యార్థులు తమ విద్యా సర్టిఫికెట్లు పొందలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. దీంతో తెలంగాణ విద్యార్థులు పక్క రాష్ట్రాలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.గతంలో ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను చెల్లించడంతో పాటు గ్రీన్ ఛానల్ ద్వారా ప్రతి నెలా ఫీజులు విడుదల చేస్తామని హామీ ఇచ్చిన ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటి వరకు ఆ హామీని అమలు చేయలేదని విమర్శించారు. ఈ అంశంపై కోర్టును ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.ప్రైవేట్ కళాశాలలు, ప్రభుత్వం కలిసి విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, ఫీజుల బకాయిల కారణంగా అనేక కళాశాలలు మూతపడే పరిస్థితి వచ్చిందని, ఉపాధి కోసం లెక్చరర్లుగా పనిచేస్తున్న నిరుద్యోగులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్లు విద్యార్థుల హక్కులని, అవి ప్రభుత్వం ఇచ్చే భిక్ష కాదని స్పష్టం చేశారు. వాటి కోసం విద్యార్థులు ఆందోళన చేపడితే లాఠీచార్జీలు చేయడం, అక్రమ కేసులు నమోదు చేయడం సరికాదన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి, పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఛత్రపతి, స్టేట్ యూనివర్సిటీస్ కో–కన్వీనర్ మౌనేశ్వర్ చారి, ఖేల్ కో–కన్వీనర్ అజయ్, యూనివర్సిటీ ఉపాధ్యక్షులు విజయ్, రమావత్ సతీష్, ఆకాష్, రాజు, సిద్ధు, అజయ్, భాస్కర్, దేవదాస్, ఉదయ్, మల్లికార్జున్, ప్రదీప్, అభి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్.ఐ.ఆర్ సర్వేలో చురుకుగా పాల్గొంటున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

**నార్కట్ పల్లి వెలుతురు జూలై 14:**



నార్కెట్పల్లి మండల కేంద్రంలో కొనసాగుతున్న ఎస్.ఐ.ఆర్. (Special Intensive Revision) సర్వేలో తెలుగుదేశం పార్టీ నాయకులు చురుకుగా పాల్గొంటున్నారు. బీఎల్ఓల (BLOs)తో కలిసి ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలిస్తూ, ఎన్యుమరేషన్ (Enumeration) ఫారాలను పూర్తి చేయిస్తున్నారు.ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ భువనగిరి పార్లమెంట్ మాజీ కార్యదర్శి లింగాల యాదయ్య మాట్లాడుతూ, అర్హత కలిగిన ప్రతి ఓటరు ఎస్.ఐ.ఆర్. సర్వేలో తప్పనిసరిగా పాల్గొని తమ వివరాలను సక్రమంగా నమోదు చేయించుకోవాలని కోరారు. సర్వే గణన పత్రాలను పూర్తి చేయడంలో ఓటర్లకు అవసరమైన సహకారం అందిస్తూ, సర్వే ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో 6వ వార్డు సభ్యుడు బకరం జానీ, ఎంఆర్పీఎస్ (MRPS) పట్టణ అధ్యక్షుడు మంద సుధాకర్, వెలుతురు రిపోర్టర్ లింగాల ముత్తయ్య, కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు లింగాల దేవేందర్, యువకుడు మంద అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పించాలి

- పెరిగిన ధరకు అనుగుణంగా మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు బిల్లులు చెల్లించాలి
- గుండు వెంకటనర్సు సిపిఎం పార్టీ మండల కార్యదర్శి.

**మోత్కూర్, జులై 14,వెలుతురు న్యూస్ :**





ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పించి, విద్యార్థులకు మీరుగైన భోజనం అందించేందుకు పెరిగిన ధరలకు అనుగుణంగా ఏజెన్సీలకు బిల్లులు చెల్లించాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మోత్కూర్ మండలం పాలడుగు ప్రభుత్వ పాఠశాలను సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు . అనంతరం ఆయన మాట్లాడుతూ..... పాఠశాలలో 62 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, పాఠశాలలు ప్రారంభమై నెలరోజులు గడచినప్పటికి, ఇప్పటి వరకు విద్యార్థులకు పూర్తి స్థాయిలో యూనిఫామ్ అందించలేదని తెలిపారు. ప్రస్తుతం 8 వ తరగతి వరకు ఉన్నప్పటికీ, నలుగురు ఉపాధ్యాయులు ఐదు గదులలో 8 తరగతులు నిర్వహిస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి ప్రకటించిన అల్పాహార పథకం కేవలం మాటలకే పరిమితమైందని, మధ్యాహ్న భోజనం పథకంలో పెరిగిన ధరకు అనుగుణంగా ఏజెన్సీలకు బిల్లులు పెంచకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించలేక పోతున్నారని అన్నారు . ఖాళీగా ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయులను భర్తీ చేసి, తరగతికి ఒక గది, ఒక ఉపాధ్యాయున్ని నియమించాలని కోరారు. విద్యార్థులకు యూనిఫాం వెంటనే అందించాలని, ప్రభుత్వం ప్రకటించిన అల్పాహారం, నాణ్యమైన మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్, శాఖ కార్యదర్శి పిట్టల చంద్రయ్య, వెండి యాదగిరి పాల్గొన్నారు.

# అచ్చాలు మృతికి మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య నివాళి

**నార్కట్ పల్లి వెలుతురు జూలై 14:**



కట్టంగూర్ మండలం ముత్యాల మ్మగూడెం గ్రామానికి చెందిన గాధన బోయిన అచ్చాలు మరణించగా, వారి పార్థివ దేహానికి నకిరేకల్ మాజీ శాసన సభ్యులు చిరుమర్తి లింగయ్య పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. గాధనబోయిన అచ్చాలు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని కోరారు.

# తల్లిదండ్రులను ఫ్లైట్ ఎక్కించాడు

**నార్కట్ పల్లి వెలుతురు జూలై 14:**



నార్కెట్పల్లికి చెందిన డాక్టర్.టీజీ లింగం గౌడ్ తన తల్లిదండ్రులు కొయ్యడ సాలమ్మ, కేసవులను తొలిసారిగా విమాన ప్రయాణం చేయించాడు. వారు కాశీ విశ్వనాథ్ ఆలయం మరియు అయోధ్య రామమందిరం దర్శనానికి విమానంలో తీసుకెళ్లారు.తల్లిదండ్రులను ఆధ్యాత్మిక యాత్రకు తీసుకెళ్లడం ద్వారా పుణ్యక్షేత్రాల సందర్శన సౌకర్యం కల్పించడమే కాకుండా, వారి జీవితంలో తొలిసారి విమాన ప్రయాణం చేసే అవకాశాన్ని కూడా అందించి తన కోరికను నెరవేర్చాడు.ఇది తల్లిదండ్రుల పట్ల ప్రేమ, గౌరవం, బాధ్యతను చాటే మంచి ఉదాహరణగా నిలిచింది.

# పెరిగిన ధరలపై కాంగ్రెస్ ఆగ్రహం

- సామాన్యుల కష్టాలపై ప్రధాని ఎప్పుడు నోరు విప్పుతారని ప్రశ్న

**ఢిల్లీ వెలుతురు జూలై 14:**

దేశంలో రోజురోజుకూ పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరలపై కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. జూన్ నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం ఒక్కసారిగా 4.38 శాతానికి పెరగడంతో మోదీ ప్రభుత్వంపై విమర్శల దాడిని ముమ్మరం చేసింది. గత 12 ఏళ్లుగా కొనసాగుతున్న భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రభుత్వ పాలనలో ధరల పెరుగుదల కారణంగా దేశంలోని సామాన్య, మధ్యతరగతి కుటుంబాల బడ్జెట్ పూర్తిగా అతలాకుతలమైందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ మండిపడ్డారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్) లో ఒక సుదీర్ఘమైన పోస్ట్ చేస్తూ కేంద్ర ప్రభుత్వ తీరును ఎండగట్టారు.బీజేపీ ప్రభుత్వ 12 ఏళ్ల పాలనలో దేశ ప్రజలకు తప్పుడు హామీలు ఇవ్వడం మాత్రమే పెరిగిందని జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు. క్షేత్రస్థాయిలో మాత్రం ద్రవ్యోల్బణం, తీవ్రమైన నిరుద్యోగం రూపంలో సామాన్య ప్రజలపై ప్రభుత్వం పెను భారాన్ని మోపిందని విమర్శించారు. ప్రభుత్వ అధికారిక గణాంకాలే జూన్ నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం ఏకంగా 17 నెలల గరిష్ఠ స్థాయికి చేరినట్లు స్పష్టంగా చూపిస్తున్నాయని ఆయన గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా ప్రజలు ధరల పెరుగుదలతో ఇంతలా ఇబ్బందులు పడుతుంటే, ప్రధాని నరేంద్ర మోదీ దీనిపై ఎప్పుడు స్పందిస్తారని, సామాన్యుల కష్టాల గురించి ఎప్పుడు మాట్లాడతారని జైరాం రమేశ్ సూటిగా ప్రశ్నించారు.జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) తాజాగా విడుదల చేసిన నివేదికల ప్రకారం, మే నెలలో 3.93 శాతంగా నమోదైన వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం, జూన్ వచ్చేసరికి ఒక్కసారిగా 4.38 శాతానికి పెరిగింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నిర్దేశించుకున్న 4 శాతం ద్రవ్యోల్బణ నియంత్రణ లక్ష్య మార్కును ఇది దాటడం గమనార్హం. జనవరి నెల నుంచి అమల్లోకి వచ్చిన 2024 ప్రాతిపదిక సంవత్సరపు కొత్త శ్రేణి లెక్కల ప్రకారం, ద్రవ్యోల్బణం ఈ 4 శాతం మార్కును అధిగమించడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం.దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం ఈ స్థాయిలో పెరగడానికి ప్రధాన కారణం ఆహార వస్తువుల ధరలు విపరీతంగా పెరగడమేనని ప్రభుత్వ అధికారులు సైతం అంగీకరిస్తున్నారు. మే నెలలో 4.78 శాతంగా ఉన్న ఆహార ద్రవ్యోల్బణం, జూన్ నాటికి 5.32 శాతానికి చేరింది. ముఖ్యంగా వెండి, బంగారం, వజ్రాలు వంటి ఆభరణాలతో పాటు వంటింట్లో నిత్యం వాడే అల్లం, టమాటా, కిస్మిస్ వంటి నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకాయి. మరోవైపు బంగాళాదుంప, బఠానీలు, జీలకర్రతో పాటు కార్లు, మోటార్సైకిళ్లు, స్కూటర్ల ధరల పెరుగుదల వేగం కొంత తక్కువగా నమోదైనట్లు ఎన్ఎస్ఓ తన నివేదికలో వెల్లడించింది.కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాలను పరిశీలిస్తే ధరల పెరుగుదల ప్రభావం పట్టణ ప్రాంతాల కంటే గ్రామీణ ప్రాంతాలపైనే చాలా ఎక్కువగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. దేశవ్యాప్తంగా సగటు రిటైల్ ద్రవ్యోల్బణం 4.38 శాతంగా ఉంటే, పల్లెటూళ్లలో ఇది ఏకంగా 4.74 శాతంగా నమోదైంది. అదే సమయంలో పట్టణ ప్రాంతాలలో ద్రవ్యోల్బణం రేటు 3.92 శాతంగా ఉంది. ఈ లెక్కలను బట్టి చూస్తే, ఆర్థికంగా వెనుకబడిన గ్రామీణ ప్రజలు నిత్యావసర వస్తువులను కొనుగోలు చేయడానికి పట్టణ వాసుల కంటే ఎక్కువ డబ్బు ఖర్చు చేయాల్సి వస్తోందని తెలుస్తోంది.ద్రవ్యోల్బణం గరిష్ఠ స్థాయికి చేరడం వల్ల భవిష్యత్తులో దేశంలో బ్యాంకు వడ్డీ రేట్లు కూడా మరింత పెరిగే ప్రమాదం ఉందని జైరాం రమేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. అదే గనుక జరిగితే, బ్యాంకుల నుంచి గృహ రుణాలు (హోమ్ లోన్స్), వాహన రుణాలు తీసుకున్న మధ్యతరగతి ప్రజల నెలవారీ ఈఎంఐలు మరింత భారం కానున్నాయని హెచ్చరించారు. ఇప్పటికే ధరల దెబ్బకు సతమతమవుతున్న సామాన్యులపై ఈ వడ్డీ రేట్ల పెంపు అనేది కోలుకోలేని అదనపు భారంగా మారుతుందని ఆయన స్పష్టం చేశారు.దేశంలో ఒకవైపు సామాన్య ప్రజలు రోజువారీ ఖర్చులకే ఇబ్బంది పడుతుంటే, పెద్ద పెద్ద పారిశ్రామిక వర్గాలు మరియు కార్పొరేట్ సంస్థల లాభాలు మాత్రం విపరీతంగా పెరుగుతున్నాయని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ఆరోపించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కేవలం బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలకు, వారి లాభాలకు మాత్రమే అండగా నిలుస్తోందని మండిపడ్డారు. ధరల భారాన్ని మాత్రం ఏమీ లేని సామాన్య ప్రజల నెత్తిన రుద్దుతున్నారని, ఇదెక్కడి న్యాయమని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ విధానాలన్నీ సామాన్యుడిని దోచి కార్పొరేట్లకు పెట్టేలా ఉన్నాయని విమర్శించారు.ద్రవ్యోల్బణంతో పాటు ప్రధాని నరేంద్ర మోదీ అవినీతి వ్యతిరేక వైఖరిని కూడా జైరాం రమేశ్ తీవ్రంగా తప్పుపట్టారు. ప్రధాని పదవి చేపట్టే సమయంలో మోదీ ఇచ్చిన హామీలన్నీ కేవలం బూటకపు మాటలేనని కొట్టిపారేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశంలో 'కనీస పాలన.. గరిష్ఠంగా నిజాలను కప్పిపుచ్చే ధోరణి' మాత్రమే కనిపిస్తోందని విమర్శించారు.

# నల్లా కనెక్షన్లపై వచ్చిన పత్రికా కథనాన్ని తీవ్రంగా పరిగణించిన మేయర్

- సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులకు కఠిన ఆదేశాలు
- ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవు

**కరీంనగర్ వెలుతురు జూలై 14:**



నగరంలోని నల్లా కనెక్షన్ల మంజూరు, ఫీజుల వసూళ్లు, ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులపై మంగళవారం రోజున పత్రికలో ప్రచురితమైన కథనాన్ని నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ తీవ్రంగా పరిగణించారు.ఈ నేపథ్యంలో మేయర్ అధ్యక్షతన సంబంధిత ఇంజినీరింగ్, వాటర్ సప్లై, అధికారులతో అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో నల్లా కనెక్షన్ల దరఖాస్తుల స్థితి, పెండింగ్ ఫైల్స్, ఫీజుల వసూళ్లు, ప్రజల నుంచి అందిన ఫిర్యాదులు, పనుల పురోగతిపై సవివరంగా సమీక్షించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా ఎలాంటి జాప్యం, నిర్లక్ష్యం లేదా అవకతవకలు జరిగినా వాటిని ఏమాత్రం ఉపేక్షించబోమన్నారు. నల్లా కనెక్షన్ల మంజూరు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులో పరిష్కరించాలని, ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా సేవలు అందించాలని సూచించారు. ఇకపై పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు.విధుల్లో నిర్లక్ష్యం, అలసత్వం లేదా ప్రజలను ఇబ్బందులకు గురిచేసే అధికారులపై షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో పాటు శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు తప్పవని మేయర్ స్పష్టం చేశారు.అలాగే నల్లా కనెక్షన్లు, తాగునీటి సరఫరా లేదా మున్సిపల్ సేవలకు సంబంధించి ఎవరైనా అనవసరంగా ఇబ్బందులకు గురిచేసినా, ఆలస్యం చేసినా లేదా అక్రమంగా డబ్బులు డిమాండ్ చేసినా వెంటనే కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో లేదా సంబంధిత అధికారులకు నేరుగా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అందిన ప్రతి ఫిర్యాదుపై తక్షణమే విచారణ జరిపి, నిజానిజాలు నిర్ధారించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు."ప్రజా సేవలో బాధ్యత, పారదర్శకత, జవాబుదారీతనమే మా లక్ష్యం. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించడం ప్రతి ఉద్యోగి బాధ్యత. ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంలో ఎలాంటి రాజీ ఉండదు" అని నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో E E లచ్చిరెడ్డి, DE లు శ్రీనివాస్ ఓం ప్రకాష్ వెంకటేశ్వర్లు ఏ ఇ లు, ఫీట్టర్ మరియు ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వం ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి: తపస్

**మెదక్ వెలుతురు జూలై 14:**



తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మెదక్ కలెక్టర్ ఆఫీస్ ముందు తపస్ మెదక్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తపస్ మెదక్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిడ్డి ఎల్లం, జాల సిద్దూ మాట్లాడుతూ పిఆర్సిని ప్రకటించి అమలు చేయాలి ,సి పి ఎస్ రద్దు చేసి ఓపిఎస్ అమలు చేయాలి అని,, జీ ఓ 317 బాధితులకు న్యాయం చేయాలని, ఉద్యోగ ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని, సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మె కాలపు ఒక నెల వేతనాన్ని చెల్లించాలని , 2003 డిఎస్సి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చిన విధంగా ఇక్కడ కూడా వారికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి అని, కేజీబివి, మోడల్ స్కూల్, గురుకులల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వారు అన్నారు.ఈ కార్యక్రమం లో రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి దుబాషి భాస్కర్, రాష్ట్ర బాధ్యులు చల్లా లక్ష్మణ్, రంగారెడ్డి,ఆర్వి రామారావు, రమేష్,జిల్లా బాధ్యులు మంగ నర్సింలు, మాధవరెడ్డి, శ్రీధర్ రెడ్డి, దేశపతి కృష్ణమూర్తి, ప్రవీన్, శ్రీకాంత్ రెడ్డి,సురేందర్, ఈగ కృష్ణమూర్తి, భాస్కర్ రావు, అన్ని మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అన్ని మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది

- కోహిర్ మున్సిపల్ కౌన్సిలర్ ఎం.ఏ. కలీమ్...
- ఎస్ఐఆర్ ప్రక్రియకు మరింత గడువు ఇవ్వాలని ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి...

**జహీరాబాద్ వెలుతురు జూలై 14:**



ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులను, ప్రభుత్వాలను ఎన్నుకునేందుకు ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఓటరూ తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని కోహిర్ మున్సిపల్ కౌన్సిలర్ ఎం.ఏ. కలీమ్ అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ నెల 24తో ముగియనున్న ఎస్ఐఆర్ ప్రక్రియకు మరింత గడువు ఇవ్వాలని ఎన్నికల సంఘాన్ని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న పలువురు ఓటర్లకు అవకాశం కల్పించేలా గడువును పొడిగించాలని సూచించారు. బూత్ లెవల్ అధికారుల నుంచి ఎస్ఐఆర్ ఫారాలు అందుకున్న ఓటర్లు వాటిని పూర్తి చేసి సంబంధిత అధికారులకు సకాలంలో సమర్పించాలని కోరారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేసి తమ ఓటు హక్కును కాపాడుకోవాలని కలీమ్ పిలుపునిచ్చారు.

# ఖాజీపూర్ లో ఇసుక క్వారీని రద్దు చేయాలని గ్రామస్థుల ధర్నా

**కరీంనగర్ వెలుతురు జూలై 14:**



కొత్తపల్లి రూరల్ మండలం ఖాజీపూర్ గ్రామ పరిధిలో నిర్వహిస్తున్న ఇసుక క్వారీ వల్ల గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే ఆ క్వారీని రద్దు చేయాలని కోరుతూ మంగళవారం రోజున గ్రామ సర్పంచ్ కోమటిరెడ్డి అంజనీ కుమార్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. క్వారీ వద్దే బైఠాయించి గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేయడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. క్వారీ కార్యకలాపాల వల్ల వెలువడుతున్న ధూళితో గ్రామాల్లోని ప్రజలు శ్వాసకోశ ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు.నిత్యం వందలాది ఇసుక లారీలు తిరగడంతో గ్రామంలోని రోడ్లు పూర్తిగా పాడయ్యాయని, దీనివల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు.అడ్డగోలుగా ఇసుకను తరలించడం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని, దీనివల్ల వ్యవసాయం, తాగునీటికి ఇబ్బందులు కలుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాత్రింబవళ్లు జరుగుతున్న ఇసుక తరలింపు వల్ల గ్రామస్థుల భద్రతకు ముప్పు వాటిల్లుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ కోమటిరెడ్డి అంజనీ కుమార్ మాట్లాడుతూ "గ్రామ ప్రజల అభ్యంతరాలను పట్టించుకోకుండా, నిబంధనలకు విరుద్ధంగా క్వారీని కొనసాగిస్తున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గ్రామ అవసరాలకు, కనీసం ప్రభుత్వ అవసరాలకు కూడా ఇసుకను ఇవ్వకుండా క్వారీ నిర్వాహకులు అడ్డగోలు దోపిడీకి పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. ముఖ్యంగా గ్రామంలో భూగర్భ జలాలు అడగండిపోతున్నాయని, స్థానికుల ఆరోగ్యం, జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ క్వారీని రద్దు చేయాలనీ లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తాం" అని ఆయన హెచ్చరించారు..క్వారీ కార్యకలాపాలను తక్షణమే నిలిపివేసి, ఉన్నతాధికారుల బృందంతో విచారణ జరిపించాలని, గ్రామానికి శాశ్వత పరిష్కారం చూపాలంటూ గ్రామస్తులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో గ్రామంలోని మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో యువకులు పాల్గొన్నారు.

# సీడీఎంఏను కలిసిన ఎమ్మెల్యే మాణిక్‌రావు

- కోహీర్ సిబ్బంది కొరత, జహీరాబాద్ విలీన గ్రామాల అభివృద్ధికి నిధులు కోరుతూ వినతి...

**జహీరాబాద్ వెలుతురు జూలై 14:**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహీర్, జహీరాబాద్ మున్సిపాలిటీల సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే కె. మాణిక్‌రావు సీడీఎంఏ అధికారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ తంజీం కూడా పాల్గొన్నారు.సమావేశంలో కోహీర్ మున్సిపాలిటీలో తీవ్ర సిబ్బంది కొరత కారణంగా పారిశుధ్యం, పరిపాలనా సేవలు ప్రభావితమవుతున్నాయని ఎమ్మెల్యే వివరించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన పూర్తిస్థాయి సిబ్బందిని తక్షణమే నియమించాలని కోరారు.అలాగే, జహీరాబాద్ మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల అభివృద్ధి కోసం గతంలో విడుదలైన టీయూఎఫ్ఐడీసీ (TUFIDC) నిధులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. విలీన గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ, ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక నిధులు కేటాయించి సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు.ఎమ్మెల్యే వినతిపై సీడీఎంఏ సానుకూలంగా స్పందిస్తూ, సమస్యలను పరిశీలించి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# ఓటరు SIR కార్యక్రమంలో పాల్గొన్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

- బీఎల్ఓలకు పలు సూచనలు చేసిన మేయర్

**కరీంనగర్ వెలుతురు జూలై 14:**



నగరంలోని రెండవ డివిజన్ తీగల గుట్టపల్లెలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న ★ఓటరు SIR (Special Intensive Revision)★ కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్యక్రమం నిర్వహణను పరిశీలించిన మేయర్, బూత్ స్థాయి అధికారులు (BLOలు) ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అనర్హుల పేర్ల తొలగింపు, మార్పులు, చేర్పుల ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించి పూర్తి చేయాలని తెలిపారు.ప్రజలకు ఓటరు నమోదు, మార్పులు, చిరునామా సవరణ తదితర అంశాలపై పూర్తి అవగాహన కల్పించాలని, ఎలాంటి ఫిర్యాదులకు తావులేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని బీఎల్ఓలకు సూచించారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల శాఖ అధికారులు, బీఎల్ఓలు, ప్రజా ప్రతినిధులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఖానాపూర్-బడం పేట్ రహదారిని వెంటనే నిర్మించాలి

- ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి...
- కాంగ్రెస్ నాయకుడు కుదిమూస్కుల ప్రసాద్ రెడ్డి....

**జహీరాబాద్ వెలుతురు జూలై 14:**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం కోహిర్ మండలంలోని ఖానాపూర్ గ్రామం మీదుగా శ్రీ రచ్చన్న స్వామి దేవాలయం నుంచి బడం పేట్ వరకు ఉన్న దెబ్బతిన్న రహదారిని వెంటనే నిర్మించాలని కాంగ్రెస్ నాయకుడు కుదిమూస్కుల ప్రసాద్ రెడ్డి డిమాండ్ చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ డా. చంద్రశేఖర్ నెరవేర్చాలని కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రహదారి అధ్వాన్నంగా ఉండటంతో పరిసర గ్రామాల ప్రజలు, శ్రీ రచ్చన్న స్వామి దేవాలయానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. నియోజకవర్గానికి కాంగ్రెస్ ఎమ్మెల్యే లేకపోవడంతో పార్టీ ఇంచార్జ్ స్పందించి మండలంలోని రహదారుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

# 49వ డివిజన్లోని ఓటర్లు తమ వివరాలు నమోదు చేసుకోండి..

- కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి ప్రకాష్ పిలుపు

**కరీంనగర్ వెలుతురు జూలై 14:**



కేంద్ర ఎన్నికల కమిషన్ చేపట్టిన 'ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ' కార్యక్రమంలో భాగంగా, 49వ డివిజన్ పరిధిలోని ఓటర్లు తమ వివరాలను నమోదు చేసుకోవాలని కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి ప్రకాష్ విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమం ద్వారా ఓటరు నమోదు ప్రక్రియను సులభతరం చేసేందుకు, బి.ఎల్.ఓ ల ద్వారా కార్పొరేటర్ ఎన్యూమరేషన్ ఫారమ్‌లను పంపిణీ చేస్తున్నారు. ఈ ఫారమ్‌లను ఎలా పూర్తి చేయాలో కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి ప్రకాష్ వివరించారు. భాగం 1) ఓటరు యొక్క ప్రస్తుత వివరాలు.

భాగం 2) తల్లి లేదా తండ్రి వివరాలు. 3)ప్రస్తుత నివాస చిరునామా వివరాలు (ఫారమ్‌పై పాస్‌పోర్ట్ సైజు ఫోటో తప్పనిసరిగా అంటించాలి). నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటర్ల నమోదు ప్రక్రియ కోసం జూలై 14, 15, ఉదయం 9:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు. సనాతన ధర్మం ఆఫీస్, భాగ్యనగర్ రోడ్ నెం. 6.లో సంప్రదించాలని, ఈ అవకాశాన్ని 49వ డివిజన్ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి ప్రకాష్ కోరారు.ఈ కార్యక్రమంలో బి.ఎల్.ఓలు గాయత్రి, తిరుమల, రేణుక, వెంకటరవి, అరుణ, తార; బి.ఎల్.ఓ-2లు గోధ, గోని రమేష్, ముదిగంటి ప్రవీణ్, నరోత్తం రెడ్డి, పాశం నరసింహారెడ్డి, బండారి శ్రీనివాస్ పాల్గొన్నారు. వీరితో పాటు పోటీ చేసిన అభ్యర్థులు పటేల్ శ్రీనివాస్ రెడ్డి, సదానందం మరియు పలువురు పాల్గొన్నారు.

# తెలంగాణలో రాబోయేది బీజేపీ సర్కారే

- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి

**కరీంనగర్ వెలుతురు జూలై 14:**

రాష్ట్రంలో బిఆర్ఎస్ , కాంగ్రెస్ పార్టీల పనితీరు ప్రజలకు అర్థమైందని , ఆ రెండు పార్టీలు ప్రజా విశ్వాసాన్ని కోల్పోయాయని, తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.మానకొండూరు మండల కేంద్రంలోని పద్మావతి కళ్యాణ మండపంలో మంగళవారం రోజున భారతీయ జనతా పార్టీ మండల కార్యవర్గ సమావేశం అధ్యక్షులు కంది రాజిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రంగు భాస్కరచారి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో తెలంగాణలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని,. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అందిస్తున్న ప్రజాహిత పథకాలను, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత పటిష్టం చేసేందుకు శక్తి కేంద్రాలు, బూత్ కమిటీలను బలోపేతం చేయాల్సిన అవసరముందన్నారు.. ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా, మండల జిల్లా దళిత మోర్చా అధ్యక్షులు రాపాక ప్రవీణ్, ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి అడిచర్ల రాజు ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు అప్పని తిరుపతి, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి మియపురం లక్ష్మణచారి, ప్రధాన కార్యదర్శులు శీలం కుమార్, బాషబోయిన ప్రదీప్ యాదవ్ , మహిళా మోర్చా అధ్యక్షురాలు అవుదారి విజయ వీరితో పాటు మండల మోర్చాల అధ్యక్షులు, మండల పదాధికారులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జులు, బూత్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రతి ఓటరు ఎస్ ఐ ఆర్ ఫారాన్ని బి ఎల్ ఓ లకు అందజేయాలి

- సంగారెడ్డి బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్షులు కోణం విట్టల్

**మెదక్ జిల్లా :-**



నారాయణఖేడ్ నియోజకవర్గం పెద్ద శంకరంపేట్.. ప్రతి ఓటరు తప్పనిసరిగా తమ యొక్క ఎస్ ఐ ఆర్ ఫారాన్ని పూర్తిచేసి సంబంధిత బి.ఎల్.ఓ లకు అందజేయాలని సంగారెడ్డి జిల్లా బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్షులు కోణం విట్టల్ పేర్కొన్నారు..

మంగళవారం పెద్ద శంకరంపేటలోని బిజెపి కార్యాలయంలో మండల స్థాయి లో పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈనెల 24వ తేదీ లోపు తప్పనిసరిగా ప్రతి ఓటర్ కు సంబంధించిన ఎస్ ఐ ఆర్ ఎన్ని మేటర్ ఫారాలను పూర్తిగా నింపి ఆయా పోలింగ్ కేంద్రాల లోని బూత్ స్థాయి అధికారులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పేట మండల బిజెపి అధ్యక్షుడు శ్రావణ్ కుమార్. ప్రధాన కార్యదర్శి ఎం కృష్ణ. బిజెవైఎం అధ్యక్షుడు బుగుదాల కృష్ణ.. నాయకులు వెంకయ్య. ధ్రువ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలి

- బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని ముఖ్యమంత్రిపై ఒత్తిడి తీసుకు రావాలి
- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్



హైదరాబాద్ వెలుతురు జూలై 14:

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని అన్ని విద్యార్థి సంఘాలు, కుల సంఘాలు నిరంతరం ఉద్యమాలు చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ అన్నారు.వేలాది మంది విద్యార్థులు ఫీజు బకాయిలు విడుదల కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఉన్నత విద్య కొనసాగించడంలో అనేక ఆటంకాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు.విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని ఆయన విమర్శించారు.రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజాప్రతినిధులు రాజకీయాలకు అతీతంగా స్పందించి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఒత్తిడి తీసుకువచ్చి పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలన్నింటినీ తక్షణమే విడుదల చేయించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.పేద మరియు మధ్యతరగతి విద్యార్థుల చదువులకు భరోసా కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని, ఆలస్యం చేయకుండా ఫీజు బకాయిల విడుదలపై స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలని జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు.

# పిఆర్సి ప్రకటించి డిఏలు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి

- తపస్ రాష్ట్రసంఘటన కార్యదర్శి కానుగంటి హనుమంతరావు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఏవిఎన్ రెడ్డి డిమాండ్



ఇబ్రహీంపట్నం వెలుతురు జులై 14:

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కొంగరకలాన్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందునిర్వ హించిన ధర్నాలో పాల్గొన్న తపాస్ రాష్ట్ర సంఘటన కార్యదర్శి కనుగంటి హనుమంతరావు ఉపా ధ్యాయుల ఎమ్మెల్సీ ఏవిఎన్ రెడ్డి మాట్లాడుతూ విద్యారంగ ఉపాధ్యాయసమస్యల పరిష్కారం పిఆర్సి6 డిఏలుపెండింగ్ బిల్స్ పూర్తిగా చెల్లించాలని డిమాండ్ చేశారుగతంలో ప్రభుత్వం హామీ ఇచ్చినమేరకు సమస్యల న్యాయపరమైన సమస్యలు పరిష్కారం కోసం ఉద్యమం చేయక తప్ప ని పరిస్థితి ఉందిపి ఆర్సిరిపోర్టు వెంటనే తెప్పించుకుని51శాతం ఫిట్మెంట్ ప్రకటన చేయా లిఉద్యో గ ఉపాధ్యాయ పెన్షనర్ లకు సంబందించి ఈ కుబెర్ లోపేరుకు పోయిన పెన్షనర్స్ తో సహా అం దరికి పెండింగ్ బిల్లులను పూర్తిగా చెల్లించాలి భవిష్యత్ లో ఏబిల్లు పెండింగ్ లో లేకుండా చూడా లి6 డిఏల ప్రకటన విషయంలో గానికదలికలేదు ఒక్కొక్కఉద్యోగి ఉపాధ్యాయులు ఆర్థికంగా వి షయంలో తీవ్రంగా నష్టపోతున్నారు డిఎలు వెంటనే ప్రకటించాలి పెన్షనర్స్ బెనిఫిట్స్ కోసంఎదురు చూస్తున్నారు జాప్యం చేయకుండా వారివి క్లియర్ చేయించాలి కేజీబీవీ ఎస్ ఎస్ ఏ ఉద్యోగులు మహిళా ఉపాధ్యాయుల సిబ్బంది సమ్మె కాలపుజీతం చెల్లిస్తూ ఎంటిఎస్ ను అమలు చేయాలి మోడల్ స్కూల్ 010 పద్దు విషయంలో సత్వరంనిర్ణయం తీసుకోవాలి ప్రభుత్వం తీసుకొచ్చిన 190 జీవో అమలు మిగతా డిపార్ట్మెంట్లో పూర్తి చేసినట్లు విద్యాశాఖ ఇంకాకూడా పెండింగ్ లో పె ట్టిందిఅప్పీల్ చేసుకున్న అందరికి ఉత్తర్వులు ఇవ్వాలి ముఖ్యమంత్రి గారు ఇచ్చిన హామీమేరకు 2003డీఎస్సీ వారికి ఓపిఎస్ అమలు చేయాలి.సుప్రీంకోర్టులో ప్రభుత్వం ఎస్ఎల్పి వెనక్కితీసుకో వా లిమ్యానిఫెస్టో ఉన్నా సిపిఎస్ రద్దు అంశంను పరిష్కారం కోసం ప్రత్యేకంగా చొరవచూపి అం దరికి పాతపెన్షన్ అమలుచేయాలి అన్ని రకాల గురుకులఆశ్రమ ఎయిడెడ్ పాఠశాలల సమస్యల తో పాటు అక్కడ పనిచేసే ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేకకమిటీని నియ మించి సమస్యపరిష్కారానికి చొరవ చూపాలి ఇన్సర్వీస్ ఉపాధ్యాయులకు40 శాతంమార్కులు అర్హతగా నిర్ణయం చేయాలి2008 డీఎస్సీ కాంట్రాక్టు ఉపాధ్యా యులను రెగ్యులర్ చేయాలిఆర్థిక ఆర్థికేతరవిషయాలపై కూడాప్రభుత్వం ఉపాధ్యాయులను తీవ్రంగా విస్మరిస్తుంది జూన్ రెండు నుంచి హెల్త్ కార్డులు అమలు చేస్తామని చెప్పి మే నెల శాలరీలో వాటా కోత విధించడం జరిగిం ది ట్రస్ట్ ఏర్పాటు అసంబద్ధంగా ఉంది జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ లో ఉన్న అన్ని సంఘాలు ట్రస్ట్ లో ఉండాలి మార్గ దర్శకాలు పూర్తి అయిన తర్వాతే వాటాకట్ చేయాలి ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతులు కల్పన జూలై మొదటి వారంలోనే గ్రాంట్స్ రిలీజ్ చేయాలి ఉపాధ్యాయుల వార్షిక ప్రమోషన్ ట్రాన్స్ఫర్ క్యాలెండర్ను విడుదల చేయాలి ఈవిషయాలపై సంబంధిత అధికారులకు ఎన్ని ప్రాతినిధ్యాలు చేసిన ప్రయోజనం లేదు తమరిద్వారా సమస్యల పరిష్కారంకు చొరవ చూ పాలి సమస్యలపరిష్కారం కోసం జిల్లా స్థాయిలో ధర్నా కార్యక్రమం చేపట్టి ఉపాధ్యాయ సమస్య ల పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ గారి ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి మెమోరాండం ద్వారా ఈ స మస్యలు తెలియజేస్తున్నాము సమస్యల పరిష్కారంలో చొరవ చూపకపోతే ఆగస్టు1రోజు రాష్ట్ర మహాధర్నా చేపట్టనున్నట్లు తెలిపారుఈ ధర్నా కార్యక్రమంలో జిల్లాఅధ్యక్షులు కోట్ల కాశి రావు మరియు ప్రధానకార్యదర్శి పూజరి రమేశ రాష్ట్ర బాధ్యులు శ్రీనివాస్ రెడ్డిశ్రీహరి కృష్ణ యుగంధర్ రెడ్డి సురదీర్ రాజిరెడ్డి మహేశ్ కుమార్ మహిళ కన్వీనర్ సుమ రంజిత జిల్లా మరియు మండల బాధ్యులతో పాటు మొత్తం130 మంది తపస్ కార్యకర్తలు పాల్గొన్నారు

# హిమాయత్‌నగర్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో 20 ఎస్ఐఆర్ సహాయ కేంద్రాలు



- డివిజన్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్

హైదరాబాద్ వెలుతురు జూలై 14:

ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ప్రక్రియలో భాగంగా హిమాయత్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ ఆదేశాల మేరకు డివిజన్ పరిధిలో 20 చోట్ల ఎస్ఐఆర్ సహాయ కేంద్రాలు ఏర్పాటు చేశారు.ఎస్ఐఆర్ ఫారాలు నింపడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓటర్లకు ఈ కేంద్రాల్లో సహాయం అందించి, పూర్తి చేసిన దరఖాస్తులను బూత్ లెవల్ అధికారులకు (BLO) అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా ఖైరతాబాద్ ఎస్ఐఆర్ ప్రాసెస్ ఇన్‌చార్జి బసవరాజు శ్రీనివాస్ సహాయ కేంద్రాలను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటిని ఎన్నికల నమోదు అధికారి (ERO) దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జీ. రామన్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు నయీమ్, నాయకులు రాజేంద్రప్రసాద్, ప్రియ రాజేశ్వర్, సంజీవరెడ్డి, జైస్వాల్, మహేష్, పురుషోత్తం, హితేష్, జగదీష్, సాదీ, సోహెల్, మన్సూర్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ బీఎల్‌వోలు పాల్గొన్నారు.

# బోనాల పండుగలకు నిధులు విడుదల

- రాజధానిలో వైభవంగా ఆషాఢ బోనాల జాతర!
- తెలంగాణ వైభవానికి ప్రతీకగా ఆషాఢ బోనాలు
- జూలై 16 నుంచి నెల పాటు ఆధ్యాత్మిక శోభ
- ప్రధాన ఆలయాల్లో మొదలైన ఏర్పాట్లు
- భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు
- గోల్కొండతో మొదలై లాల్‌దర్వాజా వరకు
- బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవం
- మూడు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో సాగనున్న వైభవం
- 3,427 ఆలయాలకు రూ.15 కోట్ల నిధుల విడుదల
- ఆలయాల అభివృద్ధి, నిర్వహణ కోసం భారీగా కేటాయింపులు

హైదరాబాద్ వెలుతురు జూలై 14:



తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక వైభవానికి, ఆచార సంప్రదాయాలకు నిలువుటద్దంగా నిలిచే ఆషాఢ మాస బోనాల ఉత్సవాలను ఈ ఏడాది అత్యంత ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లోని ఆలయాలన్నీ భక్తజనంతో కిక్కిరిసిపోనున్నాయి. ఈ మహోత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో, కన్నుల పండుగగా నిర్వహించేందుకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలు కలిసికట్టుగా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నాయి.లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, ఏ ఒక్కరికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ, పోలీస్, దేవాదాయ, రోడ్లు-భవనాలు, నీటి సరఫరా, విద్యుత్, ఆర్టీసీ వంటి అన్ని విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి పనులను పర్యవేక్షిస్తున్నారు. ఆలయాల వద్ద క్యూ లైన్ల ఏర్పాటు, తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, రహదారుల మరమ్మతులు, ట్రాఫిక్ నియంత్రణ వంటి పనులను సకాలంలో పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు.బోనాల ఉత్సవాలు జూలై 16న గోల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి అమ్మవారికి బోనం సమర్పించడంతో ప్రారంభమవుతాయి. ఆగస్టు 2న సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి బోనాలు, ఆగస్టు 3న రంగం కార్యక్రమం నిర్వహిస్తారు. ఇక ఆగస్టు 9న లాల్‌దర్వాజా శ్రీ సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాలతో పాటు, నగరంలోని ప్రధాన ఆలయాల్లో జరిగే వేడుకల కోసం అద్భుతమైన ఏర్పాట్లు చేస్తున్నారు. పూల అలంకరణలు, విద్యుద్దీపాలంకరణలతో నగరం అంతా అమ్మవారి కోవెలలా మెరిసిపోనుంది.బోనాల పండుగలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన బల్కంపేట శ్రీ ఎల్లమ్మ అమ్మవారి కల్యాణోత్సవాలు జూలై 20, 21, 22 తేదీల్లో అత్యంత వైభవంగా జరగనున్నాయి. జూలై 20న ఎదుర్కోలు ఉత్సవం, 21న అత్యంత ఘనంగా అమ్మవారి కల్యాణం, 22న రథోత్సవం నిర్వహించబడుతుంది. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని, భక్తులు క్రమశిక్షణతో ఉత్సవాలను జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు.ఈ ఏడాది బోనాల పండుగ కోసం ప్రభుత్వం భారీగా నిధులను కేటాయించింది. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో పాత జీహెచ్ఎంసీ పరిధిలోని 3,427 దేవాలయాలకు రూ.15,05,41,150 కోట్లను విడుదల చేశారు. ఈ నిధులతో ఆలయాల మరమ్మతులు, భక్తులకు సౌకర్యాల కల్పనను వేగవంతం చేశారు. అమ్మవారికి సమర్పించే పట్టువస్త్రాలు, ఫలహారం బండ్ల ఊరేగింపు వంటి కార్యక్రమాలను కూడా ప్రభుత్వమే దగ్గరుండి పర్యవేక్షిస్తోంది.ప్రతి భక్తుడికి సురక్షితమైన, సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. అత్యధిక రద్దీ ఉండే ఆలయాల వద్ద ప్రత్యేక క్యూ లైన్లు, వైద్య శిబిరాలు, అంబులెన్స్ సదుపాయం కల్పిస్తున్నాం. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని పోలీస్ శాఖకు సూచించాం. పారిశుద్ధ్య లోపం లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా జీహెచ్ఎంసీ ప్రత్యేక బృందాలను సిద్ధం చేసింది. భక్తిప్రపత్తులతో పండుగను జరుపుకోవాలని కోరుతున్నాం.గోల్కొండ జగదాంబ, ఉజ్జయిని మహంకాళి, కట్ట మైసమ్మ, అక్కన్న-మాదన్న దేవాలయం, లాల్‌దర్వాజా సింహవాహిని, భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం వంటి నగరంలోని సుమారు 30 ప్రధాన దేవాలయాల్లో రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రులు, ప్రజాప్రతినిధులు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. ఈ ప్రక్రియ అంతా అత్యంత సంప్రదాయబద్ధంగా జరుగుతుంది. పట్టువస్త్రాల సమర్పణ అనంతరం అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైన ఫలహారం బండ్ల ఊరేగింపును వైభవంగా నిర్వహిస్తాం.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న టీజీఎస్ఆర్టీసీ ఉచిత బస్సు సౌకర్యం మహిళలకు గొప్ప వరం. ఈ సౌకర్యం వల్ల రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉంది. రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. మహిళా భక్తులు అమ్మవారిని దర్శించుకుని, ఈ మహోత్సవాలను మరింత విజయవంతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. భక్తులందరూ కలిసి తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటిచెబుదామని ఆకాంక్షించారు.

# ఇసుక ర్యాంపుల్లో అక్రమ లోడింగ్ డబ్బుల వసూళ్లను వెంటనే అరికట్టండి పెద్ద అంబార్ పేట ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్

- ఇసుక కాంట్రాక్టర్లకు TGMDC అధికారుల అండదండలున్నాయా?
- VC & MD గారు ఎందుకు మౌనంగా ఉంటున్నారు?
- GM గారు ఎప్పటికప్పుడు ఇసుక ర్యాంపులపై పర్యవేక్షణ చేయడం లేదా?
- సమగ్ర ప్రక్షాళన ఎప్పుడు?

రంగారెడ్డి జిల్లా వెలుతురు జూలై 14:

TGMDC సంస్థ ఇసుక ర్యాంప్ కాంట్రాక్టర్లకు లోడింగ్ చార్జీలు చెల్లిస్తున్నప్పటికీ, లారీ యజమానుల నుంచి మరోసారి ప్రతి లారీకి సుమారు ₹3,000 వరకు అదనంగా ఎందుకు వసూలు చేస్తున్నారనే ప్రశ్నలు లేవనెత్తబడుతున్నాయి.తెలంగాణ రాష్ట్రంలోని ఇసుక ర్యాంపుల వద్ద లారీ యజమానుల నుంచి లోడింగ్ పేరుతో అక్రమంగా భారీ మొత్తాలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు రోజురోజుకూ తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.ప్రతి లారీకి సుమారు ₹3,000 వరకు వసూలు చేస్తున్నారని లారీ యజమానులు ఆరోపిస్తున్నప్పటికీ, ఈ ఆరోపణలపై TGMDC అధికారులు ఎందుకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం లేదు?

TGMDC VC & MD గారు ఎందుకు స్పందించడం లేదు?

TGMDC GM గారు ఇసుక ర్యాంపులపై నిరంతర పర్యవేక్షణ ఎందుకు చేపట్టడం లేదు?

అక్రమ వసూళ్లను అరికట్టడంలో పర్యవేక్షణ వ్యవస్థ ఎందుకు విఫలమవుతోంది?

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా రోజుకు సుమారు 10,000 లారీలకు TGMDC ఆధ్వర్యంలో లోడింగ్ జరుగుతున్న నేపథ్యంలో, ప్రతి లారీపై వసూలు చేస్తున్న లోడింగ్ డబ్బుల వ్యవహారంపై ఉన్నత స్థాయి స్వతంత్ర విచారణ జరిపి, వాస్తవాలను ప్రజల ముందుంచాలని మా డిమాండ్.విచారణలో అక్రమాలు జరిగినట్లు తేలితే సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు మరియు ఇతర బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.TGMDCలో సమగ్ర ప్రక్షాళన చేపట్టి, పారదర్శకమైన ఇసుక రవాణా వ్యవస్థను అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర లారీ ఓనర్స్ డిమాండ్ చేస్తున్నారు.



పోలగోని భాస్కర్ గౌడ్ అధ్యక్షుడు పెద్ద అంబార్ పేట ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్

# బస్తీ ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలి

- క్షయ వ్యాధి, లెప్రసీ కేసులను గుర్తించి రిజిస్ట్రేషన్ చేసి నమోదు చేయాలి. వారందరికీ ఆరోగ్య సేవలు అందించాలి.
- వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలి.
- నాణ్యమైన ఆ రోగ్య సేవలు ప్రతి ఒక్కరికి అందించాలి
- గర్భిణీ స్త్రీల పరీక్షలు, సేవలు, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం సమర్థ వంతంగా నిర్వహించాలీ.
- అన్ని రకాల మందులు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో & బస్తీ దవాఖానాలలో అందుబాటులో ఉన్నవని తెలియజేశారు.
- అన్ని రకాల పరీక్షలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలియ జేశారు.

హైదరాబాద్ వెలుతురు జూలై 14:





జంగం మెట్ క్లస్టర్ పరిధిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల, బస్తీ దవాఖాన, ఆర్ బి ఎస్ కే చెందిన వైద్యాధికారులు, సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ANMలు మరియు ఆశా కార్యకర్తలతో సమీక్ష సమావేశం ఈరోజు ఓవైసీ హాస్పిటల్ సంతోష్ నగర్ సమావేశ మందిరంలో నిర్వహించబడింది.ఈ సందర్భంగా DM&HO గారు మాట్లాడుతూ, వివిధ జాతీయ , రాష్ట్ర ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సూచికల వారిగా సమగ్ర సమీక్ష నిర్వహించారు. కార్యక్రమాల అమలులో వేగం పెంచి సత్వరమే పూర్తి చేయాలని కోరారు.ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలను సమర్థవంతంగా అందించడం ప్రతి ఆరోగ్య సిబ్బంది బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రజారోగ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని, గర్భిణీల సంరక్షణ,సేవలు, శిశు టీకాలు, అంటువ్యాధుల నివారణ, సీజనల్ వ్యాధుల నియంత్రణ మరియు ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగీ, చికున్ గునియా పై ఇంటింటి ఆరోగ్య సర్వేలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.అలాగే, ఆరోగ్య సేవల పట్ల ప్రజల్లో మరింత అవగాహన కల్పించి, ప్రతి అర్హులైన లబ్ధిదారునికి ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని ఆదేశించారు. టీబి రోగులకు నిక్షయ్ పోషన్ యోజన ద్వారా ఇచ్చే పేమెంటును సత్కారమే అందించాలి సూచించారు. గర్భిణి హెచ్ఐవి ఎయిడ్స్ రోగులు ART సెంటర్లకు వెళ్లి చికిత్స తీసుకునే విధంగా సిబ్బంది పనిచేయాలి సూచించారు.ఓపి సేవలు ఉదయం తొమ్మిది గంటల నుండి సాయంత్రం 4 గంటలకు నిర్వహించాలని కోరారు. మెడికల్ ఆఫీసర్స్, సూపర్ వైజరీ సిబ్బంది తప్పకుండా అన్ని ఆరోగ్య కార్యక్రమాలను పర్యవేక్షణ చేసి ఫీల్డ్ సిబ్బందికి ఎప్పటికప్పుడు సూచనలు సలహాలు ఇస్తూ మన ఆరోగ్య కార్యక్రమాల ఇండికేటర్స్ సకాలంలో పూర్తయ్యేటట్లు, చర్యలు తీసుకోవాలని కోరారు.ఆరోగ్య సేవలు అందించడంలో వైద్యులు, ఇబ్బంది అలసత్వము వహించకూడదు అని కోరారు. ఆశా కార్యకర్తలు BLO విధులు నిర్వహిస్తున్నవారు BLO విధులను పూర్తయింత వరకు చేయాలని తెలియజేశారు.ఈ సమావేశంలో డా : చల్లా దేవి జిల్లా టీబి అధికారి ,అదనపు జిల్లా వైద్యాధికారి డా:అనిత , అడిషనల్ డిఎంహెచ్ఓ (ఎయిడ్స్ &, లెప్రసీ) డాక్టర్ సరస్వతి , ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డా: శ్రీధర్, డా: శ్రీ కళా ,డా: అనిత , ఆశ్రిత రెడ్డి , సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్స్ , జిల్లా మీడియా అధికారి జక్కుల రాములు, ఇంచార్జ్ మలేరియా అధికారి ఆంజనేయులు, పాల్గొని వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో హాజరైన వైద్యాధికారులు, సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ANMలు మరియు ఆశా కార్యకర్తలకు జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి అవసరమైన సూచనలు, మార్గదర్శకాలు , దిశా నిర్దేశం చేశారు.

# స్వదేశానికి షేక్ హసీనా పయనం

- అడుగుపెడితే జైలుకేనని బంగ్లాదేశ్ మంత్రి హెచ్చరిక
- అరెస్టుకైనా, చావుకైనా సిద్ధమన్న మాజీ ప్రధాని
- కోర్టులో దోషిగా తేలిన వ్యక్తికి మినహాయింపులు లేవు
- చట్టం తన పని తాను చేసుకుపోతుందన్న షామా ఒబైద్
- భారత్‌లో లొంగిపోయినా జైలు శిక్ష తప్పదు
- హసీనా భవిష్యత్తును న్యాయవ్యవస్థే నిర్ణయిస్తుందని వెల్లడి
- పార్టీ శ్రేణుల్లో ధైర్యం నింపేందుకే హసీనా ప్రకటనలు
- కేవలం రాజకీయ సంకేతాల కోసమేనని మంత్రి విమర్శ

**బంగ్లాదేశ్ వెలుతురు జూలై 14:**

బంగ్లాదేశ్ రాజకీయాల్లో మరోసారి తీవ్ర ఉత్కంఠ రేపుతూ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా స్వదేశానికి తిరిగి వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఈ పరిణామంపై బంగ్లాదేశ్ ప్రస్తుత ప్రభుత్వం అత్యంత ఘాటుగా స్పందించింది. షేక్ హసీనా గనుక తిరిగి బంగ్లాదేశ్‌లో అడుగుపెడితే ఆమెను వెంటనే అరెస్ట్ చేసి జైలుకు తరలిస్తామని ఆ దేశ విదేశాంగ శాఖ సహాయ మంత్రి షామా ఒబైద్ ఇస్లాం చాలా స్పష్టంగా ప్రకటించారు. ఆమె ఎక్కడ లొంగిపోయినా సరే, దేశ సరిహద్దుల్లోకి రాగానే చట్టపరమైన నిబంధనల ప్రకారం తక్షణమే అరెస్ట్ ప్రక్రియ అమలవుతుందని వెల్లడించారు.మాజీ ప్రధాని షేక్ హసీనా లొంగిపోవడానికి సిద్ధపడితే, ప్రస్తుతం దేశంలో అమలులో ఉన్న సాధారణ చట్టాల ప్రకారమే తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి షామా ఒబైద్ వివరించారు. చట్టం ఎవరికైనా ఒకేలా ఉంటుందని, తన పని తాను చేసుకుపోతుందని అన్నారు. హసీనా ఇప్పటికే కోర్టు ద్వారా దోషిగా తేలిన వ్యక్తి అని గుర్తుచేసిన ఆయన.. ఈ విషయంలో ప్రభుత్వం ప్రత్యేకంగా విచారించాల్సిన లేదా మినహాయింపులు ఇవ్వాల్సిన అవసరమేమీ లేదని తేల్చి చెప్పారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారు ఎవరైనా సరే శిక్ష అనుభవించాల్సిందేనని స్పష్టం చేశారు.షేక్ హసీనా ఒకవేళ పొరుగు దేశమైన భారత్‌లో ఉన్న బంగ్లాదేశ్ రాయబార కార్యాలయంలో లొంగిపోయినా, లేదా నేరుగా బంగ్లాదేశ్ వచ్చి కోర్టులో లొంగిపోయినా సరే.. ముందుగా ఆమె జైలు గడప తొక్కాల్సిందేనని విదేశాంగ సహాయ మంత్రి స్పష్టం చేశారు. ఆమె దేశానికి తిరిగి వచ్చిన తర్వాత చట్టపరమైన విచారణ ఏ విధంగా సాగాలి, తదుపరి చర్యలు ఎలా ఉండాలనే అత్యంత కీలకమైన అంశాలను పూర్తిగా దేశ న్యాయవ్యవస్థే నిర్ణయిస్తుందని చెప్పారు. ఇందులో ప్రభుత్వ జోక్యం ఏమీ ఉండబోదని వివరించారు.షేక్ హసీనాను తిరిగి దేశానికి రప్పించే చట్టపరమైన ప్రక్రియ గత తాత్కాలిక ప్రభుత్వ హయాంలోనే మొదలైందని, ప్రస్తుతం అధికారంలో ఉన్న బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) నేతృత్వంలోని ప్రభుత్వం కూడా అదే పంథాను కొనసాగిస్తోందని మంత్రి తెలిపారు. విదేశాల్లో తలదాచుకుంటూ తాను త్వరలోనే బంగ్లాదేశ్‌కు తిరిగి వస్తానంటూ హసీనా చేస్తున్న ప్రకటనలు కేవలం రాజకీయ సంకేతాల కోసమేనని ఆయన అభిప్రాయపడ్డారు. దేశం విడిచి పారిపోయిన లేదా అజ్ఞాతంలో ఉన్న అవామీ లీగ్ నాయకులు, కార్యకర్తల్లో తిరిగి ధైర్యం నింపేందుకే ఆమె ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని, లొంగిపోవడం ఆమె అసలు ఉద్దేశం కాకపోవచ్చని



విమర్శించారు.బంగ్లాదేశ్‌లో 2024 జులై నెలలో ప్రభుత్వ ఉద్యోగాల రిజర్వేషన్లకు వ్యతిరేకంగా విద్యార్థులు పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టిన సంగతి తెలిసిందే. ఆ నిరసనలు క్రమంగా తీవ్రరూపం దాల్చి, చివరకు హసీనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమంగా మారాయి. ఆగ్రహించిన ఆందోళనకారులు ఏకంగా ప్రధానమంత్రి అధికారిక నివాసాన్ని ముట్టడించడంతో.. 2024 ఆగస్టు 5న షేక్ హసీనా తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ప్రాణభయంతో ఆమె హుటాహుటిన ఢాకా నగరాన్ని విడిచి భారత్‌కు చేరుకున్నారు. అప్పటి నుంచి ఆమె ఢిల్లీలోని ఒక సురక్షిత, రహస్య ప్రదేశంలో నివసిస్తున్నారు.విద్యార్థుల నిరసనలను ఉక్కుపాదంతో అణచివేసే క్రమంలో మానవత్వానికి వ్యతిరేకంగా కఠిన నేరాలకు, హింసకు పాల్పడ్డారనే ఆరోపణలపై హసీనాపై బంగ్లాదేశ్‌లో అనేక కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాత ఏర్పాటైన యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం ఈ ఘోరాలపై ప్రత్యేక న్యాయ విచారణకు ఆదేశించింది. దీనిపై విచారణ జరిపిన బంగ్లాదేశ్ ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్ (ఐసీటీ) గతేడాది హసీనాకు మరణశిక్ష విధిస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. అయితే, ఈ తీర్పుతో పాటు తనపై వచ్చిన ఆరోపణలన్నీ పూర్తిగా రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగమేనని షేక్ హసీనా మొదటి నుంచి కొట్టిపారేస్తున్నారు.ఇదిలా ఉండగా, ఇటీవల ఒక అంతర్జాతీయ వార్తా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో షేక్ హసీనా ఎంతో భావోద్వేగంగా మాట్లాడారు. తాను త్వరలోనే బంగ్లాదేశ్‌కు వెళ్లే ఆలోచనలో ఉన్నానని స్పష్టం చేశారు. స్వదేశానికి తిరిగి వెళ్లి కోర్టు ముందు లొంగిపోయేందుకు తనకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. రాజకీయాల కోసం తాను అరెస్టు కావడానికైనా, లేదా చావడానికైనా సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. ఒకవేళ తనకు మరణం సంభవించాల్సి వస్తే, అది పరాయి దేశంలో కాకుండా తన కన్న సొంత గడ్డపైనే జరగాలని కోరుకుంటున్నట్లు హసీనా ఆవేదన వ్యక్తం చేశారు.కోర్టు తీర్పు వెలువడినప్పటి నుంచి షేక్ హసీనాను తమకు అప్పగించాలంటూ బంగ్లాదేశ్ ప్రభుత్వం భారత అధికార వర్గాలకు నిరంతరం లేఖలు రాస్తోంది. ఇప్పటికే పలుమార్లు అధికారిక లేఖలు పంపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే హసీనా ఒక కీలక నిర్ణయానికి వచ్చారు. భారత ప్రభుత్వానికి తన వల్ల ఎలాంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతోనే తాను స్వదేశానికి వెళ్లాలని నిశ్చయించుకున్నట్లు తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్ నెలలోనే తనతో పాటు అవామీ లీగ్ పార్టీకి చెందిన కీలక సీనియర్ నాయకులంతా కలిసి బంగ్లాదేశ్‌కు వెళ్లి అక్కడి న్యాయస్థానాల ముందు లొంగిపోవాలని ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నట్లు షేక్ హసీనా వెల్లడించారు.

# పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ జ్వాలలు

- సౌదీ, హౌతీల మధ్య భీకర దాడులు, ప్రతిదాడులు
- అమెరికా అండ కోరిన ప్రిన్స్ సల్మాన్
- తిరుగుబాటుదారుల మధ్య ముదిరిన ఘర్షణ
- విమానాశ్రయాలే లక్ష్యంగా క్షిపణులు, డ్రోన్లతో దాడులు
- సనా ఎయిర్‌పోర్టుపై సౌదీ బలగాల బాంబుల వర్షం
- ఇరాన్ విమానం రాకతో మొదలైన సరికొత్త వివాదం
- ఆయుధాల తరలింపుపై సౌదీ అరేబియా అనుమానాలు
- ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ సంస్థపైనే నిఘా

**పశ్చిమాసియా వెలుతురు జూలై 14:**



పశ్చిమాసియా ప్రాంతంలో ఒక్కసారిగా యుద్ధ వాతావరణం నెలకొంది. ఇరాన్ దేశ మద్దతుతో పనిచేస్తున్న హౌతీ తిరుగుబాటుదారులకు, సౌదీ అరేబియాకు మధ్య దాడులు, ప్రతిదాడులు విపరీతంగా పెరిగిపోయాయి. ఇరుపక్షాలు పరస్పరం క్షిపణులు, అత్యాధునిక డ్రోన్లతో విరుచుకుపడుతున్నాయి. ముఖ్యంగా ఇరు దేశాల్లోని అంతర్జాతీయ విమానాశ్రయాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు సాగుతుండటంతో తీవ్ర కలకలం రేగుతోంది. ఈ తాజా ఘర్షణల్లో భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తున్నప్పటికీ, ప్రాణనష్టానికి సంబంధించిన వివరాలను సౌదీ అరేబియా ప్రభుత్వం ఇంకా అధికారికంగా వెల్లడించలేదు.యెమెన్ దేశంలోని హౌతీల అదుపులో ఉన్న సనా అంతర్జాతీయ విమానాశ్రయంపై సౌదీ అరేబియా బలగాలు బాంబుల వర్షం కురిపించడంతోనే ఈ తాజా వివాదం మొదలైంది. ఇరాన్‌కు చెందిన 'మహాన్ ఎయిర్' అనే ఒక ప్రత్యేక విమానం సనా ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అవ్వడమే ఇందుకు ప్రధాన కారణంగా మారింది. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియల కార్యక్రమానికి హాజరైన హౌతీ ప్రతినిధులను తీసుకుని ఈ విమానం యెమెన్‌కు వచ్చినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఈ విమానం రాకను తీవ్రంగా పరిగణించిన సౌదీ.. అది తిరిగి వెళ్లే లోపే సనా రన్‌వేపై వైమానిక దాడులు జరిపి దాన్ని దెబ్బతీసింది.మహాన్ ఎయిర్ విమానం ద్వారా ఇరాన్ నుంచి ప్రమాదకరమైన ఆయుధాలు, క్షిపణి విడిభాగాలు లేదా ఇరాన్‌కు చెందిన ప్రత్యేక సైనిక సిబ్బందిని యెమెన్‌కు తరలిస్తున్నారని సౌదీ అరేబియా బలంగా అనుమానించింది. అమెరికా నిఘా వర్గాల సమాచారం ప్రకారం, ఈ మహాన్ ఎయిర్ అనే సంస్థ ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ తో ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉంది. అందుకే యెమెన్‌లోని అంతర్జాతీయ గుర్తింపు పొందిన ప్రభుత్వం కూడా సౌదీ దాడులను సమర్థించింది. ఇరాన్ విమానం తమ భూభాగాన్ని వాడుకోకుండా అడ్డుకోవడానికే ఈ దాడులు చేసినట్లు స్పష్టం చేసింది.తమ ఆధీనంలో ఉన్న సనా ఎయిర్‌పోర్టుపై సౌదీ బలగాలు జరిపిన దాడులకు హౌతీలు కొన్ని గంటల్లోనే తీవ్ర ప్రతీకారం తీర్చుకున్నారు. సౌదీ అరేబియాలోని ప్రసిద్ధ 'అభా అంతర్జాతీయ విమానాశ్రయం'పై క్షిపణులు, ఆత్మాహుతి డ్రోన్లతో దాడులు చేశారు. ఈ దాడుల అనంతరం హౌతీల సైనిక ప్రతినిధి యాహ్యా సరీ అంతర్జాతీయ విమానయాన సంస్థలకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. సనా విమానాశ్రయంపై సౌదీ విధించిన ఆంక్షలను ఎత్తివేసే వరకు, సౌదీ గగనతలంలో ఎలాంటి విమానాలను నడపవద్దని చెప్పారు. రోగులను, సామాన్య ప్రజలను తరలించే విమానాలను అడ్డుకోవడానికే సౌదీ ఈ కుట్రలు చేస్తోందని ఆయన ఆరోపించారు.యెమెన్‌లోని ఇరాన్ మద్దతుగల హౌతీ తిరుగుబాటుదారులను పూర్తిగా అణచివేయడానికి సౌదీ అరేబియా ప్రభుత్వం పెద్ద వ్యూహాన్నే సిద్ధం చేసింది. ఇందులో భాగంగానే, హౌతీలపై పూర్తి స్థాయి సైనిక చర్యలు ప్రారంభించడానికి ముందే సౌదీ యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో చర్చలు జరిపారు. ఈ సైనిక ఆపరేషన్‌కు అమెరికా మద్దతు ఇవ్వాలని కోరారు. ఒక అంతర్జాతీయ మీడియా నివేదిక ప్రకారం.. సౌదీ తీసుకునే ఈ చర్యలకు అధ్యక్షుడు ట్రంప్ కూడా అంగీకారం తెలిపినట్లు సమాచారం. అమెరికా గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన వెంటనే సౌదీ బలగాలు హౌతీల స్థావరాలపై విరుచుకుపడ్డాయి.సౌదీ అరేబియా, హౌతీల మధ్య మళ్లీ యుద్ధ వాతావరణం తలెత్తడంపై అంతర్జాతీయ సమాజం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ పరిణామాలను నిశితంగా గమనించిన ఐక్యరాజ్యసమితి (ఐరాస) భద్రతా మండలి అత్యవసరంగా సమావేశమైంది. యెమెన్‌తో పాటు మొత్తం పశ్చిమాసియా ప్రాంతం మరోసారి కోలుకోలేని విధంగా తీవ్ర ఘర్షణల వైపు వెళ్లే ప్రమాదం ఉందని ఐరాస రాజకీయ వ్యవహారాల సహాయ ప్రధాన కార్యదర్శి ఖాలిద్ ఖియారి హెచ్చరించారు. యుద్ధం వల్ల సామాన్య ప్రజలు నష్టపోతారని, కాబట్టి అన్ని పక్షాలు తక్షణమే దాడులు ఆపి ఐరాస ఆధ్వర్యంలో శాంతి చర్చలకు రావాలని పిలుపునిచ్చారు.ప్రస్తుతం జరుగుతున్న దాడులు చూస్తుంటే గతంలో యెమెన్ దేశాన్ని కుదిపేసిన భయంకరమైన అంతర్యుద్ధం గుర్తుకు వస్తోంది. 2014 లో హౌతీ తిరుగుబాటుదారులు యెమెన్ రాజధాని సనాను బలవంతంగా స్వాధీనం చేసుకోవడంతో అక్కడ పెద్ద ఎత్తున ఘర్షణలు ప్రారంభమయ్యాయి. ఆ తర్వాత అక్కడి అధికారిక ప్రభుత్వానికి అండగా నిలిచేందుకు 2015లో సౌదీ అరేబియా నేతృత్వంలోని అరబ్ దేశాల కూటమి నేరుగా రంగంలోకి దిగింది. అప్పట్లో ఇరుపక్షాల మధ్య జరిగిన యుద్ధం వల్ల వేలాది మంది ప్రాణాలు కోల్పోగా, లక్షలాది మంది శరణార్థులుగా మారాల్సి వచ్చింది.సుదీర్ఘ కాలం పాటు సాగిన యెమెన్ అంతర్యుద్ధానికి 2022లో ఐక్యరాజ్యసమితి మధ్యవర్తిత్వంతో తాత్కాలిక బ్రేక్ పడింది. ఇరుపక్షాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంతో, గత నాలుగేళ్లుగా ఆయా ప్రాంతాల్లో పరిస్థితులు ప్రశాంతంగా ఉన్నాయి. పెద్దగా ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోలేదు. కానీ, ఇప్పుడు ఇరాన్ విమానం రాకతో మొదలైన వివాదం కారణంగా ఆ కాల్పుల విరమణ ఒప్పందానికి పూర్తిగా తూట్లు పడ్డాయి. ఈ తాజా దాడుల వల్ల పశ్చిమాసియాలో శాంతి భద్రతలకు మళ్లీ పెను ముప్పు పొంచి ఉందని, దీనివల్ల ప్రపంచ ఇంధన సరఫరాపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# పహల్గామ్ ఉగ్రదాడి కేసులో సంచలనం

- సయీద్‌పై ఎన్ఐఏ కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్
- ఉగ్రవాద ముఠా నాయకుడికి బిగుస్తున్న ఉరితాడు
- సయీద్ అరెస్టుకు ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు గ్రీన్ సిగ్నల్
- కస్టడీలో విచారణ జరపడం అత్యంత కీలకం
- పాకిస్థాన్‌లో దాక్కున్న ఉగ్రవాదిపై దర్యాప్తు సంస్థల నివేదిక
- అనుబంధ ఛార్జ్‌షీట్ దాఖలైన రెండు రోజులకే కోర్టు ఆదేశాలు
- వారెంట్‌ను తక్షణమే అమలు చేయాలని డీఐజీకి సూచన

**పహల్గామ్ వెలుతురు జూలై 14:**

పహల్గామ్‌లో జరిగిన భయంకరమైన ఉగ్రదాడి కేసు దర్యాప్తులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కీలక విజయం సాధించింది. పాకిస్థాన్ కేంద్రంగా అంతర్జాతీయ ఉగ్రవాద కార్యకలాపాలు సాగిస్తున్న నిషేధిత సంస్థ లష్కరే తోయిబా అధినేత హాఫీజ్ సయీద్‌పై జమ్మూలోని ప్రత్యేక ఎన్ఐఏ కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ (ఎన్‌బీడబ్ల్యూ) జారీ చేసింది. ఈ ఉగ్రవాద ముఠా నాయకుడిని ఎలాగైనా చట్టం ముందు నిలబెట్టాలనే భారత అధికారుల ప్రయత్నాలకు కోర్టు నిర్ణయం ఊతమిచ్చింది. జాతీయ భద్రతకు ముప్పుగా మారిన సయీద్‌ను అరెస్టు చేయడానికి ఈ వారెంట్ చట్టపరంగా ఎంతో కీలకం కానుంది.పహల్గామ్ ఉగ్రదాడి వెనుక ఉన్న అసలు కుట్రదారులను పట్టుకోవడానికి హాఫీజ్ సయీద్‌ను కస్టడీలోకి తీసుకుని విచారించడం అత్యంత అవసరమని ఎన్ఐఏ కోర్టుకు గట్టిగా వివరించింది. ప్రస్తుతం అతడు పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్ పరిధిలో ఉన్న సర్గోధా ప్రాంతంలో తలదాచుకుంటున్నట్లు నిఘా వర్గాలు దర్యాప్తులో కనుగొన్నాయి. అతడు కావాలనే భారత చట్టాల నుంచి, అరెస్టు నుంచి తప్పించుకుని తిరుగుతున్నాడని కోర్టుకు నివేదించారు. ఈ కేసు దర్యాప్తును ఎలాంటి అడ్డంకులు లేకుండా సమగ్రంగా పూర్తి చేయాలంటే సయీద్‌ను ఆధీనంలోకి తీసుకోవడం ఒక్కటే మార్గమని స్పష్టం చేశారు.ఈ కేసులో ఎన్ఐఏ అధికారులు కోర్టుకు అదనపు వివరాలతో కూడిన అనుబంధ ఛార్జ్‌షీట్ సమర్పించిన రెండు రోజుల వ్యవధిలోనే, అంటే జూలై 8న ప్రత్యేక న్యాయస్థానం ఈ సంచలన ఉత్తర్వులను జారీ చేసింది. ఎన్ఐఏ సమర్పించిన సాక్ష్యాలను పరిశీలించిన ప్రత్యేక న్యాయమూర్తి, దర్యాప్తు ప్రయోజనాల కోసం హాఫీజ్ సయీద్‌పై ఓపెన్-డేటెడ్ నాన్ బెయిలబుల్ అరెస్టు వారెంట్ జారీ చేయడం సమంజసమేనని అభిప్రాయపడ్డారు. ఈ వారెంట్‌ను చట్టబద్ధమైన పద్ధతుల్లో వెంటనే అమలు చేసేలా జమ్మూలోని ఎన్ఐఏ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డీఐజీ)కు పంపాలని, తదుపరి చర్యలు వేగవంతం చేయాలని కోర్టు ఆదేశించింది.జమ్మూ కోర్టులో దాఖలైన ఈ అనుబంధ ఛార్జ్‌షీట్‌లో 76 ఏళ్ల వృద్ధుడైన హాఫీజ్ సయీద్‌పై అత్యంత కఠినమైన సెక్షన్ల కింద అభియోగాలు మోపారు. అతడిని కేవలం వ్యక్తిగత నిందితుడిగానే కాకుండా.. లష్కరే తోయిబాతో పాటు దానికి అనుబంధంగా పనిచేస్తున్న 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' (టీఆర్ఎఫ్) ఉగ్రవాద సంస్థల ప్రధాన సూత్రధారిగా,





నాయకుడిగా ఛార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు. అతడిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)-2023తో పాటు, దేశద్రోహ శక్తులపై ప్రయోగించే చట్టవిరుద్ధ కార్యకలాపాల నివారణ చట్టం-1967 (యూఏపీఏ)లోని పలు కఠిన నిబంధనల కింద కేసులు నమోదు చేశారు.పహల్గామ్ ఉగ్రదాడి కేవలం స్థానికంగా జరిగిన ఘోరం కాదని, దీని వెనుక సరిహద్దుల అవతలి నుంచి ఉగ్రవాదానికి ఊతమిస్తున్న పాకిస్థాన్ పక్కా వ్యూహం ఉందని ఎన్ఐఏ కోర్టుకు సమర్పించిన నివేదికలో తేల్చిచెప్పింది. భారత దేశంపై యుద్ధం ప్రకటించడానికి, కాశ్మీర్ లోయలో రక్తం చిందించడానికి పాకిస్థాన్ గడ్డపై నుంచే హాఫీజ్ సయీద్ వ్యూహాత్మకంగా మార్గనిర్దేశం చేశాడని దర్యాప్తు సంస్థలు ఆధారాలతో సహా నిరూపించాయి. సరిహద్దులు దాటించి ఉగ్రవాదులను, ఆయుధాలను భారత్‌లోకి పంపడంలో సయీద్ కీలక పాత్ర పోషించాడని ఛార్జ్‌షీట్‌లో స్పష్టంగా పొందుపరిచారు.గతంలో డిసెంబర్ 15వ తేదీన ఎన్ఐఏ ఈ కేసుకు సంబంధించి 1,597 పేజీలతో కూడిన భారీ ప్రధాన ఛార్జ్‌షీట్‌ను కోర్టుకు సమర్పించింది. దానికి కొనసాగింపుగా తాజాగా సేకరించిన మరిన్ని పక్కా ఆధారాలతో ఈ కొత్త అనుబంధ ఛార్జ్‌షీట్‌ను తయారు చేశారు. ఇందులో పాకిస్థాన్‌కు చెందిన ప్రధాన ఉగ్రవాద హ్యాండ్లర్ సాజిద్ జట్‌తో పాటు, గత 2025 జూలైలో భారత భద్రతా బలగాలు చేపట్టిన 'ఆపరేషన్ మహాదేవ్' ఎన్‌కౌంటర్‌లో హతమైన ముగ్గురు ఉగ్రవాదుల పేర్లను, ప్రస్తుతం అదుపులో ఉన్న మరో ఇద్దరు నిందితుల వివరాలను చేర్చారు. అలాగే లష్కరే తోయిబా, ది రెసిస్టెన్స్ ఫ్రంట్ సంస్థలను కూడా నిందితులుగా చేర్చారు.గత ఏడాది ఏప్రిల్ 22వ తేదీన కాశ్మీర్‌లోని పసిడి లాంటి పర్యాటక ప్రాంతమైన పహల్గామ్‌లో ఉగ్రవాదులు జరిపిన ఘోరమైన దాడిలో 26 మంది అమాయక ప్రజలు, భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దారుణ ఘటన జరిగిన వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ప్రాథమిక ఎఫ్ఐఆర్ నమోదైంది. అయితే ఈ దాడి వెనుక అంతర్జాతీయ కుట్రలు, సరిహద్దు అవతలి శక్తుల ప్రమేయం ఉన్నట్లు ప్రాథమిక విచారణలోనే తేలడంతో, కేంద్ర హోంశాఖ ఈ కేసు తీవ్రతను గుర్తించి తక్షణమే దర్యాప్తు బాధ్యతలను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత ప్రభుత్వం, సైన్యం ఉగ్రవాదులకు కోలుకోలేని విధంగా బుద్ధి చెప్పాయి. ఈ నరమేధానికి ప్రతికారంగా భారత సైన్యం 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్ ఆక్రమిత ప్రాంతాల్లో ఉన్న ఉగ్రవాద శిబిరాలపై మెరుపు దాడులు నిర్వహించింది. సరిహద్దు దాటి వెళ్లి ఉగ్రవాదుల అస్థిత్వానికి కారణమైన పలు లాంచ్ ప్యాడ్లను, శిక్షణా కేంద్రాలను విజయవంతంగా ధ్వంసం చేసింది. ఈ దాడుల ద్వారా భారత్‌పై కన్నువేస్తే ఊరుకునేది లేదని గట్టి సందేశం పంపిన కేంద్రం, ఇప్పుడు చట్టపరంగా కూడా హాఫీజ్ సయీద్ వంటి అగ్ర ఉగ్రవాదుల చుట్టూ ఉరితాడు బిగిస్తోంది.

# ఆర్. కె టెంట్ హౌస్ ప్రారంభించిన మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సొంటిరెడ్డి పున్నారెడ్డి

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 14:**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రోడా మేస్త్రి నగర్ డివిజన్ పరిధి సుభాష్ చంద్రబోస్ నగర్ లో ఖదీర్ ఆర్.కే టెంట్ హౌస్ ను మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు సొంటిరెడ్డి పున్నారెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఆర్కే టెంట్ హౌస్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. వ్యాపారం అభివృద్ధి చెందాలని, ప్రజల విశ్వాసాన్ని పొందాలని ఆకాంక్షించారు. యువత స్వయం ఉపాధి మార్గాల ఎంచుకొని ఎదగాలన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు మధుసూదన్, అన్వర్, మరలింగ పవన్, శ్రీనివాసరెడ్డి, జాకీర్ భాయ్, వెంకట ముదిరాజ్, నాయకులు పాల్గొన్నారు.



# భారత్‌లోకి అమెరికా మాజీ సైనికులు!



- మరోసారి అక్రమ చొరబాట్ల కలకలం
- యూపీ సరిహద్దులో మాజీ నేవీ అధికారి అరెస్ట్
- మయన్మార్ మిలిటెంట్లతో సంబంధాలు
- నేపాల్ సరిహద్దు దాటేందుకు యత్నిస్తుండగా అరెస్ట్
- కాలిఫోర్నియాకు చెందిన జోర్డాన్ బ్రౌన్‌గా గుర్తింపు
- పారిపోతున్న నిందితుడిని బంధించిన పోలీసులు

**ఢిల్లీ వెలుతురు జూలై 14:**

భారతదేశంలోకి అమెరికా మాజీ సైనికులు ఎలాంటి పత్రాలు లేకుండా అక్రమంగా చొరబడుతుండటం ఇప్పుడు దేశ భద్రతా వర్గాలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. భారత్ నుంచి నేపాల్ దేశంలోకి దొంగచాటుగా ప్రవేశించడానికి ప్రయత్నిస్తున్న ఒక అమెరికా మాజీ నేవీ అధికారిని ఉత్తర్ ప్రదేశ్‌లోని మహారాజ్‌గంజ్ జిల్లా సరిహద్దులో 'సహస్త్ర సీమా బల్' (ఎస్ఎస్‌బీ) బలగాలు వ్యూహాత్మకంగా అడ్డుకుని అరెస్ట్ చేశాయి. విదేశీయులకు సంబంధించిన ఎలాంటి గుర్తింపు కార్డులు లేదా ప్రయాణ పత్రాలు (పాస్‌పోర్ట్, వీసా) లేకుండా అతడు అనుమానాస్పదంగా యూపీ సరిహద్దుల్లో తిరుగుతుండటంతో బలగాలు తనిఖీలు చేపట్టాయి.భద్రతా బలగాల తనిఖీల్లో పట్టుబడిన ఆ విదేశీయుడిని అమెరికాలోని కాలిఫోర్నియా ప్రాంతానికి చెందిన జోర్డాన్ బ్రౌన్‌గా అధికారులు గుర్తించారు. సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద ఎస్ఎస్‌బీ జవాన్లు అతడిని ఆపి నిలదీయగా.. బ్రౌన్ అక్కడి నుంచి తప్పించుకుని పారిపోవడానికి తీవ్రంగా ప్రయత్నించినట్లు పోలీసులు వెల్లడించారు. అయితే అలర్ట్ అయిన జవాన్లు అతడిని చుట్టుముట్టి బంధించారు. అనంతరం అతడిని స్థానిక పోలీసులకు అప్పగించగా.. సరైన పత్రాలు లేకుండా దేశంలో తిరుగుతున్నందుకు ఇమిగ్రేషన్ చట్టాల కింద కేసు నమోదు చేసి లోతుగా విచారణ ప్రారంభించారు.పోలీసులు, నిఘా వర్గాల ప్రాథమిక విచారణలో జోర్డాన్ బ్రౌన్ తన నేపథ్యానికి సంబంధించి పలు ఆసక్తికర విషయాలు వెల్లడించాడు. తాను కాలిఫోర్నియా యూనివర్సిటీలో ఉన్నత చదువులు చదువుకున్నానని, ఆ తర్వాత దాదాపు ఆరేళ్ల పాటు అమెరికా సైన్యంలో (నేవీ) పనిచేసినట్లు ఒప్పుకున్నాడు. గత 2025 నవంబర్ నెలలో తాను విమానంలో కాకుండా సముద్ర మార్గం ద్వారా దొంగచాటుగా భారత్‌లోకి ప్రవేశించినట్లు అధికారులు కనుగొన్నారు. దేశంలోకి వచ్చినప్పటి నుంచి అతడు గోవాలో శాశ్వతంగా నివసిస్తున్నాడని, ఈ మధ్య కాలంలో బెంగళూరు, లఖ్‌నవూ, గోరఖ్‌పూర్ వంటి కీలక నగరాలకు కూడా వెళ్లి వచ్చినట్లు నిఘా వర్గాలు గుర్తించాయి.అయితే, విచారణ సాగుతున్న కొద్దీ జోర్డాన్ బ్రౌన్ అధికారుల ప్రశ్నలకు పొంతనలేని, పరస్పర విరుద్ధమైన సమాధానాలు చెబుతూ గందరగోళానికి గురిచేస్తున్నాడు. మూడేళ్ల క్రితం తనకు ఉత్తరాఖండ్‌కు చెందిన ఒక భారతీయ మహిళతో పరిచయం ఏర్పడిందని, 2024 అక్టోబర్‌లో తామిద్దరం పెళ్లి చేసుకున్నామని చెప్పాడు. కానీ, అదే సమయంలో తాను ఇటలీ పర్యటనలో ఉన్నానని చెప్పడం అనుమానాలకు తావిచ్చింది. ఆ తర్వాత తాను టూరిస్ట్ వీసాపై థాయ్‌లాండ్ వెళ్లానని, అక్కడ పాస్‌పోర్టు పోవడంతో సముద్ర మార్గంలో భారత్ వచ్చానని అన్నాడు. ఇప్పుడు గోవాలో పరిచయమైన ఒక నేపాల్ వ్యక్తిని కలవడానికి సరిహద్దు దాటుతున్నానని, తన అసలు పాస్‌పోర్ట్ బెంగళూరులోని ఒక స్నేహితుడి దగ్గర ఉందని చెప్పడంతో అధికారులు అతడి మాటలను నమ్మడం లేదు.జోర్డాన్ బ్రౌన్ అరెస్ట్ వ్యవహారం కేవలం ఒక సాధారణ చొరబాటు కేసు కాకపోవచ్చని నిఘా సంస్థలు భావిస్తున్నాయి. ఎందుకంటే, ఇటీవల పొరుగు దేశమైన మయన్మార్‌లోని మిలిటెంట్లకు అత్యాధునిక యుద్ధతంత్రాలలో ఉగ్రశిక్షణ ఇస్తున్న అమెరికా మాజీ సైనికుడు మాథ్యూ వాన్‌డైక్‌తో పాటు ఐదుగురు ఉక్రెయిన్ పౌరులను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అరెస్ట్ చేసింది. ఈ నేపథ్యంలోనే బ్రౌన్ అరెస్ట్ ప్రాధాన్యత సంతరించుకుంది. అమెరికాకు చెందిన మాజీ సైనికులు టూరిస్ట్ వీసాల పేరుతో భారత్‌కు వచ్చి, ఇక్కడి నుంచి మిజోరాం సరిహద్దు ద్వారా మయన్మార్‌లోకి చొరబడి అక్కడి ఉగ్రవాద, తిరుగుబాటు ముఠాలతో చేతులు కలుపుతున్నట్లు దర్యాప్తులో తేలింది.విదేశీ కిరాయి సైనికులు ఇతరులకు ఆయుధాలు, డ్రోన్లను చేరవేయడానికి భారత భూభాగాన్ని ఒక సురక్షితమైన రవాణా మార్గంగా (ట్రాన్సిట్ రూట్) వాడుకుంటున్నారా? అనే అనుమానాలకు అవుననే సమాధానాలు లభిస్తున్నాయి. కొన్నాళ్ల క్రితం కోల్‌కతాలో పట్టుబడిన మాథ్యూ వాన్‌డైక్ బృందం ఐరోపా దేశాల నుంచి అత్యాధునిక డ్రోన్లను తీసుకొచ్చి, ఈశాన్య భారత సరిహద్దుల గుండా మయన్మార్‌లోని తిరుగుబాటు ముఠాలకు స్మగ్లింగ్ చేసినట్లు పక్కా సమాచారం అందింది. ఇలా డ్రోన్లను దొంగరవాణా చేయడం, వాటిని అసెంబ్లింగ్ చేయడం, ఎలక్ట్రానిక్ యుద్ధరీతుల్లో మయన్మార్ ముఠాలకు శిక్షణ ఇవ్వడమే ఈ అంతర్జాతీయ ముఠాల పని అని రష్యా కూడా గతంలో తీవ్ర ఆరోపణలు చేసింది.భారతదేశ భద్రతా నిబంధనల ప్రకారం విదేశీయులు ఎవరైనా సరే మిజోరాం వంటి సున్నితమైన ఈశాన్య సరిహద్దు రాష్ట్రాల్లో ప్రయాణించాలంటే ఖచ్చితంగా కేంద్ర ప్రభుత్వం జారీ చేసే 'రక్షిత ప్రాంత పర్మిట్' (ప్రొటెక్టెడ్ ఏరియా పర్మిట్ – PAP) కలిగి ఉండాలి. కానీ, ఇప్పుడు అరెస్టయిన అమెరికా మాజీ సైనికులు మరియు విదేశీయులు ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండానే నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించారు. స్థానిక శక్తుల సహాయంతో రహస్యంగా ఈశాన్య భారతం నుంచి మయన్మార్‌లోకి ప్రవేశిస్తూ సరిహద్దు భద్రతకు పెద్ద సవాలుగా మారారు.ఇంతకీ ఈ వ్యవహారంలో కీలక సూత్రధారిగా ఉన్న మాథ్యూ వాన్‌డైక్ సాదాసీదా వ్యక్తి కాదు. 'సన్స్ ఆఫ్ లిబర్టీ ఇంటర్నేషనల్' అనే అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ ముసుగులో అతడు ఒక కిరాయి సైన్యాల ముఠాను నడుపుతున్నాడు. గతంలో లిబియా అంతర్యుద్ధం జరిగిన సమయంలో అక్కడి పాలకుడు గడాఫీకి వ్యతిరేకంగా స్వయంగా తుపాకీ పట్టి పోరాడటం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా వార్తల్లోకెక్కాడు. ఆ తర్వాత సిరియా అంతర్యుద్ధంలోనూ పాల్గొని అక్కడి తిరుగుబాటుదారులకు శిక్షణ ఇచ్చాడు. మోటార్ సైకిల్‌పై ఉత్తర ఆఫ్రికా, పశ్చిమాసియా దేశాల్లో విస్తృతంగా పర్యటించిన చరిత్ర ఇతనికి ఉంది. 2022 మార్చి నుంచి ఇతని సంస్థ ఉక్రెయిన్ దేశంలో రష్యా సైన్యానికి వ్యతిరేకంగా కూడా పని చేస్తోంది. ఇప్పుడు అరెస్టయిన జోర్డాన్ బ్రౌన్‌కు కూడా ఇటువంటి ముఠాలతో ఏమైనా సంబంధాలు ఉన్నాయా అనే కోణంలో కేంద్ర దర్యాప్తు సంస్థలు ఆరా తీస్తున్నాయి.

# కట్నం వేధింపులే హత్యకు కారణమా?.. నడిరోడ్డుపై భార్యను కాల్చిచంపిన భర్త

- దేశ రాజధాని ఢిల్లీలోని కళ్యాణ్‌పురి ప్రాంతంలో దారుణ ఘటన
- యాంటీ ఆటో థెఫ్ట్ స్క్వాడ్‌లో పనిచేస్తున్న పోలీసు మనీష్ భాటి చేతిలో భార్య ప్రియాంక దారుణ హత్య
- అర్ధరాత్రి ఇంటి నుంచి బయల్దేరిన దంపతుల మధ్య ఎల్‌బీఎస్ ఆసుపత్రి సమీపంలో తీవ్ర వాగ్వాదం
- బైక్ దిగి వెళ్తున్న భార్యపై సర్వీస్ రివాల్వర్‌తో కాల్పులు జరిపి పరారైన భర్త
- నిందితుడి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు.. ఘటనపై పలు కోణాల్లో దర్యాప్తు
- గతంలోనూ కట్నం కోసం వేధింపుల ఆరోపణలు.. 2024లో ఎనిమిది నెలలు సోదరుడి ఇంట్లోనే ఉన్న ప్రియాంక

**ఢిల్లీ వెలుతురు జూలై 14:**





దేశ రాజధాని ఢిల్లీలో దారుణ ఘటన చోటుచేసుకుంది. కళ్యాణ్‌పురి ప్రాంతంలో ఢిల్లీ పోలీసుల యాంటీ ఆటో థెఫ్ట్ స్క్వాడ్‌లో పనిచేస్తున్న మనీష్ భాటి తన భార్య ప్రియాంకను నడిరోడ్డుపై సర్వీస్ రివాల్వర్‌తో కాల్చిచంపాడు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు.మూడేళ్ల క్రితం మనీష్ భాటి, ప్రియాంక వివాహం చేసుకున్నారు. మనీష్ పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తుండగా, ప్రియాంక గృహిణిగా ఉన్నారు. అర్ధరాత్రి సుమారు 2 గంటల సమయంలో ఇద్దరూ ఇంటి నుంచి బైక్‌పై బయల్దేరారు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఎల్‌బీఎస్ ఆసుపత్రి సమీపానికి చేరుకున్న తర్వాత భార్యాభర్తల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఆ సమయంలో ప్రియాంక బైక్ దిగి నడుచుకుంటూ వెళ్తుండగా, మనీష్ తన వద్ద ఉన్న సర్వీస్ రివాల్వర్‌తో కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ప్రియాంక అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం మనీష్ పరారయ్యాడు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. నిందితుడి కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు.ఇంట్లో నుంచే భార్యాభర్తల మధ్య గొడవ జరిగిందని స్థానికులు పోలీసులకు తెలిపారు.

మరోవైపు, గతంలో కూడా కట్నం కోసం మనీష్ తన భార్యను వేధించాడని ప్రియాంక కుటుంబ సభ్యులు ఆరోపించారు. 2024లో కుటుంబ కలహాల కారణంగా ప్రియాంక సుమారు ఎనిమిది నెలల పాటు తన సోదరుడి ఇంట్లో నివసించినట్లు వెల్లడించారు. కట్న వేధింపుల కోణంతో పాటు ఇతర కారణాలపైనా పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం - మంత్రి వాకిటి శ్రీహరి

- మళ్లీ కాంగ్రెస్ పార్టీదే అధికారం-మంత్రి వాకిటి శ్రీహరి
- బీఆర్ఎస్ నేతల అబద్ధాల మాటలను నమ్మి మోసపోవొద్దు-వాకిటి శ్రీహరి

**ఆలంపూర్ వెలుతురు జూలై 14:**



ఆలంపూర్ నియోజకవర్గంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పర్యటన సందర్భంగా జులేకల్ గ్రామంలో నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు & క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, ఎంపీ డా. మల్లు రవి, ఎమ్మెల్యేలు చిక్కుడు వంశీకృష్ణ, వీర్లపల్లి శంకర్, అనిరుధ్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, కార్పొరేషన్ చైర్మన్లు సరిత తిరుపతి యాదవ్, శివసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన, తాడిత, పీడిత వర్గాల సంక్షేమానికే కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో రాష్ట్రాన్ని భారీ అప్పుల ఊబిలోకి నెట్టిందని, ఆ ఆర్థిక విధ్వంసాన్ని గాడిలో పెట్టేందుకు తమ ప్రభుత్వానికి రెండున్నర సంవత్సరాలు పట్టిందన్నారు.ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం తన మాట నిలబెట్టుకుందని మంత్రి పేర్కొన్నారు. రైతు సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ రైతు భరోసా, రైతు రుణమాఫీ వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. అలాగే ప్రతి పేద కుటుంబానికి నాణ్యమైన సన్నబియ్యం అందించాలనే లక్ష్యంతో రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కును ప్రజలు బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పాలనలో రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) వంటి కీలక ప్రాజెక్టులను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు.జూరాల, శ్రీశైలం వంటి శాశ్వత సాగునీటి ప్రాజెక్టులు కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో నిర్మించబడినవేనని, కాంగ్రెస్ నిర్మించిన ప్రాజెక్టులు దశాబ్దాల పాటు ప్రజలకు సేవలందిస్తాయని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు శంకుస్థాపనలు, ప్రకటనలకే పరిమితమై ప్రజలను మోసం చేశారని విమర్శించారు.తమ ప్రభుత్వానికి ఎన్నికలు లక్ష్యం కాదని, ప్రజల సంక్షేమం, రైతులకు నిరంతరాయ విద్యు, అభివృద్ధి కార్యక్రమాల అమలే ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.వరుస ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ పార్టీని తిరస్కరించారని, వారి అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. తెలంగాణలో మరోసారి కాంగ్రెస్ పార్టీనే అధికారంలోకి వస్తుందని విశ్వాసం వ్యక్తం చేసిన మంత్రి వాకిటి శ్రీహరి, అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

# ఉప్పర్‌పల్లిలో రికార్డు స్థాయిలో కొనసాగుతున్న 'ఓటరు నమోదు ప్రత్యేక సమీక్ష' (SIR)!





- బొక్క బాల్ రెడ్డి గారి ఆధ్వర్యంలో 14 రోజులుగా అప్రతిహతంగా సాగుతున్న బీజేపీ సైనికుల శ్రమాయజ్ఞం!
- ఉదయం 9 నుండి రాత్రి 9 వరకు ఓటర్ల కోసం అందుబాటులో కార్యకర్తలు!
- హైదరాబాద్ వెలుతురు జూలై 14:

"నా దగ్గర ఓటర్ కార్డ్ ఉంది కదా... నా ఓటు ఎక్కడికీ పోదు!" అనే భ్రమలో అస్సలు ఉండకండి. సరైన ఓటరు జాబితా రూపకల్పన కోసం కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక్ష సమీక్ష (SPECIAL INTENSIVE REVISION - SIR) ప్రక్రియ హైదర్‌గూడ డివిజన్ పరిధిలోని ఉప్పర్‌పల్లి వ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా, బ్రహ్మాండంగా కొనసాగుతోంది. భారతీయ జనతా పార్టీ సేవా సైనికులు, కార్యకర్తల అలుపెరుగని కృషితో ఈ మహత్కార్యం విజయవంతంగా మంగళవారం రోజుకి 14 రోజులు పూర్తి చేసుకుంది.బిజెపి సీనియర్ నాయకులు శ్రీ బొక్క బాల్ రెడ్డి గారి సమర్థవంతమైన నాయకత్వంలో మరియు ఆయన ఆధ్వర్యంలో బీజేపీ కార్యకర్తలందరూ ముందుండి ఈ ప్రక్రియని ఒక యజ్ఞంలా ముందుకు తీసుకెళ్తున్నారు.

**రాత్రింబవళ్లు ప్రజా సేవలో బీజేపీ సైనికులు:**

ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో హైదర్‌గూడ డివిజన్ ఉప్పర్‌పల్లి పరిధిలోని ఉప్పర్‌పల్లి బీజేపీ ఆఫీస్ నందు, అలాగే వివిధ పోలింగ్ బూత్‌లలో ప్రతిరోజు ఉదయం 9:00 గంటల నుండి రాత్రి 9:00 గంటల వరకు నిరంతరాయంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమయం కేటాయించి సేవలు అందిస్తున్నారు.

**ఓటర్లకు బీజేపీ ముఖ్య విజ్ఞప్తి – ఈ తప్పులు అస్సలు చేయకండి:**

BLOలు (Booth Level Officers) మీ ఇంటికే వచ్చి ఫామ్ ఇస్తారని వేచి చూడకండి! వాళ్లే వచ్చి ఫామ్ తీసుకెళ్తారని నిర్లక్ష్యం వహించకండి!"ఈ నెల 24వ తేదీ వరకు సమయం ఉంది కదా" అని అలసత్వం ప్రదర్శించి, చివరి నిమిషం దాకా ఆగవద్దు!

మన ఓటు – మన భవిష్యత్తు!

మన ఓటు దేశ రక్షణ కోసం, ధర్మ పరిరక్షణ కోసం ఎంతో ముఖ్యం. కాబట్టి ఓటర్లందరూ బాధ్యతగా మీరే స్వయంగా BLOలకు ఫోన్ చేసి ఎన్యూమరేషన్ ఫారాన్ని (Enumeration Form) తీసుకోండి, లేదా వెంటనే ఉప్పర్‌పల్లి బీజేపీ కార్యాలయాన్ని సంప్రదించి ఫామ్‌ను పూర్తి చేసి అందజేయాల్సిందిగా కోరుతున్నాము. దేశం కోసం... వన్ నేషన్ – వన్ ఓట్ కోసం... మన ఓటును కాపాడుకుందాం, మన భవిష్యత్తును మనమే నిర్ణయించుకుందాం!భారత్ మాతాకీ జై! జై శ్రీరామ్! భారతీయ జనతా పార్టీ సేవా సైనికులు & కార్యకర్తలు ఉప్పర్‌పల్లి, హైదర్‌గూడ డివిజన్, హైదరాబాద్.

# సోషల్ మీడియాలో ఇందిరమ్మ ఇండ్ల హోం టూర్ వీడియోల హల్ చల్

- ప్రతి పేదవాడి సొంతింటి కలను సాకారం చేస్తాం- X లో మంత్రి ఇందిరమ్మ ఇండ్ల శీనన్న
- సొంతింటి కల సాకారం.. సోషల్ మీడియాలో ఆనందోత్సాహం!

**హైదరాబాద్ వెలుతురు జూలై 14:**

ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయిన రోజు నుంచి గృహ ప్రవేశం వరకు తమ ఆనందాన్ని, అనుభవాలను అనేక మంది లబ్దిదారులు యూట్యూబ్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా పంచుకోవడం ఎంతో సంతోషంగా ఉంది.తొలిదశలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు, రెండో దశలో 2.5 లక్షల ఇండ్లు.. మూడో దశ, నాలుగో దశ, ఐదో దశ.. ఇలా ప్రతి పేదవాడి సొంతింటి కలను ఇందిరమ్మ ఇండ్ల రూపంలో సాకారం చేయాలనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోంది.పేదల చిరునవ్వులే మా ప్రభుత్వానికి గొప్ప పురస్కారాలు.

# కాళేశ్వరం వైఫల్యం బీఆర్ఎస్ పాపమే

**హైదరాబాద్ వెలుతురు జూలై 14:**

తెలంగాణలో నీటి పారుదల ప్రాజెక్టులు, కరవు పరిస్థితులపై అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ వేడి ముదిరింది. మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.. విపక్ష బీఆర్ఎస్ పార్టీ తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కరవు పరిస్థితులు, రైతుల ఇబ్బందులను ఆసరాగా చేసుకుని బీఆర్ఎస్ నాయకులు చౌకబారు రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. రక్తం ప్యాకెట్లతో డ్రామాలు ఆడుతూ ప్రజలను తప్పుదోవ పట్టించాల్సిన అవసరం తమకు లేదని, కేవలం ఉనికిని కాపాడుకోవడానికే విపక్షాలు ఇలాంటి చీప్ పాలిటిక్స్ చేస్తున్నాయని తీవ్రంగా ఆక్షేపించారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడక ముందే కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిందన్న పచ్చి నిజాన్ని ప్రతిపక్షాలు కావాలనే దాస్తున్నాయని పొన్నం ప్రభాకర్ విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఈ పరిస్థితికి రావడానికి, పిల్లర్లు కుంగిపోవడానికి పూర్తిగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి, అలసత్వమే కారణమని ఆరోపించారు. నాసిరకం నిర్మాణాలు, ఇంజినీరింగ్ లోపాల వల్లనే ఆ ప్రాజెక్టు దెబ్బతిన్నదని, ఆ పాపాన్ని ఇప్పుడు తమ ప్రభుత్వంపై నెట్టేందుకు గులాబీ నేతలు ప్రయత్నించడం హాస్యాస్పదంగా ఉందన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలను, బీఆర్ఎస్ నాయకులు చేసిన మోసాలను తాము ఊరూరా తిరిగి ప్రజలకు వివరిస్తామని మంత్రి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల సొమ్మును ఎలా వృథా చేశారో, ప్రాజెక్టు పేరిట ఏ విధంగా దోపిడీకి పాల్పడ్డారో వాస్తవాలతో సహా ప్రతి గ్రామంలోనూ ఎండగడతామన్నారు. ప్రజలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తున్న ప్రతిపక్షాల కుట్రలు ఇకపై సాగవని హెచ్చరించారు.జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ తుది నివేదిక వచ్చిన తర్వాతే కాళేశ్వరం ప్రాజెక్టులో నీటిని నింపే విషయమై ప్రభుత్వం ఒక నిర్ణయానికి వస్తుందని మంత్రి వివరించారు. ఎన్‌డీఎస్‌ఏ నిపుణులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి, ప్రాజెక్టు సురక్షితంగా ఉందని చెబితే వెంటనే నీటిని నింపుతామన్నారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా, శాస్త్ర సాంకేతిక నిపుణులు, అనుభవజ్ఞులైన ఇంజినీర్లు ఇచ్చే సలహాలను పాటిస్తూ బాధ్యతాయుతంగా ముందుకు సాగుతామన్నారు. ప్రాజెక్టు మళ్లీ పూర్తి స్థాయిలో ఉపయోగంలోకి రావడానికి ఏం చేయాలో నిపుణులు సూచిస్తే వాటిని తూచా తప్పకుండా అమలు చేస్తామని ప్రకటించారు.ప్రస్తుత కరవు పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రజలలో ఆందోళన కలిగించేలా బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారని పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడిగడ్డ, కన్నెపల్లి పంప్‌హౌస్ విషయాల్లో కావాలనే రాజకీయం చేస్తూ రచ్చ సృష్టిస్తున్నారని విమర్శించారు. కరవు అనేది ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన సమస్య అని, దానిని అందరం కలిసి ఎదుర్కోవాలే తప్ప.. శవాల మీద పేలాలు ఏరుకున్న చందంగా రాజకీయం చేయడం తగదని హితవు పలికారు.ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు, పర్యావరణ నిపుణులు ఇప్పటికే హెచ్చరించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. తీవ్రమైన ఎల్‌నినో ప్రభావం వల్ల దేశవ్యాప్తంగా కరవు పరిస్థితులు నెలకొంటున్నాయని చెప్పారు. ఈ భయంకరమైన ప్రకృతి సవాలును ఎదుర్కోవడానికి ప్రభుత్వం వైపు నుంచి అన్ని రకాల ముందస్తు చర్యలు, నివారణ సూచనలు చేస్తున్నామని వెల్లడించారు.

# మహాకవి వేముగంటి నరసింహాచారి జయంతి ఘనంగా నిర్వహణ

- **తెలంగాణ సాహిత్య అకాడమీ – తెలుగు భాషా చైతన్య సమితి సంయుక్త ఆధ్వర్యంలో సాహితీ సభ**

**హైదరాబాద్ వెలుతురు జూలై 14:**

ప్రముఖ కవి వేముగంటి నరసింహాచారి జయంతి సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి సాహితీ కుటీరంలో తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో, తెలుగు భాషా చైతన్య సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా సాహితీ సభ నిర్వహించారు.ఈ కార్యక్ర మానికి తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ ఎన్. బాలాచారి సభాధ్యక్షత వహించగా, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పూర్వాధ్యక్షులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా, సుబ్బరాజు రవిప్రకాశ్ విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వహణను తెలుగు భాషా చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పి. బడే సాబ్ చేపట్టారు.సభా ధ్యక్షుడు డాక్టర్ ఎన్. బాలాచారి మాట్లాడుతూ, మహాకవుల జయంతులను నిర్వహించడం ద్వారా వారి సాహిత్య వారసత్వం, ఆనాటి సామాజిక విలువలు నేటి తరానికి చేరువ అవుతాయని అన్నారు. యువత నిరంతరం సాహిత్యాన్ని అధ్యయనం చేయడంతో పాటు మహనీయులు అందించిన సూక్తులు, విలువలను ఆచరణలో పెట్టాలని సూచించారు. సాహిత్యాభివృద్ధి, తెలుగు భాషా వికాసం కోసం తెలంగాణ సాహిత్య అకాడమీ ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తుందని తెలిపారు.ముఖ్య అతిథి ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ, వేముగంటి నరసింహాచారి సంప్రదాయ కుటుంబంలో జన్మించి ప్రకృతి, నదులపై అపారమైన అభిమానం కలిగిన కవిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. కాకతీయుల కాలం, ముఖ్యంగా గణపతిదేవుని ఆస్థాన కవి తిక్కన సాహిత్య వైభవాన్ని ప్రతిబింబించేలా ఆయన రచించిన "తిక్కన" పద్యకావ్యం తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిందని చెప్పారు. ఆయన రచించిన "మంజీర నాదాలు" ప్రస్తుతం ఎనిమిదో తరగతి తెలుగు పాఠ్యాంశంగా ఉండటం ఆయన సాహిత్య గొప్పతనానికి నిదర్శన మన్నారు.అలాగే, వేముగంటి నరసింహాచారి అనేక గ్రంథాలయాల స్థాపనకు కృషి చేయడంతో పాటు తెలుగు భాషాభివృద్ధికి విశేష సేవలు అందించారని, ఆయన ప్రేరణతో ఎంతోమంది తెలుగు ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దబడ్డారని కొనియాడారు. ఇలాంటి మహనీయుల జయంతులను తరచూ నిర్వహిస్తూ వారి సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు.ఈ సందర్భంగా పలువురు సాహితీవేత్తలు, కవులు,



రచయితలు, తెలుగు భాషాభిమానులు పాల్గొని వేముగంటి నరసింహాచారి సాహిత్య సేవలను స్మరించుకుంటూ నివాళులర్పించారు. కార్యక్రమం లో, వేముగంటి నర్సిమాచార్యులు కుమారుడు వేమంటి మురలీకృష్ణ కుసుమ ధర్మన్న కళాభితం చైర్పర్సన్ రాధా కుసుమ, కాంచనపల్లి వద్దిరాజు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు సాహిత్యాభిమానులను విశేషంగా ఆకట్టుకుంది.

## ఆగస్టు 2 నుండి 18 వరకు అమరుల యాదిలో గీతన్నల చైతన్య యాత్ర

**హైదరాబాద్ వెలుతురు జూలై 14:**




కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో గీత కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 2 నుండి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో బస్సు యాత్ర నిర్వహిస్తున్నామని రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల రమణ అన్నారు. ఈరోజు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని దొడ్డి కొమరయ్య హాల్లో రమణ అధ్యక్షతన జరిగిన సన్నాహక సమావేశం లో గౌడ కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర చైర్మన్ బాలగోని బాలరాజు గౌడ్, టాడి కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్, గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు అంబాల నారాయణ గౌడ్, KR టీవీ ఛానల్ అధినేత క్రాంతి తదితర సంఘ నాయకులు యాత్రకు సంఘీభావం తెలిపారు. పెన్షన్ 4 వేలకు ఎక్స్‌గ్రేషియా 10 లక్షల పెంచుతామని చెప్పి ఇప్పుడు దాని గురించి పట్టింపే లేదని అన్నారు. వృత్తిలో ప్రమాదం జరిగిన వారికి ఇవ్వాల్సిన ఎక్స్‌గ్రేషియా 20 కోట్ల రూపాయలు అధికారంలోకి వచ్చి 30 నెలలు దాటినప్పటికీ ఇవ్వలేదని వీటిని వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. నీరా మరియు తాటి ఈత ఉత్పత్తుల పరిశ్రమలు నెలకొల్పాలని, వృత్తి చేసే వారందరికీ వెంటనే కాటమయ్య రక్షణ కవచం ఇవ్వాలని రమణ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బస్సు యాత్ర ఆగస్టు రెండున మహబూబాబాద్ లో ప్రారంభమై అన్ని జిల్లాలలో ప్రచారం నిర్వహించి 18వ తేదీన హైదరాబాద్లోని ట్యాంక్బండ్ వద్ద ముగిస్తామన్నారు. యాత్రకు గీత కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇంకా ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బోలగాని జయరాములు, వి వెంకట నరసయ్య, గౌని వెంకన్న, బాల్నే వెంకట మల్లయ్య, గౌని సాంబయ్య, రాష్ట్ర కార్యదర్శులు చౌగాని సీతారాములు, మడ్డి అంజిబాబు, ఎస్ రమేష్ గౌడ్, ఎస్ వెంకట్ గౌడ్, బూడిద గోపి, యమగాని వెంకన్న, కొండం కరుణాకర్ వివిధ జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడారు.

## యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్–2027 ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**హైదరాబాద్, వెలుతురు జూలై 14:**

తెలంగాణ ప్రభుత్వ బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ (TGBCESDTC) యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ (ప్రిలిమ్స్–కమ్–మెయిన్స్)–2027 ఉచిత శిక్షణ కార్యక్రమానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.ఈ కోచింగ్ కార్యక్రమం 2026 ఆగస్టు 24 నుంచి 2027 వరకు హైదరాబాద్‌లో నిర్వహించబడుతుంది. మొత్తం 150 మంది అభ్యర్థులకు శిక్షణ అందించనుండగా, అందులో 100 మంది ఓపెన్ కేటగిరీ ద్వారా, 50 మంది తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ ప్రిలిమ్స్ అర్హత పొందిన అభ్యర్థుల నుంచి ఎంపిక చేస్తారు.ఎంపికైన అభ్యర్థులకు కల్పించే సౌకర్యాలు నెలకు రూ.5,000 స్టైపెండ్ (ప్రభుత్వ నిబంధనల మేరకు) ఒకేసారి రూ.5,000 పుస్తక భృతి గ్రంథాలయ సౌకర్యం నిపుణుల ద్వారా ప్రత్యేక శిక్షణ స్టడీ మెటీరియల్, మాక్ టెస్టులు, మార్గదర్శకత్వం అర్హతలు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ ఉత్తీర్ణత.

కుటుంబ వార్షిక ఆదాయం:

గ్రామీణ ప్రాంతం: రూ.1.50 లక్షలలోపు

పట్టణ ప్రాంతం: రూ.2.00 లక్షలలోపు

తెలంగాణ నివాసి కావాలి.

భారతీయ పౌరుడై ఉండాలి.

యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్–2027 నిబంధనల ప్రకారం వయోపరిమితి ఉండాలి.

ముఖ్యమైన తేదీలు

దరఖాస్తుల ప్రారంభం: 15-07-2026

ఆన్‌లైన్ దరఖాస్తులు: 17-07-2026 నుంచి 07-08-2026 వరకు

హాల్ టికెట్ల డౌన్‌లోడ్: 13-08-2026 నుంచి

స్క్రీనింగ్ టెస్ట్: 16-08-2026

ఫలితాలు: 19-08-2026

ధ్రువపత్రాల పరిశీలన: 21-08-2026 నుంచి

తరగతుల ప్రారంభం: 24-08-2026

ఆసక్తి గల అభ్యర్థులు తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ డా. మామిడి హరికృష్ణ తెలిపారు.

## ఐఅండ్‌పీఆర్ నూతన క్రియేటివ్ డైరెక్టర్ గా రాజ్ కొండా

- **రాజ్ కొండా గారికి శుభాకాంక్షలు తెలిపిన ఖాజా అఫ్రిది**

**హైదరాబాద్ వెలుతురు జూలై 14:**

తెలంగాణ సమాచార, పౌర సంబంధాల శాఖ నూతన క్రియేటివ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాజ్ కొండాను సీనియర్ జర్నలిస్ట్, సామాజిక కార్యకర్త ఖాజా అఫ్రిది మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.మసాబ్ ట్యాంక్‌లోని ఐఅండ్‌పీఆర్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రభుత్వ ఆశయాలను ప్రజలకు మరింత ప్రభావవంతంగా చేరవేసే దిశగా రాజ్ కొండా సమర్థవంతంగా పనిచేయాలని ఖాజా అఫ్రిది ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాభినందనలు తెలియజేస్తూ విజయవంతమైన పదవీకాలాన్ని ఆకాంక్షించారు.



## తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలి: టీజేఏసీ సమావేశంలో డిమాండ్

- **హైదరాబాద్‌లో తెలంగాణ అమరుల జ్యోతి వద్ద కె.కె కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమకారుల సమావేశం**
- **రెండో దశ ఉద్యమంలో పాల్గొన్న అసలైన ఉద్యమకారులను గుర్తించాలని విజ్ఞప్తి**
- **2014 జూన్ 2 వరకు ఉద్యమంలో పనిచేసిన వారికే గుర్తింపు ఇవ్వాలని స్పష్టం**
- **ఉద్యమకారుల త్యాగాలకు గుర్తింపే నిజమైన నివాళి అని నేతల వ్యాఖ్యలు**

**హైదరాబాద్ వెలుతురు జూలై 14:**

హైదరాబాద్‌లోని తెలంగాణ అమరుల జ్యోతి వద్ద ఈరోజు హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజేఏసీ) ఉద్యమకారుల సమావేశం కె.కె కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న అసలైన ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.ఈ సమావేశానికి కె.కె కమిటీ చైర్మన్ కె. కేశవరావు, కమిటీ సభ్యులు ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి హాజరయ్యారు. అలాగే తెలంగాణ గ్రేటర్ హైదరాబాద్ టీజేఏసీ చైర్మన్ డా. ఎ. శ్రీధర్, గ్రేటర్ హైదరాబాద్ కన్వీనర్ ఎం.బి. కృష్ణ యాదవ్, కోఆర్డినేటర్ రామగిరి ప్రకాష్‌తో పాటు ఉప్పు సుధాకర్, టీఎన్జీవో నాయకురాలు వై. గీతారాణి, శ్రీనివాస చారి, రాజ్ మహేందర్ రెడ్డి, గంధం రాములు, రోషం బాలు, వి. మాధవ్, గుడిసె రూబీ స్టీవెన్‌సన్, బండి రమేష్, కొత్త విద్యాసాగర్, ఎం. నర్సయ్య, పి. వెంకన్న, విద్య వెంకట్, మారుతి సాగర్, శ్రీనివాస్ పటేల్, జైప్రకాశ్, వినయ్, లాలయ్య, దయాసాగర్, వాసుదేవరావు, అశోక్ రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.సమావేశంలో పలువురు నేతలు మాట్లాడుతూ తెలంగాణ రెండో దశ ఉద్యమంలో పాల్గొన్న వారిని గుర్తించడం కేవలం పరిపాలనా ప్రక్రియ కాదని, ఉద్యమకారుల త్యాగాలకు ప్రభుత్వం ఇచ్చే గౌరవమని పేర్కొన్నారు. 2014 జూన్ 2వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమంలో పనిచేసిన వారినే అసలైన ఉద్యమకారులుగా గుర్తించాలని సూచించారు.తెలంగాణ ప్రభుత్వం ఉద్యమ సమయంలో ఇచ్చిన హామీలైన 250 గజాల ఇంటి స్థలం, నెలకు రూ.25 వేల పెన్షన్, వైద్య ఆరోగ్య కార్డులు, ఉద్యమకారుల గుర్తింపు కార్డులు అర్హులైన నిజమైన ఉద్యమకారులకు అందేలా చర్యలు తీసుకోవాలని సమావేశం ద్వారా ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యమకారుల గౌరవాన్ని కాపాడేలా పారదర్శకంగా గుర్తింపు ప్రక్రియ చేపట్టాలని కూడా విజ్ఞప్తి చేశారు.



## చిచ్చరపిడుగు వైభవ్ సూర్యవంశీకి బీసీసీఐ బంపర్ ఆఫర్

**విదేశీ పర్యటనల్లో తల్లిదండ్రులకూ ఉచిత ప్రయాణం!**

భారత క్రికెట్‌లో సరికొత్త సంచలనం, కేవలం 15 ఏళ్ల ప్రాయంలోనే జాతీయ జట్టుకు ఎంపికైన వైభవ్ సూర్యవంశీ విషయంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి ఒక చారిత్రక, మానవీయ నిర్ణయం తీసుకుంది. ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలకు ఎంపికైన వైభవ్‌తో పాటు అతని తల్లిదండ్రులు కూడా ప్రయాణించేందుకు బీసీసీఐ ప్రత్యేక అనుమతి మంజూరు చేసింది. అంతేకాకుండా, వారి ప్రయాణ, వసతి ఖర్చులన్నింటినీ బోర్డే స్వయంగా భరించనుంది.




ఈ విషయాన్ని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ధృవీకరించారు. వైభవ్ ఇంకా మైనర్ కావడం, అంతా పెద్దలు ఉండే జాతీయ జట్టు డ్రెస్సింగ్ రూమ్ వాతావరణానికి, విదేశీ పరిస్థితులకు అలవాటు పడటానికి సమయం పడుతుందని బోర్డు భావించింది. సాధారణంగా అంతర్జాతీయ పర్యటనల్లో ఆటగాళ్లతో పాటు కుటుంబ సభ్యులను తీసుకెళ్లడానికి బీసీసీఐ నిబంధనలు ఒప్పుకోవు, కానీ వైభవ్ వయసును పరిగణనలోకి తీసుకుని ఈ ప్రత్యేక మినహాయింపు ఇచ్చారు. స్కూల్ ట్రిప్స్‌కు వెళ్లే పిల్లల వెంట పెద్దలు ఉన్నట్లే, వైభవ్ వెంట అతని తల్లిదండ్రులు ఉంటే మానసికంగా కుదుటపడి ఆటపై మరింత శ్రద్ధ పెట్టగలడని ఈ అడుగు వేశారు. రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడిన ఈ ఎడమచేతి వాటం ఓపెనర్, ఐపీఎల్ 2026 సీజన్‌లో అసాధారణ ప్రదర్శనతో ఏకంగా 776 పరుగులు సాధించి అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. దీంతో పాటు 'ఎమర్జింగ్ ప్లేయర్', 'మోస్ట్ వాల్యూబుల్ ప్లేయర్' అవార్డులను కూడా కైవసం చేసుకున్నాడు. ఈ అద్భుత ఆటతీరును చూసి చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్.. వైభవ్ తన ప్రతిభతో జట్టులో స్థానాన్ని తానే సొంతం చేసుకున్నాడని ప్రశంసించారు.

# బ్రిటన్ వాణిజ్య ఒప్పందంతో ప్రతీ భారతీయుడికి మెరుగైన అవకాశాలు

**-శ్రీ పీయూష్ గోయల్**

ఇవాళ్టి నుంచి విప్లవాత్మకమైన సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (సెటా) అమల్లోకి రావటంతో బ్రిటన్‌కు ఎగుమతి అయ్యే భారతీయ ఉత్పత్తులకు సుంకాల నుంచి మినహాయింపు లభిస్తుంది. దీంతో చిన్న వ్యాపారులు, రైతులు, మత్స్యకారులు, ఆవిష్కకర్తలు, మహిళలు, శ్రామికులపై ఆధారపడే పరిశ్రమలకు భారీగా అవకాశాలు అందివస్తాయి. ఇది భారతదేశ సమగ్ర స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ). దీనిద్వారా ఎన్నో ఉపాధి అవకాశాలు, వ్యాపార మార్గాలు సులభతరం అవటం ద్వారా దేశంలో సంపద, సంక్షేమం వృద్ధి చెందుతాయి. భారతదేశంలోని తయారీదారులను ఆరోగ్యకర పోటీ దిశగా ఇది నడిపిస్తుంది. దీనివల్ల ప్రతి పౌరుడికీ నాణ్యమైన వస్తువులు చౌకగా లభిస్తాయి. ఈ ఒప్పందం ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ వికసిత్ భారత్–2047 లక్ష్యానికి మరింత ఊతమిస్తుంది.బ్రిటన్‌కు ఉత్పత్తులను ఎగుమతి చేసేందుకు వ్యాపారులు ఉత్సాహంతో ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నారు. రాబోయే మూడేళ్లలో ఎగుమతులు 230 శాతం వృద్ధితో 2.5 బిలియన్ డాలర్లకు చేరుకుంటాయని రత్నాలు, ఆభరణాల ఎగుమతిదారులు భావిస్తున్నారు. రాబోయే నాలుగయిదేళ్లలో బ్రిటన్‌కు ఇంజినీరింగ్ వస్తువుల విక్రయాలు దాదాపు రెండింతలు పెరిగి 7.5 బిలియన్ డాలర్లకు చేరుకుంటాయని ఎగుమతిదారుల అంచనా.ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ, బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ సమక్షంలో గతేడాది జరిగిన ఈ పరస్పర ప్రయోజనకరమైన ఒప్పందం.. దాదాపు 99 శాతం పన్ను విధించే వస్తువుల జాబితాపై సుంకాలను రద్దు చేస్తుంది. ఇది దాదాపు 100 శాతం వాణిజ్య విలువను సూచిస్తూ.. భారతదేశ ఎగుమతులకు విస్తృత అవకాశాలను సృష్టిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులున్నప్పటికీ భారతదేశ ఎగుమతులు గణనీయంగా వృద్ధి చెందుతున్నాయి.యువ మేధస్సు, ప్రపంచ స్థాయి ఆవిష్కరణలు– ప్రజలే కేంద్రంగా రూపొందించిన ఎఫ్‌టీఏ.. జూలై 15న యువజన నైపుణ్యాల దినోత్సవం రోజున అమల్లోకి వస్తుంది. 2015లో సరిగ్గా ఇదే రోజున స్కిల్ ఇండియా మిషన్‌ను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభించారు. మన యువత భారత్‌లోనే కాక ప్రపంచవ్యాప్తంగా పోటీపడేలా, పాలుపంచుకునేలా, నాయకత్వం వహించేలా ఈ మిషన్ సాధికారత కల్పిస్తోంది.భారతదేశ యువత ప్రయోజనాల కోసం బ్రిటన్ సేవా రంగానికి సంబంధించి సమగ్ర హామీల్లో మెరుగైన ఒప్పందాన్ని అందించింది. ఇది భారతదేశ ఎగుమతులకు ఉపయోగపడే అన్ని ప్రధాన రంగాలు, మరో 137 ఉప రంగాలకు వర్తిస్తుంది. దీనివల్ల మార్కెట్ సౌలభ్యం మెరుగుపడటంతో పాటు నియమ నిబంధనలపై స్పష్టత వస్తుంది. ఫలితంగా ఐటీ, ఐటీ ఆధారిత సేవలు, ఆర్థిక సేవలు, వృత్తిపరమైన సేవలు, ఆరోగ్య సంరక్షణ, విద్య, ఇంజినీరింగ్, టెలికమ్యూనికేషన్లు, కన్సల్టెన్సీ రంగాల్లోని భారత సేవా రంగానికి చెందిన వారికీ మేలు జరుగుతుంది.ఉపాధి కల్పన– రత్నాలు, ఆభరణాలు, వస్త్రాలు, తోలు, పాదరక్షలు, సేంద్రీయ రసాయనాలు, ప్లాస్టిక్స్, ఆటో విడిభాగాలు, హస్తకళలు, ఆహార శుద్ధి వంటి రంగాలు.. కార్యకలాపాలను విస్తరించి, మార్కెట్ పరిధిని పెంచుకోవటం ద్వారా యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు లభిస్తాయి.ప్రపంచ సరఫరా వ్యవస్థకు మార్గాన్ని సుగమం చేయటం, పోటీతత్వాన్ని పెంచటం ద్వారా అంతర్జాతీయ మార్కెట్లలో విజయవంతంగా రాణించేందుకు, వృద్ధిని సాధించటానికి అవసరమైన కీలక నైపుణ్యాలను, అవకాశాలను భారతదేశ యువతకు సెటా అందిస్తుంది.సెటా ఒప్పందంలో డబుల్ కంట్రిబ్యూషన్ కన్వెన్షన్ కీలక భాగం. సెటాతో పాటు అమలయ్యే ఈ కీలక ఒప్పందం వల్ల తాత్కాలిక పనులకు బ్రిటన్ వెళ్లే భారత ఉద్యోగులకు, యాజమాన్యాలకు అక్కడ అదనంగా సామాజిక భద్రతా పన్ను చెల్లింపుల నుంచి మినహాయింపు లభిస్తుంది.విదేశాల్లో తాత్కాలికంగా విధుల్లో ఉన్నప్పటికీ ఉద్యోగులకు సామాజిక భద్రత రక్షణ లభించేలా చూసే ఈ నిర్ణయం ద్వారా 75,000 మందికి పైగా భారత నిపుణులు, 900కి పైగా కంపెనీలకు లబ్ధి చేకూరుతుంది.స్థానిక వృద్ధి, ప్రపంచవ్యాప్తంగా విక్రయాలు– ఈ ఒప్పందం ద్వారా 37.5 బిలియన్ డాలర్ల విలువైన బ్రిటన్ మార్కెట్లోకి భారత రైతులకు సులభంగా ప్రవేశం లభిస్తుంది. దీనివల్ల భారతదేశం నుంచి డైయిరీ ఉత్పత్తులు, టీ, కాఫీ, మసాలా దినుసులు, పండ్లు, కూరగాయలు, పండ్ల రసాలు, మాంసం, శుద్ధి చేసిన వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు భారీగా పెరుగుతాయి. బ్రిటన్ దిగుమతి చేసుకునే వ్యవసాయ ఉత్పత్తుల్లో దాదాపు 95 శాతం ఉత్పత్తులపై భారత్‌కు ఎలాంటి సుంకాలు వర్తించవు. ఈ భారీ మార్కెట్‌కు జరిగే ఎగుమతులు రాబోయే మూడేళ్లలో 50 శాతం పెరిగే అవకాశముంది. ఇది రైతుల ఆదాయాన్ని పెంచటమే కాక, వ్యవసాయ విలువ వ్యవస్థ అంతటా ఉద్యోగావకాశాలను సృష్టిస్తుంది.ఈ ఒప్పందం డైయిరీ, కూరగాయలు, ఆపిల్స్, వంటనూనెలు, ఓట్స్, చిరుధాన్యాలు వంటి వ్యవసాయ ఉత్పత్తులను "మినహాయింపులు లేని వస్తువుల జాబితా" లో చేర్చటం ద్వారా వాటికి పూర్తి రక్షణ కల్పించింది. ఈ వస్తువులపై బ్రిటన్‌కు ఎలాంటి పన్ను మినహాయింపులు ఇవ్వలేదు. ఆహార భద్రత, దేశీయ ధరల స్థిరత్వం, చిన్న తరహా రైతు వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వాలనే ప్రధానమంత్రి మోదీ ప్రభుత్వ వ్యూహాన్ని ఈ మినహాయింపులు స్పష్టం చేస్తున్నాయి.ఎస్ఎంఈలు– స్థానిక శ్రమ, ప్రపంచస్థాయి వృద్ధి– భారతదేశంలోని చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎస్ఎంఈలు)కు పీఎం మోదీ ఎల్లప్పుడూ ప్రాధాన్యతనిస్తారు. 2024–25లో భారత్ మొత్తం ఎగుమతుల్లో 45.8 శాతం వాటా గల కీలకమైన ఎస్ఎంఈ రంగానికి సాయం చేసేందుకు సెటా ఒప్పందంలో ప్రత్యేక అధ్యాయాన్ని కేటాయించారు. వేగవంతమైన సుంకాల అనుమతులు, డిజిటల్ వ్యవస్థల గుర్తింపు, కాగిత రహిత వాణిజ్యాన్ని సులభతరం చేసే ఒప్పందాల వంటి కీలక నిబంధనల ద్వారా సెటా ఒప్పందం చిన్న తరహా పరిశ్రమలకు సహాయపడుతుంది.మార్కెట్లో లభించే ప్రత్యేక రాయితీలతో పాటు వ్యాపార విధానాలు, విద్య, ఆర్థికం, డిజిటల్ నైపుణ్యాలు, వాణిజ్య మౌలిక సదుపాయాలు, ఇతర ముఖ్యమైన రంగాల్లో పరస్పర సహకారం పెరగటం వల్ల చిన్న, మధ్య తరహా పరిశ్రమలు లబ్ధి పొందుతాయి.మత్స్యకారులకు అధిక ప్రయోజనం– భారతదేశ మత్స్యకారులు, అక్వా రంగానికి సెటా ద్వారా ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ఇది దాదాపు 2.8 కోట్ల మంది జీవనోపాధికి ఆసరాగా నిలుస్తుంది.మెరుగైన మార్కెట్ సౌకర్యాలు, ఎగుమతుల పెంపు వల్ల ఆంధ్రప్రదేశ్, గుజరాత్, కర్ణాటక, ఒడిశా, మహారాష్ట్ర తీర ప్రాంత మత్స్యకారులకు భారీ లబ్ధి చేకూరుతుంది. ఇది భారత మత్స్య ఉత్పత్తుల ఎగుమతులను బలోపేతం చేయటమే కాక మత్స్యకారుల సంక్షేమం, జీవనోపాధి మెరుగుదలకు, తీరప్రాంత ఆర్థికాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుంది.మహిళల ఘనవిజయం– సంప్రదాయ ఎఫ్‌టీఏల పరిధిని దాటి కుదిరిన ఈ కీలక ఒప్పందం.. సుస్థిర, సమ్మిళిత ఆర్థిక వృద్ధిని సాధించటంలో మహిళల పాత్రను గుర్తిస్తుంది. మహిళలకు అవకాశాలను, ప్రయోజనాలను పెంపొందించటమే దీని ముఖ్య ఉద్దేశం.మార్కెట్లు, అభివృద్ధి చెందుతున్న రంగాల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచేందుకు, ఆర్థిక సమ్మిళితత్వం, ఆర్థిక అక్షరాస్యతను ప్రోత్సహించేందుకు, పని ప్రదేశాల్లో మహిళలకు సమాన అవకాశాలను కల్పించేందుకు, వారి సామర్థ్యాలను, నైపుణ్యాలను పెంపొందించేందుకు అవసరమైన కార్యక్రమాలను చేపట్టేందుకు ఇరుదేశాలు కట్టుబడి ఉన్నాయి.టా కేవలం వాణిజ్య ఒప్పందం మాత్రమే కాదు. ఇది భారతదేశ సామర్థ్యాలు, ఆకాంక్షలపై పెట్టుకున్న విశ్వాసానికి నిదర్శనం. ప్రపంచ వాణిజ్యంలో భారత్ కేవలం భాగస్వామిగా మాత్రమే కాకుండా వాణిజ్య శక్తిగా ఎదగటాన్ని ప్రతిబింబిస్తోంది. ఇది రైతులు, మత్స్యకారులు, కార్మికులు, మహిళా పారిశ్రామికవేత్తలు, ఎంఎస్ఎంఈలు, నిపుణులు, యువతకు మరింత ఊతమిస్తూ.. దేశంలోని ప్రతీ ప్రాంతం, ప్రతీ భారతీయుడికి సరికొత్త అవకాశాలను కల్పిస్తుంది.



శ్రీ పీయూష్ గోయల్
(రచయిత- కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ)

# ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగం పనులు ప్రారంభించాలి...

- **సామాన్యుల కష్టాలపై ప్రధాని ఎప్పుడు నోరు విప్పుతారని ప్రశ్న**

**ఢిల్లీ వెలుతురు జూలై 14:**

దేశంలో రోజురోజుకూ పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరలపై కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. జూన్ నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం ఒక్కసారిగా 4.38 శాతానికి పెరగడంతో మోదీ ప్రభుత్వంపై విమర్శల దాడిని ముమ్మరం చేసింది. గత 12 ఏళ్లుగా కొనసాగుతున్న భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రభుత్వ పాలనలో ధరల పెరుగుదల కారణంగా దేశంలోని సామాన్య, మధ్యతరగతి కుటుంబాల బడ్జెట్ పూర్తిగా అతలాకుతలమైందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ మండిపడ్డారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్) లో ఒక సుదీర్ఘమైన పోస్ట్ చేస్తూ కేంద్ర ప్రభుత్వ తీరును ఎండగట్టారు.బీజేపీ ప్రభుత్వ 12 ఏళ్ల పాలనలో దేశ ప్రజలకు తప్పుడు హామీలు ఇవ్వడం మాత్రమే పెరిగిందని జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు. క్షేత్రస్థాయిలో మాత్రం ద్రవ్యోల్బణం, తీవ్రమైన నిరుద్యోగం రూపంలో సామాన్య ప్రజలపై ప్రభుత్వం పెను భారాన్ని మోపిందని విమర్శించారు. ప్రభుత్వ అధికారిక గణాంకాలే జూన్ నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం ఏకంగా 17 నెలల గరిష్ఠ స్థాయికి చేరినట్లు స్పష్టంగా చూపిస్తున్నాయని ఆయన గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా ప్రజలు ధరల పెరుగుదలతో ఇంతలా ఇబ్బందులు పడుతుంటే, ప్రధాని నరేంద్ర మోదీ దీనిపై ఎప్పుడు స్పందిస్తారని, సామాన్యుల కష్టాల గురించి ఎప్పుడు మాట్లాడతారని జైరాం రమేశ్ సూటిగా ప్రశ్నించారు.జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) తాజాగా విడుదల చేసిన నివేదికల ప్రకారం, మే నెలలో 3.93 శాతంగా నమోదైన వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం, జూన్ వచ్చేసరికి ఒక్కసారిగా 4.38 శాతానికి పెరిగింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నిర్దేశించుకున్న 4 శాతం ద్రవ్యోల్బణ నియంత్రణ లక్ష్య మార్కును ఇది దాటడం గమనార్హం. జనవరి నెల నుంచి అమల్లోకి వచ్చిన 2024 ప్రాతిపదిక సంవత్సరపు కొత్త శ్రేణి లెక్కల ప్రకారం, ద్రవ్యోల్బణం ఈ 4 శాతం మార్కును అధిగమించడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం.దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం ఈ స్థాయిలో పెరగడానికి ప్రధాన కారణం ఆహార వస్తువుల ధరలు విపరీతంగా పెరగడమేనని ప్రభుత్వ అధికారులు సైతం అంగీకరిస్తున్నారు. మే నెలలో 4.78 శాతంగా ఉన్న ఆహార ద్రవ్యోల్బణం, జూన్ నాటికి 5.32 శాతానికి చేరింది. ముఖ్యంగా వెండి, బంగారం, వజ్రాలు వంటి ఆభరణాలతో పాటు వంటింట్లో నిత్యం వాడే అల్లం, టమాటా, కిస్మిస్ వంటి నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకాయి. మరోవైపు బంగాళాదుంప, బఠానీలు, జీలకర్రతో పాటు కార్లు, మోటార్‌సైకిళ్లు, స్కూటర్ల ధరల పెరుగుదల వేగం కొంత తక్కువగా నమోదైనట్లు ఎన్ఎస్ఓ తన నివేదికలో వెల్లడించింది.కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాలను పరిశీలిస్తే ధరల పెరుగుదల ప్రభావం పట్టణ ప్రాంతాల కంటే గ్రామీణ ప్రాంతాలపైనే చాలా ఎక్కువగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. దేశవ్యాప్తంగా సగటు రిటైల్ ద్రవ్యోల్బణం 4.38 శాతంగా ఉంటే, పల్లెటూళ్లలో ఇది ఏకంగా 4.74 శాతంగా నమోదైంది. అదే సమయంలో పట్టణ ప్రాంతాలలో ద్రవ్యోల్బణం రేటు 3.92 శాతంగా ఉంది. ఈ లెక్కలను బట్టి చూస్తే, ఆర్థికంగా వెనుకబడిన గ్రామీణ ప్రజలు నిత్యావసర వస్తువులను కొనుగోలు చేయడానికి పట్టణ వాసుల కంటే ఎక్కువ డబ్బు ఖర్చు చేయాల్సి వస్తోందని తెలుస్తోంది.ద్రవ్యోల్బణం గరిష్ఠ స్థాయికి చేరడం వల్ల భవిష్యత్తులో దేశంలో బ్యాంకు వడ్డీ రేట్లు కూడా మరింత పెరిగే ప్రమాదం ఉందని జైరాం రమేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. అదే గనుక జరిగితే, బ్యాంకుల నుంచి గృహ రుణాలు (హోమ్ లోన్స్), వాహన రుణాలు తీసుకున్న మధ్యతరగతి ప్రజల నెలవారీ ఈఎంఐలు మరింత భారం కానున్నాయని హెచ్చరించారు. ఇప్పటికే ధరల దెబ్బకు సతమతమవుతున్న సామాన్యులపై ఈ వడ్డీ రేట్ల పెంపు అనేది కోలుకోలేని అదనపు భారంగా మారుతుందని ఆయన స్పష్టం చేశారు.దేశంలో ఒకవైపు సామాన్య ప్రజలు రోజువారీ ఖర్చులకే ఇబ్బంది పడుతుంటే, పెద్ద పెద్ద పారిశ్రామిక వర్గాలు మరియు కార్పొరేట్ సంస్థల లాభాలు మాత్రం విపరీతంగా పెరుగుతున్నాయని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ఆరోపించారు.

# పదవుల కంటే ప్రజల పక్షాన నిలబడటమే గొప్పదని చాటిన నేత ముద్రగడ పద్మనాభం

- **ముద్రగడ పద్మనాభం ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా**
- **ముద్రగడ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా**
- **కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్**

**హైదరాబాద్ వెలుతురు జూలై 14:**



పదవుల కంటే ప్రజల పక్షాన నిలబడటమే గొప్పదని చాటిన నేత ముద్రగడ పద్మనాభం అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొనియాడారు. కాపు జాతి ఆత్మగౌరవానికి ప్రతీక ముద్రగడ అని అభివర్ణించారు. కాపుల హక్కుల కోసం తన జీవితాన్నే పోరాటంగా మార్చుకున్న యోధుడు. కాపు జాతి ఆత్మగౌరవం కోసం ఆకలిని ఆయుధంగా మార్చుకుని నిరాహార దీక్షలు చేసిన నాయకుడు ముద్రగడ పద్మనాభం మరణం తనను తీవ్రంగా కలిచి వేసిందని పేర్కొన్నారు. ముద్రగడ పద్మనాభం మరణవార్త తెలుసుకున్న బండి సంజయ్ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఏమన్నారంటే.ఆంధ్రప్రదేశ్ రాజకీయ, సామాజిక చరిత్రలో కాపు ఉద్యమం గురించి ప్రస్తావన వచ్చినప్పుడల్లా ముందుగా గుర్తుకు వచ్చే పేరు ముద్రగడ పద్మనాభం. కాపు సామాజిక వర్గం హక్కులు, ఆత్మగౌరవం, రాజకీయ ప్రాధాన్యం కోసం దశాబ్దాలుగా నిరంతరంగా పోరాడిన నాయకుడిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు.తూర్పుగోదావరి జిల్లాలోని కిర్లంపూడి కేంద్రంగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన ముద్రగడ పద్మనాభం, ఎమ్మెల్యేగా, మంత్రిగా ప్రజలకు సేవలందించారు. అధికారంలో ఉన్నప్పుడు మాత్రమే కాకుండా, అధికారానికి దూరంగా ఉన్న సమయంలో కూడా ప్రజా సమస్యలపై తన గళాన్ని వినిపించడం ఆయన ప్రత్యేకత. ముఖ్యంగా కాపు సామాజిక వర్గానికి రిజర్వేషన్లు, సముచిత గుర్తింపు కల్పించాలనే డిమాండ్‌తో చేపట్టిన ఉద్యమాలు రాష్ట్ర రాజకీయాల్లో విశేష ప్రభావం చూపాయి.కాపు సమాజం ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంలో ముద్రగడ కీలక పాత్ర పోషించారు. తన డిమాండ్ల సాధన కోసం నిరాహార దీక్షలు, నిరసన కార్యక్రమాలు చేపట్టి ఉద్యమానికి కొత్త ఊపును తీసుకువచ్చారు. అనేక సందర్భాల్లో వ్యక్తిగత ఇబ్బందులను, రాజకీయ ఒత్తిడులను ఎదుర్కొన్నప్పటికీ తన లక్ష్యం నుంచి వెనక్కి తగ్గకపోవడం ఆయన సంకల్పబలానికి నిదర్శనం.ముద్రగడ పద్మనాభం వ్యక్తిత్వంలో నిక్కచ్చితనం, ధైర్యం, నిబద్ధత ప్రధానంగా కనిపిస్తాయి. రాజకీయ లాభనష్టాలను పక్కనపెట్టి తాను నమ్మిన అంశంపై చివరి వరకు నిలబడే నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. కాపు సమాజంలోని అనేక మంది ఆయనను ఉద్యమ స్ఫూర్తిగా, ఆత్మగౌరవ ప్రతీకగా భావిస్తారు.నేటి రాజకీయ పరిస్థితుల్లో కూడా ముద్రగడ పేరు కాపు సమాజంలో విశేష ప్రభావాన్ని కలిగి ఉంది. ఆయన చేసిన పోరాటాలు, ఉద్యమాలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయి. కాపు జాతి హక్కుల కోసం అంకిత భావంతో పనిచేసిన ఉద్యమనేతగా ముద్రగడ పద్మనాభం పేరు తెలుగు రాష్ట్రాల చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది.

# రామంతాపూర్ పెద్దచెరువులో హైడ్రా బుల్డోజర్

- **2,180 గజాల ఆక్రమణల తొలగింపు**
- **నిర్మాణంలో ఉన్న జీ ప్లస్–2 భవనం కూల్చివేత**
- **280 గజాల ఆటో గ్యారేజీ నేలమట్టం**
- **రూ.19 కోట్ల చెరువు అభివృద్ధి పనులకు మార్గం సుగమం**
- **30 ఎకరాల ఎఫ్‌టీఎల్‌లో 16 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు గుర్తింపు**
- **గుడిసెలవారికి డబుల్ బెడ్‌రూం ఇళ్ల మంజూరుకు హైడ్రా సిఫారసు**

**ఉప్పల్ వెలుతురు జూలై 14:**

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని రామంతాపూర్ పెద్దచెరువులో హైడ్రా మరోసారి భారీ స్థాయిలో ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టింది. చెరువు పరిరక్షణ, పునరుద్ధరణకు ప్రాధాన్యం ఇస్తూ మంగళవారం నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో మొత్తం 2,180 గజాల మేర ఆక్రమిత స్థలాన్ని స్వాధీనం చేసుకుని చెరువు పరిధిలోకి తీసుకొచ్చింది. ఈ చర్యల్లో భాగంగా నిర్మాణంలో ఉన్న 1,900 గజాల జీ ప్లస్–2 వాణిజ్య భవనాన్ని, అలాగే 280 గజాల విస్తీర్ణంలో ఉన్న ఆటో గ్యారేజీని కూల్చివేసింది. దీంతో చెరువు ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్) విస్తరణ పనులకు ఉన్న ప్రధాన అడ్డంకులు తొలగిపోయాయి.రామంతాపూర్ పెద్దచెరువు హైదరాబాద్ నగర పరిసర ప్రాంతాల్లోని కీలక జలవనరుల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. ఈ చెరువు పూర్తి స్థాయి ఎఫ్‌టీఎల్ విస్తీర్ణం 30 ఎకరాలు కాగా, కాలక్రమేణా సుమారు 16 ఎకరాల మేర ఆక్రమణలకు గురైనట్లు అధికారులు గుర్తించారు. వీటిలో దాదాపు 12 ఎకరాల్లో శాశ్వత నిర్మాణాలు వెలిసినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన సుమారు నాలుగు ఎకరాల్లో తాత్కాలిక షెడ్లు, గుడిసెలు ఏర్పాటు చేసి అనేక కుటుంబాలు నివాసం ఉంటున్నాయి.చెరువు పరిరక్షణతో పాటు మానవీయ కోణాన్నీ దృష్టిలో పెట్టుకున్న హైడ్రా, గుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాలను వెంటనే ఖాళీ చేయించకుండా వారికి ప్రత్యామ్నాయంగా డబుల్ బెడ్‌రూం ఇళ్లను మంజూరు చేయాలని ప్రభుత్వానికి సిఫారసు చేసింది. చెత్త సేకరణ, కూలీ పనులు వంటి అసంఘటిత రంగాల్లో ఉపాధి పొందుతున్న నిరుపేద కుటుంబాలు అక్కడ నివసిస్తున్నట్లు గుర్తించిన అధికారులు, వారిని పునరావాసం కల్పించిన తర్వాతే తదుపరి చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ ప్రతిపాదనపై ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించినట్లు అధికారులు వెల్లడించారు. అర్హులైన కుటుంబాలకు ప్రాధాన్య క్రమంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపునకు చర్యలు ప్రారంభమైనట్లు సమాచారం.ప్రతి వర్షాకాలంలో రామంతాపూర్ పెద్దచెరువు నిండినప్పుడు గుడిసెల్లో నివసించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెరువులోకి వరద నీరు చేరడంతో గుడిసెలు మునిగిపోవడం, ఇంటి సామగ్రి దెబ్బతినడం, కుటుంబాలు తాత్కాలికంగా ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితులు తరచూ ఎదురవుతున్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా హైడ్రా చెరువు పునరుద్ధరణ కార్యక్రమాన్ని వేగవంతం చేసింది. ఒకవైపు ఆక్రమణలను తొలగిస్తూనే, మరోవైపు ప్రభావిత కుటుంబాలకు పునరావాసం కల్పించే చర్యలు చేపడుతోంది.ప్రస్తుతం రామంతాపూర్ పెద్దచెరువు అభివృద్ధికి ప్రభుత్వం సుమారు రూ.19 కోట్లతో ప్రత్యేక ప్రాజెక్టును అమలు చేస్తోంది. ఈ ప్రాజెక్టులో భాగంగా చెరువు ఎఫ్‌టీఎల్ పునరుద్ధరణ, బండల నిర్మాణం, బలమైన కరకట్టల ఏర్పాటు, వర్షపు నీటి ప్రవాహ మార్గాల అభివృద్ధి, చెరువు సుందరీకరణ, నడక మార్గాల ఏర్పాటు, పచ్చదనం పెంపు వంటి పలు పనులు చేపట్టనున్నారు. అయితే ఎఫ్‌టీఎల్ పరిధిలో కొనసాగుతున్న ఆక్రమణలు పనులకు ప్రధాన అడ్డంకిగా మారాయి. మంగళవారం చేపట్టిన చర్యలతో ఆ ఆటంకాలు గణనీయంగా తొలగిపోయినట్లు అధికారులు తెలిపారు.ఆపరేషన్ సందర్భంగా భారీ యంత్రాలతో నిర్మాణంలో ఉన్న వాణిజ్య భవనాన్ని



కూల్చివేశారు. అలాగే చెరువు పరిధిలో నడుస్తున్న ఆటో గ్యారేజీని కూడా తొలగించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎలాంటి కొత్త నిర్మాణాలకు అవకాశం ఇవ్వబోమని, చెరువు భూములను పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొచ్చే వరకు చర్యలు కొనసాగుతాయని హైడ్రా అధికారులు స్పష్టం చేశారు.చెరువుల ఆక్రమణల వల్ల నగరంలో వర్షపు నీటి పారుదల వ్యవస్థ దెబ్బతింటోందని, ఫలితంగా భారీ వర్షాల సమయంలో నీటిమునిగే సమస్యలు అధికమవుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. చెరువులను వాటి అసలు విస్తీర్ణంలో పునరుద్ధరిస్తే వరద నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు భూగర్భ జలాలు కూడా మెరుగుపడతాయని వారు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో రామంతాపూర్ పెద్దచెరువు పునరుద్ధరణ నగర పర్యావరణ పరిరక్షణలో కీలక ఘట్టంగా భావిస్తున్నారు.ఇటీవలి కాలంలో హైదరాబాద్ నగర పరిధిలోని పలు చెరువుల ఆక్రమణలపై హైడ్రా వరుసగా చర్యలు చేపడుతోంది. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను పరిరక్షించడమే లక్ష్యంగా అక్రమ నిర్మాణాలపై కఠినంగా వ్యవహరిస్తోంది. కోర్టు ఆదేశాలు, రెవెన్యూ రికార్డులు, సర్వే వివరాల ఆధారంగా ఆక్రమణలను గుర్తించి తొలగింపు కార్యక్రమాలను కొనసాగిస్తోంది. ప్రభుత్వ భూములు, చెరువులు, నాళాల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదని పలుమార్లు స్పష్టం చేసింది.రామంతాపూర్ పెద్దచెరువులో చేపట్టిన తాజా చర్యలతో చెరువు అభివృద్ధి పనులు మరింత వేగంగా సాగనున్నాయని అధికారులు తెలిపారు. చెరువు సామర్థ్యం పెరగడం ద్వారా వర్షపు నీటి నిల్వ మెరుగుపడటంతో పాటు పరిసర ప్రాంతాల్లో వరద ముప్పు తగ్గుతుందని, పర్యావరణ సమతుల్యతకు కూడా ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఆక్రమణల తొలగింపుతో రామంతాపూర్ పెద్దచెరువు తన అసలు స్వరూపాన్ని తిరిగి పొందే దిశగా మరో కీలక అడుగు పడిందని అధికారులు పేర్కొన్నారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com